
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 459
వెల : రూ.25/-
జూన్ 2023




జనసాహితి ప్రచురణ



FIRST TIME EVER IN
PRAKASAM DISTRICT
IN PAPER -1
HISTORY CREATED !
JEE MAIN - 2023
ALL INDIA TOP PERCENTILE
Students favourite college
శ్రీ సరస్వతి
ఒంగోలు, ప్రకాశం జిల్లా.
IIT & NEET ACADEMY
JUNIOR COLLEGE
Highlights
IIT-JEE
141
18
35
52
99.07
PERCENTILE
KANTA VISHNU MADHAV
ALL INDIA RANK
OPEN CATEGORY
2454
98.41
THUMMA NITHIN REDDY
APP. NO. : 230310472601
98.15
MANNAM AMULYA
APP. NO. : 230310398995
M.P.C.
IIT - JEE Advance / JEE Mains / EAPCET
Bi.P.C.
NEET / EAPCET
C.E.C & M.E.C
With CA foundation
Seperate Hostel facility available for Boys & Girls
Bus facility available
Sri. A. GANESH REDDY
Cell : 9176 16 26 96
Sri. A.G. SANKAR REDDY
Cell : 8143 66 8888
contact for more details
73068 81966, 96761 77136, 80939 51778
Sri. A.V. RAMANA REDDY
CHAIRMAN - SRI SARASWATHI GROUPS
Cell : 98488 79655
బాధ్యతాయుత విద్యా విధానమే మా లక్ష్యం... మీకు విజయాన్ని చేకూర్చటమే మా గమ్యం... "శ్రీ సరస్వతి"
JEE MAIN - 2023
99.07
KANTA VISHNU MADHAV
98.41
THUMMA NITHIN REDDY
98.15
MANNAM AMULYA
EAPCET - 2022
512
S. BHARGAVI 2011R03132
1202
P. GANESH 90874020002
1464
K. PRANEETH REDDY 50679030172
JR. IPE - 2023
1st STATE
466
K. SAI KIRAN 2307136306
465→2
మార్కులు సాధించిన విద్యార్థులు
464→8
మార్కులు సాధించిన విద్యార్థులు
SR. IPE - 2023
987
K. MEGHANA 2307214192
986
D. MARUTHI PRIYA 2307214243
986
G. ANEESHA 2307213834

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

459

సంపుటి : 46
సంచిక : 11
జూన్ 2023

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | శ్రీశ్రీశ్రీ నరేంద్ర సార్వభౌములవారి పాలన – కార్టూన్ | అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | శ్రీ సరస్వతి జూనియర్ కాలేజి ప్రకటన | | .....02 |
| ✦ మూడవ అట్ట | : | దళిత చరిత్ర మాసం | | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : | పుట్టా పెంచల్‌దాస్ గీచిన బాతిక్ ఆర్ట్ చిత్రం | | .....36 |
| ✦ సంపాదకీయం–1 | : | మణిపూర్‌లో మతచిచ్చు! | | .....05 |
| ✦ సంపాదకీయం–2 | : | మహిళా రెజ్లర్లకు సంఘీభావం తెలియచేద్దాం! | | .....07 |
| ✦ కథలు | : | అమ్మవారి నవ్వు | – కేతు విశ్వనాథరెడ్డి | .....09 |
| | : | మొండిచెయ్యి | తెలుగు అనువాదం : డా॥ వెన్నా వల్లభరావు | .....25 |
| ✦ పరిచయం | : | 'నేటి నిజం' తెలుగు దినపత్రిక | | .....06 |
| ✦ వ్యాసం | : | పెట్టుబడిదారీ సమాజ శక్తుల నిరంతర దాడులు – దుష్ప్రచారాలు | – జి.వి. భద్రం | .....14 |
| ✦ ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (10) | | |
| | | యశపాల్ మహత్తర నవల 'ఝూటాసచ్' | – కొత్తపల్లి రవిబాబు | .....21 |
| ✦ వ్యంగ్యం | : | అధికార మార్పిడి! | – చెరుకూరి జ్యోతి | .....16 |
| ✦ గల్పిక | : | రథయాత్ర | – శంకరం | .....31 |
| ✦ సినిమా సమీక్ష | : | 'ది కేరళ స్టోరీ' | – బాలాజీ (కోల్‌కతా) | .....17 |
| ✦ జాతీయ స్వాతంత్ర్యోద్యమ యోధులు | : | కాజీ నజ్రుల్ ఇస్లాం | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....28 |
| ✦ కరపత్రం | : | శ్రీ లక్ష్మీ మహాయజ్ఞాన్ని..... | | .....29 |
| ✦ కవితలు | : | దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (27) | | |
| ✦ వివిధ | : | కృతజ్ఞతలు (08); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (24); వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (13, 32); ఈ పుస్తకాలు అందాయి (33) | | |
| ✦ సంతాపాలు | : | కేతు విశ్వనాథరెడ్డి (04), కార్టూనిస్టు సత్యమూర్తి (13), ఆప్లొం బెల్‌హాడ్జ్, క్రిస్ చే మత్లహాకో (30) | | |


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

### మార్క్సిస్టు కథారచయిత
# కేతు విశ్వనాథరెడ్డి మరణానికి సంతాపం



కథారచయిత, విద్యావేత్త ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 22-5-2023న ఒంగోలులో గుండెపోటుతో తన 84వ యేట మరణించారు. ఆయన 10-7-1939న కడప జిల్లాలోని ఎర్రగుంట్ల మండలం – రంగసాయిపురంలో సంపన్న కుటుంబంలో జన్మించారు.

కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వ్యాసంగం 1958లో కడపలో డిగ్రీ చదువుతున్నపుడే ప్రారంభమైంది. ఆ తర్వాత కడపలోనే అధ్యాపకునిగా పనిచేస్తూ 'కడప జిల్లా గ్రామ నామాలు' అనే అంశంపై పరిశోధన చేసి పి. హెచ్‌డి డిగ్రీ పొందారు. ఈ పరిశోధనా క్రమంలోనే కడప జిల్లా ప్రజల ఆచార వ్యవహారాలు, ఆర్థిక అసమానతలు, కరువు, ముఠా రాజకీయాలు మొదలైన సామాజిక విషయాలను అధ్యయనం చేశారు. కొన్నాళ్ళు 'ఆంధ్ర జనత' దినపత్రికలో పనిచేశారు. ఆ తర్వాత డా॥ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగంలో ఆచార్యునిగా పనిచేసి తెలుగు పాఠ్యపుస్తకాల సిలబస్‌ను, పుస్తకాలను ఆధునిక పద్ధతులతో చేకూరి రామారావుతో కలిసి రూపొందించారు. వాటిలో ఆధునిక సాహిత్యానికి ప్రముఖ స్థానం కల్పించారు. రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ తరపున కూడా తెలుగు పాఠ్యపుస్తకాలకు రూపకల్పన చేశారు. సామాజిక శాస్త్రాల సహాయంతో సాహిత్యాన్ని అధ్యయనం చేసే పద్ధతి గురించి అనేక వ్యాసాలు రాశారు. ఆయన రాసిన సాహిత్య వ్యాసాలను 'దృష్టి', 'సంగమం', 'పరిచయం'గా ప్రచురించారు.

ఏప్రిల్ 1968లో కడపలో రా.రా. సంపాదకత్వాన ప్రారంభమైన సాహిత్య త్రైమాస పత్రిక "సంవేదన"ను నిర్వహించిన యుగసాహితి సంస్థలో ఆయన సభ్యుడు. విశాలాంధ్ర ప్రచురించిన కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం ఆరు సంపుటాలలో ప్రతి సంపుటికి సంపాదకునిగా ఆయన రాసిన ముందుమాటలు అపూర్వమైనవి. కొన్నాళ్ళు ఆయన బాలవాదంపై కూడా కృషిచేశారు. 'ఈనాడు', 'ఆంధ్రభూమి', 'ఆంధ్రజ్యోతి' పత్రికా సిబ్బందికి జర్నలిజంపై, సాహిత్యంపై శిక్షణ ఇచ్చారు. 'మన భూమి', 'ఈ భూమి' పత్రికలకు సంపాదకత్వం వహించారు. రాయలసీమలోని కరువు, ముఠా తగాదాలపైనేగాక, వితంతువులపై, విద్యారంగంపై, పోలీసుశాఖపై, అటవీ, రెవిన్యూ, పంచాయితీరాజ్ శాఖలపై కూడా ఆయన కథలు రాశారు. దాదాపు వంద కథలు, రెండు నవలలు రాశారు. అరసం రాష్ట్ర అధ్యక్షులుగా కొంతకాలం వున్నారు. ప్రస్తుతం అరసం అధ్యక్షవర్గ సభ్యులుగా వున్నారు.

మార్క్సిస్టు దృక్పథంతో తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన కేతు విశ్వనాథరెడ్డి మరణానికి 'జనసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేస్తోంది.

సంపాదకీయం-1

# అడవులను, అటవీ సంపదలను దోచుకోటానికి మణిపూర్‌లో మత చిచ్చు!

**అటవీసంరక్షణ** చట్టాల పేరుతో అడవుల నుండి ఆదివాసీలను గెంటివేసి మన అడవులను, సహజ వనరులను కొల్లగొట్టిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల అడుగుజాడల్లోనే బిజెపి పాలకులు విభజించి పాలించు సూత్రాన్ని అమలుచేస్తున్నారు. ఆదివాసీ తెగల మధ్య ఘర్షణలను పెంచటమే గాక, ఆదివాసీలకు ఇతర మైదానప్రాంత కుల, మత, తెగల మధ్య వైషమ్యాలనూ పెంచుతున్నారు. ఆదివాసీలపై నేరస్థులనే ముద్రవేస్తున్నారు. నేడు మణిపూర్‌లో జరుగుతున్నదిదే.

అత్యంత వైవిధ్యం గల ఈశాన్య రాష్ట్రాలలో మణిపూర్ కూడా ఒకటి. ఈశాన్య ప్రాంతాల్లో జీవిస్తున్న సుమారు 200ల ఆదివాసీ తెగలు తమ మనుగడ కోసం, భూమిపై అడవులపై హక్కుల కోసం, తమ సంస్కృతులను కాపాడుకోవటం కోసం బ్రిటీష్‌వారిపై సమష్టిగా పోరాడిన చరిత్ర వారిది. ఈశాన్య ప్రాంత ఆదివాసీల అటవీ భూములను కాజేయటానికి మొదటి నుండి పాలకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తూనే వున్నారు. సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టం (AFSPA) తెచ్చి వారి పోరాటాలను అణచివేయ చూశారు. లొంగని వారిని మభ్యపెట్టడానికి ఆర్టికల్ 371ని తీసుకువచ్చారు. ఆర్టికల్ 371 ప్రకారం – వెనుకబడిన ప్రాంతాల ప్రజల ఆర్థిక, సాంస్కృతిక హక్కులను కాపాడాలి. మన రాష్ట్రం 1/70 చట్టంలో ఉన్నట్లు అక్కడి భూములను బయటవారు కొనడం, అమ్మడం, ఆక్రమించటమూ నిషిద్ధం. అంతేగాక ఆర్టికల్ 371 అమలులో వుండేచోట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు చెల్లవు. గవర్నర్ పర్యవేక్షణలో రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఈ చట్టం అమలవుతుంది.

అటువంటి మణిపూర్ ప్రాంతంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఆర్టికల్ 371ను ఉల్లంఘిస్తూ సర్వేలంటూ, ఆక్రమణల నివారణ అంటూ అటవీ ప్రాంతంలోకి చొరబడి మైదాన ప్రాంతాలవారికి అటవీ భూములను కట్టబెడుతున్నాడు. దానితో మైదాన ప్రాంత మెయితీలకూ కొండ ప్రాంత కుకీ, మరియు ఇతర ఆదివాసీల మధ్య సంఘర్షణలు సాగుతున్నాయి. బిజెపి పాలకులు రగిల్చిన వైషమ్యాలతో మణిపూర్ మండుతోంది. ఆదివాసీల అధికారాలను కాపాడాల్సిన మణిపూర్ గవర్నరే కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను జారీ చేశారు. మణిపూర్ ప్రజల శాంతి సామరస్యాల కోసం కాకుండా మత విద్వేషాలతో ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తున్న బిజెపి పాలకుల తీరు ప్రజల అశాంతికి కారణమయ్యింది.

మణిపూర్ 90% భూభాగం కొండప్రాంతాలుగానూ, 10% భూభాగం లోయ ప్రాంతంగానూ వుంటుంది. 90%గా వున్న కొండ ప్రాంతంలో సేనాపతి, చురాచాంద్‌పూర్, వుక్రుల్, చందేల్, తామ్‌గ్లాంగ్ జిల్లాలలో కుకీలు, నాగాలు ఇతర 34 షెడ్యూల్డు తెగల ప్రజలు జీవిస్తున్నారు. జనాభాలో 43%గా వున్న వీరిలో 95% క్రైస్తవులు. 10 శాతంగా వున్న లోయ ప్రాంతంలో పశ్చిమ ఇంఫాల్, తూర్పు ఇంఫాల్, థౌబాల్, బిష్ణుపూర్ జిల్లాలలో మెయితీ కమ్యూనిటీ వారు నివశిస్తున్నారు. జనాభాలో 57%గా వున్న వీరిలో 75 శాతం మంది హిందువులు, ముస్లింలు వున్నారు. కొండప్రాంత ఆదివాసీలు ఏ ప్రాథమిక అవసరాలు లేని జీవన పరిస్థితులలో జీవిస్తుంటే, మెయితీలు వరిసాగు, గుర్రాలను పెంచటం వంటి వృత్తులతోపాటు దేశీయ, అంతర్జాతీయ టూరిజపు సంపాదనతో మెరుగ్గా వున్నారు. 60 మంది శాసనసభ్యులున్న మణిపూర్‌లో 40 నియోజకవర్గాలు లోయ ప్రాంతంలోనే వున్నాయి, 40 స్థానాలలో అధికారం మెయితీలదే. భూమిపై యాజమాన్య హక్కు, విద్య, వైద్యరంగాలు, ప్రభుత్వోద్యోగాలన్నింటా 65 నుండి 75 శాతం వరకు మెయితీలదే.

మెజార్టీ మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించాలంటూ హైకోర్టు తీర్పునిచ్చింది. దానితో తమ మనుగడకు, ఉనికికి రాబోతున్న ప్రమాదాన్ని గుర్తించిన ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ మణిపురి సంస్థవారు మే 3వ తేదీన ఆదివాసీ ఐక్యతా ప్రదర్శనకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలలో 60 మంది మరణించగా, 20,000 మంది నిరాశ్రయులయ్యారు. అప్పటినుండి కేంద్ర సాయుధ బలగాలు చేస్తున్న దాడుల్లో అనేకమంది చనిపోతున్నారు. నిరాశ్రయులవుతున్నారు. హింసకు గురవుతున్నారు. సైనికులు చేసే అరాచకాలకు అత్యాచారాలకు అంతే లేదు. మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణను కేంద్రం తన అధీనంలోకి తీసుకుని సైనిక నిర్బంధాన్ని విధించింది.

మణిపూర్‌ను పరిపాలిస్తున్న బిజెపి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, అతని ప్రభుత్వం, రాజకీయ సాంస్కృతిక చర్యల ద్వారా కొండప్రాంత ఆదివాసీల మీద యుద్ధాన్ని ప్రకటించింది. కుకీ ఆదివాసులు బర్మా నుంచి వలస వచ్చారని, చొరబాటుదారులని, అడవుల ఆక్రమణ దారులని, గంజాయి వంటి మాదకద్రవ్యాలు పండించే మాఫియాలని ప్రభుత్వమే ప్రచారం చేస్తోంది. కానీ నిజానికి గంజాయి వంటి మాదక ద్రవ్యాలను కొండ ప్రాంతంలో పండిస్తున్నది లోయ ప్రాంతంలోని ధనవంతులైన మెయితీలేనని బిజెపి శాసనసభ్యులే ఒప్పుకుంటున్నారు. అలాగే పట్టణ ఆధునీకరణ పెరగటంతో లోయ ప్రాంతంలోని పట్టణాలు సంఖ్య తగ్గిపోగా, కొండ ప్రాంతంలో ఆదివాసీల తెగల జనాభా

పెరగటంతో కొత్త గ్రామాలను నిర్మించుకునే ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం కొత్త గ్రామాలు పెరిగాయి. బర్మా (మయన్మార్) నుండి వలస వచ్చిన వందమందికన్న తక్కువ వున్న జనాభాను చూపించి ఆదివాసీలపై చొరబాటుదారులంటూ ప్రభుత్వం ముద్ర వేసింది. కోర్టు ఆదేశం ఇచ్చిందనో, అనుమతులు లేని కట్టడాలు అంటూ చురా చంద్‌పూర్ జిల్లాలోని 3 చర్చిలను ప్రభుత్వమే కూల్చివేసింది. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ సహాయ సహకారాలున్న అరంబాయి టెనెగోల్ అనే భజరంగ్‌దళ్ వంటి అర్ధఫాసిస్టు సంస్థ ఆదివాసీల చర్చిలను, మెయితీల చర్చిలనూ, ఆలయాలను కూడా ధ్వంసం చేసింది. జనాభాలో 57 శాతంగా వున్న మెయితీలను తన ప్రధాన ఓటుబ్యాంకుగా మార్చుకోవటానికి బిజెపి మతోన్మాదపూరిత చర్యలతో మణిపూర్ ప్రజల మధ్య చిచ్చు రగిల్చింది.

మెయితీలు మాట్లాడే మెయితీ భాషే మణిపురి భాష. వారి సంగీతం, సాహిత్యాలు, నృత్యాలు, జీవనరీతులే మణిపురి ప్రజల సంప్రదాయాలుగా చెలామణి అవుతూన్నాయి. సారవంతమైన భూములన్నీ మెయితీల యాజమాన్యం క్రిందే వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలని తీర్పు చెప్పటంతో ఆదివాసీల భూములను మెయితీలకు కట్టబెట్టే ప్రయత్నానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లయింది. ఈ అభద్రతా భావమే ఆదివాసీల ఆందోళనకు కారణమవుతుంది.

ఆందోళనలు చేస్తున్న ఆదివాసీలపై ప్రభుత్వం సైనిక బలగాలను దింపి అణచివేత చర్యలను, విద్వేషాలను రోజురోజుకూ పెంచుకుంటూ పోతోంది. కాశ్మీర్‌లో మోదీ ప్రభుత్వం వ్యవహరించినట్లయితే ఇక్కడ కూడా బయట ప్రపంచంతో సంబంధం లేకుండా చేయటానికి, సమాచారం బయటకు వెళ్ళకుండా ఉండటానికి ఇంటర్నెట్‌లు, ఫోన్‌లను నిలిపివేసింది. తమ భూములను, జీవనాధారాల్ని కోల్పోతున్న ఆదివాసీలు ప్రతిఘటిస్తున్నారు. కేంద్రంలోనూ, మణిపూర్ రాష్ట్రంలోనూ పరిపాలిస్తున్న బిజెపి పాలకులు ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారే తప్ప ప్రజలలో స్నేహపూరిత వాతావరణాన్ని, శాంతి భద్రతలను కాపాడే ప్రయత్నాలు చేయటంలేదు. ఆదివాసీ వ్యతిరేక అటవీ సంరక్షణ చట్టాలను అమలుచేయటానికి అవసరమైన ఆదివాసీ మహిళ, ఈ దేశ ప్రథమ పౌరురాలని పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవటం వెనుక ఉన్న హిందూ మతతత్త్వ భావజాలం, లౌకిక ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన విధానాల పాలకుల నిజస్వరూపం బయటపడింది.

రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ చెప్పినట్లుగా ఆదివాసీ తెగల భూములు, అడవులపై వారికి గల అన్ని హక్కులను ప్రభుత్వం సంరక్షించాలి. ఈరోజు మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంసం మిగతా రాష్ట్రాలలో జరగదనే నమ్మకం లేదు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో అటవీ సంరక్షణ చట్టాల పేరుతో అడవుల నుండి ఆదివాసీలను గెంటివేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మత, కుల, ప్రాంత తెగల నడుమ పాలకులు పనికట్టుకు సృష్టిస్తున్న విద్వేషాలకు, విభజనలకు వ్యతిరేకంగా, అణచివేతలు, వేధింపులు, హింసలకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమవ్వటం ఒక్కటే పరిష్కారం. మనదాకా వచ్చాక చూద్దామనుకునే ఉదాశీనతను వదిలి న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న, పోరాడుతున్న ప్రజలకు అండగా నిలబడదాం. ●

**పరిచయం :**

## నేటి నిజం తెలుగు దినపత్రిక

**దినపత్రికను** పరిచయం చేయడమేమిటి అని ఆశ్చర్యపోకండి. ఇది 29 సంవత్సరాల నుండి హైదరాబాదు కేంద్రంగా ప్రచురింప బడుతోంది. దీని సంపాదకులు నిజామాబాదుకు చెందిన బైస దేవదాసు. వీరు ఈ దినపత్రిక ప్రారంభించకముందు 1/4 క్రౌన్ సైజులో నిజామాబాద్ నుండి 'కేకలు' అనే వారపత్రికను ప్రచురించారు.

ఇంతకీ దినపత్రిక ఎందుకు పరిచయం చేయడం అంటే ఈ పత్రిక 18 సంవత్సరాల క్రితం నుండీ నేటివరకు ప్రతి గురువారం 'సాహితీ కెరటాలు' శీర్షికతో సాహిత్యాన్ని ప్రచురిస్తోంది. చాలా పత్రికలు ప్రతి సోమవారం సాహిత్యానికి ఒక పేజీ కేటాయిస్తున్నాయి గదా - దీని ప్రత్యేకత ఏమిటి? మొదట ఒక పేజీతో ప్రారంభమైన 'సాహితీ కెరటాలు' మొత్తం 6 పేజీలూ ఆక్రమించడమే దీని ప్రత్యేకత. గత ఐదారు సంవత్సరాలుగా దినపత్రిక సైజులో వున్న మొత్తం పేజీలలో సింహభాగం సాహిత్యంతో నింపడమే దీని ప్రత్యేకత.

తెలుగు రాష్ట్రాలలో వున్న చిన్నా, పెద్దా సాహిత్య మిత్రులందరికీ ఉచితంగా అందుతున్న ఈ పత్రిక గురువారం సంచికకు ప్రస్తుతం మూడు వేలమంది చందాదారులున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పుస్తకావిష్కరణ సభలు, సాహిత్య, సాంస్కృతిక సమావేశాల ఫొటోలు, సాహిత్యసభల వార్తలు, ప్రకటనలను ఉచితంగా వారం వారం ఈ పత్రిక అందిస్తోంది. పుస్తక పరిచయాలు, ఇతర భాషల రచయితల, కవుల పరిచయాలు, కథలతోపాటు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక మరియు దర్వాజా సాహిత్య వేదిక వాట్సాప్ సమూహ ఏకాంశ కవిత్వమనే శీర్షిక క్రింద వారంవారం 10 నుండి 12 కవితలు, 'కణిక' సంస్థవారి 'బుధవారం బాదా' శీర్షికలో గెలిచిన మొదటి రెండవ బహుమతి కవితలు గాక మొత్తం 6 పేజీలనిండా దాదాపు 20 కవితలు ప్రచురిస్తున్నారు.

పూర్వం ఎప్పుడో కవిత్వాన్నే ప్రచురించిన 'కవితా' దినపత్రిక ఒకటి బెంగాల్‌లో వుండేది అని విన్నాం. వివిధ ప్రాంతాల నుండి తెలుగులో కవితా బులిటెన్లు 60-80ల కాలంలో వచ్చాయి. ప్రస్తుతం నెలనెలా విజయవాడ నుండి సాహితీ మిత్రుల నిర్వహణలో 'కవిత' అనే మాసపత్రిక వెలువడుతోంది.

కాని ఒక దినపత్రిక ప్రతివారం తన ఆరు పేజీలలో సాహిత్య రచనలను ప్రచురించడం ఒక విశేషం గనుక ఈ పరిచయం. దీని చందా వివరాలు పత్రికలో ఎక్కడా లేవు గనుక వారితో 9000065433 ఫోన్‌లో సంప్రదించవచ్చు. netinijam.comలో చూడవచ్చు. వారి ఈ-మెయిల్ : netinijam93@gmail.com ●

## సంపాదకీయం-2

## ఏ క్రీడాకారిణీ తమలా లైంగిక వేధింపులకు గురికాకూడదంటూ న్యాయం కోసం, ఆత్మాభిమానం కోసం పోరాడుతున్న

# మహిళా రెజ్లర్లకు సంఘీభావం తెలియచేద్దాం!

> "లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడు బ్రిజ్ భూషణ్ పార్లమెంటులో కూర్చున్నాడు. దేశం కోసం పతకాలను సాధించిన మమ్మల్ని రోడ్లపై ఈడ్చుకెళుతున్నారు. ఇది భారత క్రీడారంగానికి చీకటిరోజు"
>
> - సాక్షి మలిక్

**తమను** మానసికంగా, లైంగికంగా వేధించిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బిజెపి ఎం.పి. అయిన బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని, కామన్వెల్తు పోటీలు ఆసియా క్రీడలలో, ఒలింపిక్ పతకాలు సాధించిన అథ్లెట్లు, రెజ్లర్లు చేస్తున్న మహిళల మహా పంచాయత్ ఆందోళన కార్యక్రమాన్ని మే 28వ తేదీన పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ సమయంలో ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. క్రీడాకారులను అక్రమంగా, దౌర్జన్యంగా రోడ్ల మీద ఈడ్చుకు వెళ్ళి బలవంతంగా బస్సుల్లో పడేసి అరెస్టు చేశారు. ఆ సందర్భంగా పై మాటలను సాక్షి మలిక్ అన్నారు. భారతదేశ 'బేటీ బచావో' ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గౌరవం ఇది. ప్రధానమంత్రి రాజదండపు పాలనా విధానం ఇది. భారత ప్రజాస్వామ్యపు మేడిపండు స్వరూపం మరోసారి బట్టబయలయింది.

2023 జనవరి 18 నుండి మహిళా రెజ్లర్లు, అథ్లెట్లు (మల్లయోధులు, క్రీడాకారులు) దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద న్యాయ పోరాటం ప్రారంభించారు. కామన్వెల్తు క్రీడోత్సవాల్లో మూడుసార్లు స్వర్ణపతకాలు సాధించిన వినేశ్ ఫొగాట్ మహిళా క్రీడాకారిణిలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, మానసికంగా అనుభవిస్తున్న హింస గురించి మీడియా ముందు మాట్లాడారు. వినేశ్ ఫొగాట్, అను మలిక్, సాక్షి మలిక్, బజరంగ్ పునియా ఇలా 200 మందికి పైగా వున్న అథ్లెట్లు, రెజ్లర్లు క్రీడా కేంద్రాల్లో తమపై సాగుతున్న అరాచకాలను, అన్యాయాలను, అవమానాలను మీడియా ముందు వెల్లడి చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, అరెస్టు చేయకపోతే తీవ్ర నిర్ణయాలు తీసుకుంటామని ప్రభుత్వానికి తెలియచేశారు.

ఐనా పాలకులు పట్టించుకోలేదు. క్రీడాకారులూ ఆందోళనా కార్యక్రమాలు ఆపలేదు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రమేయంతో మేరీ కోమ్ సారథ్యంలో ఒక కమిటీని వేసి క్రీడాకారులకు న్యాయం చేయబోతున్నట్లు ప్రకటించారు. నెలలు గడుస్తున్నా కమిటీ నివేదికను ప్రభుత్వం బహిరంగపర్చలేదు సరికదా నేరస్థుడైన బ్రిజ్ భూషణ్‌న్నూ అరెస్టు చేయలేదు. మరల ఏప్రిల్ నెలలో న్యాయం కోసం రెజ్లర్లు, అథ్లెట్లు ఆందోళనలు జంతర్‌మంతర్ వద్ద మొదలుపెట్టారు. అర్ధరాత్రివేళ ఢిల్లీ పోలీసులు న్యాయపోరాట స్థలంలోని ఏర్పాట్లను ధ్వంసం చేసి, క్రీడాకారులపై విరుచుకుపడ్డారు. క్రీడాకారులు, వారి బంధువులు గాయాలపాలయ్యారు. తాగి వచ్చిన పోలీసులు క్రీడాకారుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అవమానించారు. రెజ్లర్లు, అథ్లెట్లు న్యాయం జరిగేంతవరకూ పోరాటాన్ని ఆపబోమని, తాము సాధించిన పతకాలను, పురస్కారాలను తిరిగి ఇచ్చేస్తామని ప్రకటించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు ఇవ్వటంతో ఏప్రిల్ 28న బ్రిజ్ భూషణ్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అప్పటినుండి ఇంతవరకూ బ్రిజ్ భూషణ్ మీద ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ అన్యాయాన్ని ఎలుగెత్తి చాటటానికే క్రీడాకారులు మహిళా మహాపంచాయత్ కార్యక్రమాన్ని భారత్ కిసాన్ యూనియన్, ఇతర ప్రజాసంఘాల మద్దతుతో నిర్వహించ తలపెట్టారు. రైతులకు సంబంధించిన మూడు నల్ల చట్టాల వ్యతిరేక పోరాట నాయకుడు రాకేశ్ షెకావత్‌ను అరెస్టు చేశారు. హర్యానా, ఢిల్లీ సరిహద్దులలో ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి వస్తున్న ప్రజాసంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మన జాతి గౌరవాన్ని ప్రపంచ క్రీడావేదికల మీద సగర్వంగా నిలిపిన ఈ క్రీడాకారులు నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నా న్యాయం దక్కని దుస్థితిలో నేడు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కూరుకుపోయి ఉందన్న వాస్తవాన్ని ఈ పోరాటం ప్రపంచానికి తెలియచేసింది.

బిజెపి ఎం.పి. బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ ఆరుసార్లు ఎం.పి.గా గెలిచాడు. అతని మీద నాలుగు క్రిమినల్ కేసులతోపాటు 30 కేసులు నమోదై వున్నాయి. గత 20 సం॥ల నుండి భారత రెజ్లింగ్ సమాఖ్యకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. దౌర్జన్యకారుడు, కామాంధుడు అయిన బ్రిజ్ భూషణ్ భారత రెజ్లింగ్ సమాఖ్యను తన సొంత జాగీరులా వాడుకుంటూ ఆటల పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో

పాటు మహిళా క్రీడాకారులతో అనుచితంగా ప్రవర్తించటం మీడియా ద్వారా తెలుస్తూన్న విషయాలే. ఆటలు, క్రీడలను వ్యాపారంగా మార్చేసిన తర్వాత రాజకీయ నాయకుల ఆధిపత్యం ఈ రంగంలో కొనసాగుతున్నది. ఆటలతో సంబంధంలేని వారు క్రీడాసంస్థలకు నాయకత్వం వహించటమేమిటని గతంలోనే సుప్రీంకోర్టు ఆక్షేపించినా దాన్ని పట్టించుకోకుండా ఆటలతో సంబంధంలేని రాజకీయ నాయకుల అండదండలున్నవారే క్రీడాసంస్థలకు బాధ్యులుగా కొనసాగటం, ప్రైవేటు వ్యక్తుల అడ్డాగా మారటం న్యాయంపట్ల చట్టాలపట్ల పాలకులకున్న నిబద్ధతకు నిదర్శనం.

క్రీడలను కెరీర్‌గా ఎన్నుకునే రంగంలోకి మహిళల ప్రవేశమే చాలా తక్కువ. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, సామాజికంగా కుటుంబపరంగా వివక్షలను ఎదుర్కొంటూ ఈ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. క్రీడల్లో రాణించటానికి ఎంతో కఠిన శిక్షణతో కఠోరమైన శ్రమతో కష్టపడుతూ పతకాలను సాధిస్తున్నారు. పతకాలు సాధించినప్పుడు చప్పట్లు చరిచే మనకి వారి జీవితాల్లోకి ఒకసారి తొంగిచూస్తే ఎంత విషాదం, ఎన్ని అవమానాలు, ఎన్ని హేళనలు నిండి వున్నాయో ఈ రెజ్లర్ల పోరాటం తెలియచేస్తుంది. సాధారణంగా పేద, మధ్యతరగతి, సామాజికంగా వెనుకబడిన, బలహీనవర్గాల కులాలకు చెందిన వీరంతా ఈ వేధింపుల నుండి బయటపడటానికి మరో అవకాశం లేక మౌనంగా భరిస్తున్నారు. రాజకీయ ప్రాబల్యంతో కొనసాగుతున్న క్రీడాసంఘాల అధిపతులకు ఎదురుచెప్పటం అంటే తమ కెరీర్‌ను కోల్పోవటమేనన్న అభద్రతతో మానసికంగా, శారీరకంగా గాయపడుతున్నా సహనంతో భరిస్తున్నారు. ఐనప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట క్రీడాకారుల ఫిర్యాదులు విన్పిస్తూనే వున్నాయి. ఎదురుతిరిగి అగచాట్లు పడ్తున్నవారూ, తమ శక్తి చాలక ఆత్మహత్యలు చేసుకుంటున్న క్రీడాకారుల సంఖ్య తక్కువేమీ కాదు. క్రీడాకారుల పక్షాన నిలబడిన వారి కుటుంబాలూ వేధింపులకు గురైన సందర్భాలు చాలా వున్నాయి. అయినా ఇంతవరకూ క్రీడా విభాగాలు, సమాఖ్యలలో లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీలనే వేయలేదు. రెజ్లర్ల ఆందోళనా కార్యక్రమంపై స్పందిస్తూ ఒలింపిక్ సంఘం (IOA) అధ్యక్షురాలు పి.టి. ఉష "వీధుల్లో పోరాటం దేశ ప్రతిష్టను భంగకరమని" చేసిన వ్యాఖ్యలు నేరస్తుల పక్షాన నిలబడుతూ క్రీడాకారులకు వ్యతిరేకంగా మాట్లాడటమే. పతకాలు సాధించినపుడు పొగిడే క్రీడాసంఘాల బాధ్యులు ఆ క్రీడాకారులే న్యాయంకోసం ప్రశ్నిస్తున్నపుడు, అధికారవర్గం వైపే, నేరస్థులవైపే నిలబడుతున్న సంస్కృతికి ఇది నిదర్శనం.

సమష్టితనాన్ని, క్రీడాస్ఫూర్తిని వ్యాప్తిచేయవలసిన క్రీడా శిక్షణ కేంద్రాలలో, మొత్తం క్రీడారంగం అంతా వ్యాపార సంస్కృతితో నిండి వున్నాయి. ఆటగాళ్ళను కొంటున్నారు, ఆటలను కొంటున్నారు. క్రికెట్, టెన్నిస్, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర ఆటలు డబ్బులు సంపాదించిపెట్టే వనరులుగా మారాయి. అందుకే ఈ ఆటలకు, ఈ ఆటగాళ్ళమీద కోటాను కోట్లరూపాయలు కుమ్మరిస్తున్నారు. ఆటల చుట్టూ మాఫియా సంస్కృతిని విస్తరింపచేస్తున్నారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ సమష్టి తనంతో, హుందాగా, ఆరోగ్యంగా ఉండే వాతావరణాన్ని, సంస్కృతిని నెలకొల్పేబదులు క్రీడాకారులలో వైషమ్యాలు పెంచుతున్నారు. క్రీడాకారులలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసి, వాటిని సమున్నతంగా ఎత్తి పట్టి జాతి సంపదగా క్రీడాకారులను చూడవలసిన చోటే న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం వారు నెలల తరబడి వీధుల్లో ఆందోళనలు చేయవల్సిన దుస్థితిని కల్పించారు.

ఏ క్రీడాకారిణి తమలా లైంగిక వేధింపులకు గురికాకూడదని, అందుకోసం తమ కెరీర్‌నే పణంగా పెట్టి న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లు, అథ్లెట్ల పోరాటానికి సంఘీభావం తెలుపుదాం.

**28-5-2023**

# కృతజ్ఞతలు



గోళ్ళ కృష్ణమూర్తి గుంటూరుజిల్లా నిజాంపట్నం గ్రామంలో గోళ్ళ వినుకొండ, వెంకమ్మ దంపతులకు 20-2-1922న జన్మించారు. అనారోగ్యంతో 14-5-1995న తెనాలిలో మరణించారు.

గోళ్ళ కృష్ణమూర్తి ఆంగ్లేయుల కాలంలో ఆబ్కారి శాఖలో ఆ తర్వాత పోలీసు శాఖలోనూ ఉద్యోగం చేశారు. భాగ్యమ్మగారిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కొండలరావు, వెంకటేశ్వరమ్మ. కొండలరావు హేతువాద భావాలతో వుంటూ ప్రజాసంఘాలతో చురుకుగా పాల్గొనేవారు. సహాయ సహకారాలందించేవాడు.

కొండలరావు కుమారుడు డా॥ గోళ్ళ కిరణ్, స్మైల్ డెంటల్ క్లినిక్స్‌ని నడుపుతున్నారు. డా॥ కిరణ్ తన తాతగారి శతజయంతి తెనాలిలో జరిపి, 'ప్రజాసాహితి' పత్రిక జూన్ నెల సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించారు. వారికి మా కృతజ్ఞతలు.



కేతు విశ్వనాథరెడ్డిని స్మరించుకుంటూ....

కథ

# అమ్మవారి నవ్వు

- కేతు విశ్వనాథరెడ్డి

**కార్తీకపు** చలిగాలులు వీస్తున్నాయి. ఆకాశంలోని మబ్బుల రంగులు క్షణక్షణానికీ కదలికల్లో మారిపోతున్నాయి. దిశాంతరాళంలో తెలి మబ్బులు సంపెంగలూ, బియ్యం మల్లెల్లాగున్నాయి. ఊదా మబ్బులు, డిసెంబరు పూలలాగున్నాయి. ఎరుపుడాలు, పసుపుడాలు, మబ్బులు, కుంకుమ చెండు మల్లెల్లాగా, కనకాంబరాల్లాగా, పచ్చ చెండు మల్లెల్లాగా ఉన్నాయి. ఆకాశం కింది రకరకాల మొక్కలు గాలికి కదిలి ఊగుతున్నాయి. ఆ కదలికలలో పూల విడివిడి రంగులు కలుస్తున్న కదంబ వర్ణం ఉంది.

పూల కయ్యల పక్క, వేరొక కయ్యలో వేసిన పుదిన, మాచుపత్రి, మరువం, దవనం, కంగమొగ్గెర పచ్చపచ్చగా మంద్ర వాసనల్ని వెదజల్లుతూ, పువ్వుల చీరకు పచ్చటి కొంగులా ఉన్నాయి. గడ్డిపూలు తమ బూడిద రంగు ఎక్కడా అని ఆకాశం మబ్బుల్లో వెదుకుతూ, అటూ ఇటూ కదులుతున్నాయి.

ఆకాశంలో కదలిపోతున్న మబ్బుల్ని చూస్తూ, పూలతోటల సువాసనల గాలుల్ని పీలుస్తూ, నలుదిక్కుల్నీ పరికిస్తూ, ఇంకా వేడెక్కని సూర్యుని కింద గట్టు మీద జాగ్రత్తగా అడుగులు వేస్తూ వస్తున్న శంకరరెడ్డిని, పూలతోటలో ఉన్న జాఫర్ కొంత దూరాన్నుంచే గుర్తించాడు – ఆ పంచె కట్టునూ, నడకనూ గుర్తించి.

"ఓయ్ శంకరన్నా! ఇట్లా.... ఇట్లా రా తిన్నంగ" అని బిగ్గరగా పిలిచాడు.

శంకరరెడ్డి ఆదరాబాదరా అడుగులు వేశాడు. ఉల్లాసంతో జాఫర్ ఉండే సంపెంగల కయ్యలోకి అడుగు పెట్టాడు. కుడి భుజంమీది పై పంచెను సరిచేసుకుంటూ సరదాగా అన్నాడు :

"జాఫరూ! నీ అదృష్టమే అదృష్టం. పూలతోటలో నువ్వెట్లా కన్పిస్తుండావో చెప్పేదా? ఏపుగా ఎదిగిన రెండు దోసిళ్ళ వెడల్పుండే సన్‌ఫ్లవర్ మాదిరుండావు."

"అబ్బో. నువ్వో అన్నా! ఇదుగో ఆకుపచ్చ అంచు తెల్లటి పంచెలో గన్నేరు పువ్వు మాదిరి ఉండావు" జాఫర్ నవ్వుతూ పొగిడాడు – మాటల్లో పోటీ పడుతూ.

"జాఫరూ! పొగడ్తలోనన్నా నీ తోటలోని ఏ పువ్వుతోనో పోల్చగూడదా?" శంకరరెడ్డి చెణికాడు.

"శంకరన్నా! నిన్ను ఈశ్వరుడికి ఇష్టమైన పువ్వుతో పోల్చినా. నువ్వేమో మన వెలి భూముల రైతుల మాదిరి నన్ను పంటపువ్వుతో పోల్చినావు. సరికి సరా?"

"నువ్వేమీ మారలేదు జాఫరూ. మా దేవుళ్ళూ, వాళ్ళ ఇష్టాలూ కూడా నీకు తెలుసు" శంకరరెడ్డి బిగ్గరగా నవ్వాడు. శంకరరెడ్డి నవ్వుతో జాఫర్ నవ్వు జత కలిపాడు.

"మరిచినా, మరిచినా" అంటూ జాఫర్ చేతులు బార్లా చాపాడు. శంకరరెడ్డికి నవ్వు వచ్చింది. తానూ చేతులు చాచాడు. ఒకరినొకరు మూడుసార్లు గుండెలు హత్తుకున్నారు.

జాఫర్ కుశల ప్రశ్నలు వేశాడు :

"శంకరన్నా, వదిన బాగుందా? నీ కొడుకు, వాడి పేరేమి.... ఆ హరీశ్వర్ బాగున్నాడా? ఇంజనీరింగు పూర్తి అయి వుండాలే. అమెరికాకు పోవాలని ఉండాడా? ఉద్యోగంలో చేరినాడా? పెద్దమ్మ ఈశ్వరమ్మ బాగుందా? ఈ మధ్య పెదనాయన కాలం చేసినాడని విన్నా. నందలూరు స్కూల్లో టెన్త్‌లో మన క్లాస్‌మేట్ సుబ్బానాయుడు చెప్పినాడు, ఆ సంగతి. నేనేమీ పరాయివాడినా? మరీ దూరాభారంలో ఉండానా? చెప్పి పంపకపోతే పాయలే. దివసానికి రమ్మని ఒక కార్డు ముక్క వెయ్యకూడదా? పెదనాయన, మా నాయన ఒకరికొకరు ప్రాణం ఇచ్చుకునేవాళ్ళని నీకు తెలీదా? మనిద్దరి మాదిరే వాళ్ళు. మా నాయన చచ్చిపోయినాక రోజులు బాగుండకపోయి, నువ్వు వద్దంటున్నా ఈ పక్కలకు – ఈ పల్లెకు వచ్చినాం – మా అత్తా, మామ పోరు పెడితే. మన ఊరు వదిలి ఇక్కడకొచ్చి అయిదేండ్ల యింది".

జాఫర్ నిట్టూర్చాడు.

జాఫర్ ప్రతి మాటను గురించి ఆలోచిస్తున్న శంకరరెడ్డి ఉక్కిరిబిక్కిరయ్యాడు :

"అంతా బాగుండారు. నాయన సంగతి తెలుపకపోవడం తప్పే" అని ఒప్పుకున్నాడు.

కొడుకుకు స్టూడెంట్ వీసా రాలేదు. సివిల్ చేసి, ఏడాది కంప్యూటరు కోర్సులు చేసి, హెచ్1బి అనేసరికి అమెరికాలో అవకాశాలు సన్నగిల్లినాయి. ఇప్పుడు కెనడా ప్రయత్నాల్లో, ఆ దిగులులో ఇప్పుడు....' అని చెప్పలేకపోయాడు.

ఆ క్షణానికి కడుపులో రాని ఉత్సాహాన్ని పైకి తెచ్చుకొని కుశల ప్రశ్నలు వేశాడు :

"మా మరదలు జరీనా ఎట్లా వుంది? ముసలమ్మ బాగుందా? ఆడపిల్లోళ్ళు ముగ్గురి పెండ్లిండ్లు చేసినావు. కూతుర్లూ, అల్లుళ్ళూ సౌదీలో సుఖంగా వున్నారా? ఆ రకంగా నువ్వు అదృష్టవంతుడివి".

"శంకరన్నా! ఎవరి బతుకులు వాళ్ళవి. ఎవరి నసీబులు వాళ్ళవి" జాఫర్ గొంతు వణికింది.

ఆ కలవరపాటును శంకరరెడ్డి గుర్తించి ఆత్రంగా అడిగాడు : "ఏంది అట్లా మాట్లాడతావు? ఏమైంది?"

జాఫర్ మాట మార్చాడు : "ముందు నువ్వింత హఠాత్తుగా వచ్చిన సంగతి చెప్పు. రెండేండ్లయింది మనం కలవక. మీ ఊర్లో మల్లా కొత్త గలాటాలేమన్నా నెత్తికి చుట్టు కున్నాయా? నేను నా మనుషుల్ని తీసుకు

రావాల్నా? నీ కోసం ఏం చెయ్యాలన్నా సరే చేస్తా...."

జాఫర్ ప్రేమకు శంకరరెడ్డి చలించి పోయాడు. కొన్ని నిమిషాలు గతంలోకి జారుకున్నాడు.

'పదేళ్ళ కిందట, తన తండ్రి మీద నాటు బాంబులతో వేట కొడవండ్లతో జరగబోయిన దాడిని పసిగట్టి, చాకచక్యంగా జాఫర్ తండ్రి ఇమాం తప్పించినాడు. అప్పుడు విన్న దృశ్యాలు శంకరరెడ్డి మనసులో కదిలాయి. ఇమాం సాబు బొడ్డులో దాచుకున్న నాటు పిస్తోలుతో తన తండ్రిని ప్రమాదాన్నుంచి ధైర్యంగా తప్పించినాడని అప్పట్లో జనం చెప్పుకున్నారు. తన తండ్రే ఊర్లో కక్షలూ కార్పణ్యాలూ ఎందుకని ఎదుటి పార్టీ వాళ్ళతో రాజీ అయింది గుర్తు కొచ్చింది. ఈ పదేండ్లలో గ్రామ రాజకీయాలు మారినాయి; కాలం మారిపోయింది. ఇమాం సాబు చనిపోయినాడు; జాఫర్ కుటుంబంతో రాజంపేట పక్కల పల్లె చేరినాడు - కొత్తరకం బతుకుతెరువు వెతుక్కుంటూ....'

"ఏంది శంకరన్నా? ఆలోచనలో పడినావు. నేనడిగిందానికి చెప్పు?"

"అదేం కాదు జాఫర్. ఊర్లో ఏ గలాటాలూ లేవు. ఇప్పుడు ఇక్కడికి మా చిన్నాయిన కూతురు పెండ్లి విషయంగా వచ్చినా".

"ఏ చిన్నాయన? నారదుడు చిన్నాయనా? రేడియో చిన్నాయనా?"

జాఫర్ ప్రశ్నకు శంకరరెడ్డికి తెగ నవ్వు వచ్చింది. తన తండ్రి హయాంలో తంటాలు పెట్టి, తమాషా చూసే చిన్నాయనను నారదుడనీ, అక్కడి ఇక్కడి వార్తలు చేరవేసే చిన్నాయనను రేడియో అనీ నలుగురూ చాటుగా అనుకుం టున్నది జాఫర్‌కు ఇంకా గుర్తుందన్నమాట!

"కాదులే, కాదులే" అంటూ శంకరరెడ్డి పొర్లి పొర్లి నవ్వాడు.

"ఇంకెవరు?" జాఫర్ గుర్తు తెచ్చు కోవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు.

"మా నాలుగో అబ్బ హుసేన్ రెడ్డి - నీకు జ్ఞాపకమే గదా! మా జేజి పక్కీరమ్మ జ్ఞాపకం వుందా? వాళ్ళ రెండో కొడుకు - వెంకటస్వామిరెడ్డి - ఆయన కూతురు పెండ్లి".

"చంపినావు పో. ఆయన తెలీకేమీ? మనకు వయసు వచ్చేసరికే కర్నాటక వైపు కాంట్రాక్టులకు పోయినాడు. ఆయనేనా? ముందు కాంగ్రెస్‌లో ఉన్నాడు. తర్వాత తెలుగుదేశంలో చేరినాడు. ఇప్పుడు సంగతి?"

"అవు. ఆయనేలే. మన కుటుంబానికి ఏదో ఒక సాయం చేస్తానే ఉండాడు. ఇప్పుడు మండలాధ్యక్షుడు. మంచి పలుకుబడి సంపాదించుకున్నాడు. ఆయన కూతురు పెండ్లి. ముప్పయి లక్షల కట్నమిస్తున్నాడు. తెలంగాణ సంబంధం - వరంగల్ పక్క పల్లె వాళ్ళది. పిల్లోడు అమెరికాలో ఉన్నాడు. మన పిల్ల ఇంజనీరే గదా".

"ఆ సంగతులు గొప్పగా చెప్తా ఉండావు. ఇంతకూ నేనూ, నువ్వూ చెయ్యాల్సింది ఏముంది?" జాఫర్ అసహనంగా అడిగాడు.

"పెండ్లి పనులు కొన్ని నా వంతు. వాటిల్లో నువ్వు చేసే పని ముఖ్యమైంది. ఈ మధ్య ఒక సెట్టిగారి పెండ్లికీ, ఇంకా ఎవరివో పెద్దాసాముల పెండ్లిండ్లకూ నేను పోయినాలే. ఆ పెండ్లి మంటపాలు ఎవరు కట్టినారని అడిగినా. 'పూల జాఫరు' అని పేరూ, ఊరూ చెప్పినారు. మనోడే అని తెగ సంతోషపడినా. ఇప్పుడు నేనొచ్చినా. ఆ పని నెత్తిమీద వేసుకొని, నీతోనే చెయ్యించాలని".

జాఫర్ ఆ మాటలకు పొంగిపోయాడు.

"పెండ్లి మండపం, హాలు, బయట అలంకరణ అంతా నీ చేతుల మీదనే సాగాల. చూసినోళ్ళు అదిరిపోవాల. వెంకటస్వామిరెడ్డికి మన కథంతా చెప్పలేదులే, పెండ్లిలో దిమ్మ తిరిగిపోయేటట్లు చేస్తాంలెమ్మని, చేస్తావని...."

"పెండ్లెప్పుడు?"

"వారం రోజులుంది. నవంబరు 24".

"ఎక్కడ?"

"నువ్వు నీ పనితనం చూపిన చోటే, కడపలో" శంకరరెడ్డి కొంటెగా నవ్వాడు.

"టి.టి.డి. కల్యాణ మండపంలోనా?"

"అవు".

"వారం రోజులు ముందు చెప్పి బతికించినావు. రాజంపేట, కడప, తిరుపతి మార్కెట్లు గిట్టుబాటు గాక ఏకంగా హైదరాబాదుకు పూలు పంపుతున్నాం - ఈ మధ్యన. ఎక్కువగా సంపెంగల్నీ, వాళ్ళు బంతిపూలనే చెండుమల్లెల్నీ, చామంతుల్నీ, మరువం, దవనం సరే అనుకో. ఈ సీజన్లో సంపెంగలకు గిరాకీ వచ్చింది".

"ఎంత పలుకుతున్నాయి?"

ఈ వారంలో కిలో పది రూపాయలు. రేపటి మాపటి కోతలకు ఏ రేటుంటుందో తెలియదు. అల్లాకూ తెలియదు. రాముడికీ తెలియదు. జాఫర్ హాస్య దృష్టిని శంకరరెడ్డి పట్టించుకోలేదు.

నీరసంగా అన్నాడు : "మా కాయ గూరలకన్నా నీ పూలే నయం. ఆ మాటకొస్తే కొన్ని మిగతా పంటలకన్నా కూడా. మొన్న టమోటాలు పది కేజీల గంప ఒకటికి నాలుగు రూపాయలకమ్మినా".

"శంకరన్నా! ఈ రోజులు మీవీ కావు. మావీ కావు. దబాయించి, 'ధర ఇంతే, సరుకు ఇస్తే ఇవ్వు, లేకపోతే నీ చావు నువ్వు చావు' అనే గుత్త మొత్తంగా కొనేవాళ్ళ రోజులు. ఈ గవర్నమెంటుకు రోడ్లు ముఖ్యం, మనం కాదు. ఎవడి చేతిలో ఏ చక్రముందో చచ్చినా అర్థం కాదు".

"నీ చేతిలో చక్రం లేదా? రైతులందరి దగ్గరా కొని పంపవా?"

"శంకరన్నా! నేను పూల ఎగుమతిదారున్నే. నా పూలకొక ధరా, రైతుల పూలకొక ధరా కట్టలేనన్నా. పూల అమ్మకాల పట్టీలు నావీ, కొనేవాళ్ళవీ రైతుల ముందు పెట్టడం నా మతం. సాయం చేసినందుకు రైతులు ఎంత ఇస్తే అంత తీసుకుంటాను. ఈ సాయం చెయ్యబట్టే ఈ భూమి గుత్తకు దొరికింది".

"కమీషనా?"

"ఆ పేరుతో పిలవద్దు. చేతికి చేతి సాయం. మాటకు మాట సాయం. నాకేదన్నా మిగిలేది, పెండ్లిండ్ల సీజన్లోనే. ఈ పెండ్లి మండపాల పనిలో - అదీ పెద్దాసాముల పెండ్లిండ్లు అయితేనే. మిగతా పూలల్లో మిగిలేది పెట్టుబడులకూ. గుత్తలకూ, కూలీలకూ, మా ముగ్గురి తిండికీ, పూల బతుకు ఒకటి రెండు రోజులే గదా?"

'జాఫర్ ఏమీ మారలేదు. తాను నొప్పించే ప్రశ్నలు వేసినాడేమో!' అని శంకరరెడ్డి అనుకున్నాడు. కొన్ని క్షణాలు మౌనం వహించాడు.

శంకరరెడ్డి భుజం తట్టి జాఫర్ అన్నాడు : "ఇంటికి పోదాం పద".

"జరీనానూ, ముసలమ్మనూ చూసి రెండు గంటల బస్సుకు పోతా. వచ్చేటప్పుడు బస్సు కండక్టరు చెప్పినాడు రెండు గంటలకు

తిరుగు బస్సు ఒకటి ఉందని".

ఈ రాత్రికి ఉండు శంకరన్నా. పగటి పూట నీతో కలిసి భోం చేయలేను" జాఫర్ ఉమ్మిని మింగుతూ అన్నాడు.

"జాఫరూ, నీ ప్రేమ తెలీదా? నీ దర్బారు తెలీదా? రాత్రికి కోడి అంటావు. దొరికితే మాంసం అంటావు. పలావు అంటావు. ఖైమా ఉండాలంటావు. నాయనా! కడపలో నాకు అర్జంటు పని ఉంది. నన్ను వదులు. ఇంట్లో వాళ్ళు గొడవ పెడుతుంటే, కార్తీక మాసంలో నీచు వద్దులెమ్మనుకున్నా".

"ఏం మతాలో, ఏం పండగలో, ఏం మాసాలో ఏమో? తినే తిండిలో పితలాటకా లున్నాయి" జాఫర్ మాటలో ఏదో అసంతృప్తి ధ్వనించింది.

జాఫర్ పక్కతోటలోని కనకాంబరాలు కోస్తున్న మహిళల వైపు శంకరరెడ్డి చూస్తూ జాఫర్ మాటల్ని పట్టించుకోలేదు.

తోటలు దాటి, ఊరుకు వెళ్ళే రోడ్డు చేరారు ఇద్దరూ. జాఫర్ జేబులోంచి అల్లిక టోపీ తీసుకుని తలకు పెట్టుకున్నాడు. శంకరరెడ్డి ఆశ్చర్యంగా జాఫర్ తలవైపు చూస్తూ "ఇది ఇంతకుముందు అలవాటు లేదే?" అని అడిగాడు.

"ఇదా? ఈ ఏడాదిగా అప్పుడప్పుడు ఈ పూల పనిమీద హైదరాబాదు పోతున్నా. మొదటిసారి పోయినప్పుడు ఈ టోపీ గీపీ లేదు. రైతు మాదిరి పోతి. గడ్డమూ లేకపోయె. నాకొచ్చే ఉర్దూ మన కడపది. నా ఉర్దూ, నా యాసా విని పగలబడి నవ్వినారు, ఆ హైదరాబాదోళ్ళు. 'నువ్వు ముసల్మానువు కావు పో' అన్నారు, హైదరాబాదు పూల వ్యాపారస్థులు. 'నేను ముస్లిమునే. అయితే ఏం చెయ్యాల?' అన్నాను. టోపీ అన్నా పెట్టుకో అన్నారు. ఇదీ జాఫర్ టోపీ కథ" జాఫర్ చెప్పిన తీరుకు శంకరరెడ్డి పగలబడి నవ్వాడు.

"మరి ఇప్పుడెందుకు ఆ టోపీ? పెద్దగా ఎండ కూడా లేదే, ఇది హైదరాబాదూ కాదు" శంకరరెడ్డి జాఫర్‌ను ఆట పట్టించడానికి అన్నట్లు అడిగాడు. జాఫర్ ఇల్లు రావడంతో శంకరరెడ్డికి జాఫర్ నుంచి సమాధానం రాలేదు.

జాఫర్ ఇంట్లో జరీనా, ముసలమ్మ చూపిన ఆపేక్షలు చూసి శంకరరెడ్డి ఉప్పొంగిపోయాడు. జరీనా ముందు కాళ్ళకు నీళ్ళిచ్చింది. కుర్చీ వేసింది.

మంచినీళ్ళ లోటా అందిస్తూ జరీనా అడిగింది :

"బావా! అందరూ బాగున్నారా? అక్క పిల్లలు...."

జాఫర్ జేజి (నాయనమ్మ) బోసి నోటితో కుశల ప్రశ్నలు వేసింది. పాతకాలం సంగతులు ఎత్తుకుంది.

"శంకరయ్యా! మన ఊర్లో మేమున్నప్పటి ఆ రోజులు రమ్మంటే ఇప్పుడొస్తాయా? జాఫర్ అబ్బకు మీ అబ్బ (తండ్రి, తండ్రి) ఆ ఫకీరు మాన్యం అయిదెకరాలు ఇప్పించె – దర్గా పూజలు చేసుకొమ్మని. ఆ ఫకీరు మాన్యానికి తగాదా వచ్చె. అది ఆంజనేయుడి మాన్యమని కరణమయ్య పుల్లలు బెట్టె. రెడ్డి (గ్రామ మునసుబు) తోడాయె. అసలు కడుపు కుట్టు వేరు. మీ అబ్బ, జాఫర్ అబ్బ దోస్తీ చూసి వాళ్ళకు కన్నుగుట్టింది. దానికి తోడు ఒకమారు కరణమయ్య తన భూమి దున్నడానికి ఎద్దుల్ని రమ్మనె. మీ భూమిలో దున్నకం పూర్తయిందాకా రాననె జాఫర్ అబ్బ. ఇంకొసారి వామి వెయ్యడానికి రెడ్డి పిలిచె. మీ వామి పని ఉందని చెప్పె జాఫర్ అబ్బ. కరణమయ్య సైతాను. రెడ్డి మాదర్చోదు. పంచాయితి పెట్టిరి. పితలాటకం చేసిరి. కరణం భూమి లాక్కునె. ఆంజనేయుడి గుడిలో దీపం పెట్టకపాయె. మీ అబ్బో, జాఫర్ అబ్బో వాళ్ళు బతికినన్నాళ్ళూ దీపం పెట్టిరి...."

"దాదెమ్మా! యాభైఏండ్లనాటి ఊసులెందుకు?" జాఫర్ అడ్డు తగిలాడు.

"చెప్పినీలే జాఫరూ, కడుపు మంట ఒకంతట ఆరేది కాకపాయె?" శంకరరెడ్డి ప్రోత్సహించినట్లయింది.

ముసలమ్మ పాత చరిత్రను తవ్వి పోయటానికి మళ్ళీ మొదలు పెట్టింది :

"భూమి పాయె. జాఫర్ అబ్బ కాలం చేసె. మీ అబ్బ కాలం చేసె. మీ నాయనా, జాఫర్ నాయనా అన్నదమ్ముల మాదిరి బతికిరి. మీరిద్దరూ అన్నదమ్ముల మాదిరే పెరిగిరి. కరువులొచ్చె. కాటకాలొచ్చె. కచ్చెలొచ్చె.... ఇక్కడికి చేరుకుంటిమి...."

"ఇక చాల్లే దాదెమ్మా! శంకరన్న అన్నం తిని బస్సుకు పోవాల" అని జాఫర్ అనటంతో ముసలమ్మ ఆగి, ఆకు వక్కా సున్నం వేసి వక్క రోలులో దంచుకోవడం మొదలుపెట్టింది.

"సేమ్యా పాయసం చేస్తా బావా, నీకిష్టం" జరీనా నవ్వుతూ వంటగదిలోకి వెళ్ళింది.

"శంకరన్నా! పదైదు నిమిషాల్లో ఇక్కడుంటా. ఏమనుకోకు. ఈలోగా వంట పూర్తవుతుంది. పప్పన్నమేలే. మసీదుకు వెళ్ళి నమాజు చేసొస్తా".

"నమాజా? ఈ పల్లెలో మసీదుందా?" శంకరరెడ్డి ప్రశ్నలకు జాఫర్ ఇబ్బందిపడ్డాడు.

"ఆఁ కువాయిట్, సౌదీ చందాల్తో ఈ మధ్య మసీదు కట్టినారులే. పోటీల్లో పల్లె జనం పడడంతో, ఒక కొత్త గుడి, చర్చి కూడా వచ్చినాయి. రంజాన్ రోజుల్లోనన్నా, మసీదుకు రమ్మని సాటి ముస్లిం ముసలోళ్ళు, కుర్రాళ్ళ రంపు. మీ నాయనా, మా నాయనా చిన్నప్పుడు మనిద్దర్నీ దగ్గర కూర్చోబెట్టుకుని వేమన పద్యాలు నేర్పినారు, గుర్తుందా? మా నాయన ఎన్నోసార్లు ఈ పద్యం చదివేవాడు :

పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ ఒకటె
దర్శనములు వేరు దైవంబు ఒక్కడే
విశ్వదాభిరామ వినురవేమ!

ఈ పద్యం ఇప్పుడు గుర్తుందా?"

శంకరరెడ్డి హాస్య ధోరణిలో అందుకున్నాడు :

"మీ నాయన నేర్పించిన ఆ పద్యం గుర్తుంది. 'ఒరె ఈ పద్యం కూడా నీ కొడుకూ, శంకరుడూ నేర్చుకోవాల' అని మా నాయన చెప్పిన పద్యం నీకు గుర్తుందా? అదే....

మక్కకు జననేల? మగడ తా రానేల?
ఏకమైన కర్త యిందు లేడొ
అన్నిట పరిపూర్ణు డల్లా మహమ్మదు
విశ్వదాభిరామ వినుర వేమ!"

ఇద్దరూ పద్యాలు పాడి నవ్వుకుంటుంటే, ముసలమ్మ బోసినోటితో మరిమరీ నవ్వింది.

జాఫర్ నవ్వుకుంటూనే బయటికి వెళ్ళాడు. జరీనా పెరడులోకి వెళ్ళడాన్ని ముసలమ్మ గమనించింది. హీనస్వరంతో అంది : "శంకరయ్యా! జాఫరుకు చిన్నకూతురే పెద్ద దిగులైపోయింది" ముసలమ్మ కొంగుతో ఒత్తుకుంది.

"మంచి సమ్మందమని సిద్దోటానికిస్తిమి. వాడు సౌదీకి తీసుకుపోయినాడు. బాగుందారని

మురిసిపోతాంటే, ఆర్నెల్లకే తలాఖ్ ఇచ్చినాడు. ఒకర్నో ఇద్దర్నో కట్టుకున్నాడంట! ఆ బిడ్డ ఏమైందో, ఎక్కడుందో తెల్దు, రెండేండ్లయింది. అజా పజా లేదు" ముసలమ్మ విన్పించీ విన్పించనట్లు రోదించసాగింది. జరీనా అలికిడి వినటంతోనే మాటలు ఆపింది.

'ఆ పెళ్ళి సంబంధం ఖాయం చేసుకున్నప్పుడు తాను కూడా ఉన్నాడు. ఎంత అందమైన పిల్లో రజియా! ఆ పిల్ల నవ్వు ప్రత్యేకంగా ఉండేది. కష్టాలు ఎందుకు చుట్టుకుంటాయో, మంచి మనుషులకు కూడా? హరీశ్వర్‌తో తనకూ బాధలు. వాడిది తలకాయ చెడిపోతాంది. ఉద్యోగం లేదు. రెండు లక్షలకు పైగా వాడి చదువులకు ఖర్చయింది. మూడు లక్షలు అప్పుంది. వెంకటస్వామిరెడ్డి 'ఏదో ఒకటి చేస్తాం, చేస్తాం' అంటున్నాడు. తన బాధలు తనకున్నాయి. పెండ్లి పనులు నెత్తికెత్తుకోవడం అందుకే'.

శంకరరెడ్డి తనలోకి జారుకున్నాడు.

జాఫర్ వచ్చీరావటంతోనే, జరీనా దస్తర్ పరిచింది. శంకరరెడ్డికి భోజనం ఏర్పాటు చేసింది. జాఫర్ ఎదురుగా కూర్చొని, "తిను, తిను. పాయసం ఇంకొంచెం...." అంటూ బలవంతం చేశాడు. జరీనా నవ్వుతూ శంకరరెడ్డికి మారు వడ్డించింది.

"జాఫర్! అమ్మా జరీనా! కడుపు నిండిపోయింది. జాఫర్‌ది ఉపవాసం. నాది కడుపు నిండిన భోజనం".

"రాత్రికి ఉండి రేపొద్దున పోవచ్చు గదా బావా!"

"రాత్రికి ఉంటే నీ మగడి దెబ్బకు మూడు రోజులు ఇక్కడే ఉండిపోవలసి వస్తుంది - ఆయాసానికి తట్టుకోలేక. పనుంది. పోవాల్లే అమ్మా, వస్తానమ్మా, వస్తాను జేజీ" అంటూ బయలుదేరాడు.

చెప్పులు వేసుకుంటూ జాఫర్ వైపు తిరిగి అన్నాడు :

"ఇరవై మూడో తేదీ మధ్యాన్నానికే పూలతో, నీ మనుషుల్తో కడప చేరుకో. ఆ టైంకు నేను నిన్ను కల్యాణ మండపంలో కలుస్తా. ఇరవై నాలుగు పెండ్లి. నువ్వు ఏం పూలు, ఏం ఆకులు గడతావో, ఎట్లా గడతావో అది నీ ఇష్టం. చూసినవాళ్ళు మాత్రం అదిరిపోవాల. ఇదిగో ఈ మూడు వేల రూపాయల అడ్వాన్సు. పని అయ్యాక నీవెంత చెబితే అంత తీసుకుందువు" డబ్బును జాఫర్ జేబులో చనువుగా శంకరరెడ్డి పెట్టాడు.

"అంతా బాగుంది. పెండ్లికొడుకు, పెళ్ళికూతురు పేర్లు మాత్రం నువ్వు చెప్పలేదు శంకరన్నా!" జాఫర్ నవ్వుతూ శంకరరెడ్డికి జ్ఞాపకం చేశాడు.

"ఈ మధ్య బుర్ర సరిగా పనిచేయడంలేదులే" అంటూ శంకరరెడ్డి ప్లాస్టిక్ చేతి సంచిలోని పెండ్లి కార్డు తీసి జాఫరుకిచ్చాడు.

"పెండ్లి కొడుకు పేరు మునగాల మదన్‌రెడ్డి, పెండ్లి కూతురు పేరు నళిని. మర్చిపోవద్దు. కార్డు చూడు".

జాఫర్ కార్డును పరికించాడు. పసుపు రంగుతో, నీలం రంగు అక్షరాలతో కార్డు అట్టహాసంగా ఉంది.

శంకరరెడ్డి ఎక్కిన బస్సు కదులుతూనే, కల్యాణ మండపాన్ని ఏ పద్ధతుల్లో అలంకరించాలో అని ఆలోచిస్తూ జాఫర్ పూలతోట వైపు నడిచాడు.

పెళ్ళికి ముందురోజు, ఆ సాయంత్రం, రాత్రి, మరుసటి ఉదయం ఎనిమిదింటిదాకా జాఫర్, జాఫర్ తెచ్చుకున్నవాళ్ళు నడుం వంచింది లేదు. ఆ పని చూస్తూ ఉంటే శంకరరెడ్డికి ఆశ్చర్యం వేసింది.

రంగురంగుల పూలల్లో ఒదిగిన ఆర్చిలో స్వాగతం, వధూవరుల పేర్లు, గేటు దగ్గర నుండి హాలు వరకు అర్ధగోళాకారంలో చమ్కీ దండల మధ్య పూలమాలలు, గేటు దగ్గరే ఆహ్వానితులకు ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన సెంటు జల్లిన గులాబీలు, హాలు ముంగిట్లోని నిలువెత్తు సీతారాముల, వాళ్ళ పాదాల దగ్గర ఆంజనేయుల పుష్ప నిర్మిత చిత్రాలు శంకరరెడ్డికి అమోఘంగా కన్పించాయి.

పెండ్లి మండపం వెనుక తొమ్మిది అడుగుల ఎత్తు, పది అడుగుల వెడల్పులో పచ్చచెండుపూల భిత్తికలో పొదిగిన వెంకటేశ్వర పద్మావతుల చిత్రాలు - ఏడు అడుగులు, ఆరు అడుగుల ఎత్తున్నవి అపూర్వంగా తోచాయి.

వెంకటేశ్వరుడి మణిమయ రత్నకిరీటం, ముఖం, కర్ణాభరణాలు, శంఖచక్రాలు, కౌస్తుభం, వకుళాభరణం, అభయ వరదహస్తాలు, పద్మావతి కనకాంబరపు చీరకట్టు, మంగళసూత్రం కళ్ళకు కట్టినట్లు చెయ్యడానికి వాడిన సుగంధాలు వెదజల్లే రంగురంగుల పూలూ, పత్రాలూ చూసి శంకరరెడ్డి దిగ్భ్రాంతికి గురి అయ్యాడు.

పెళ్ళికి తరలి వచ్చిన వాళ్ళందరూ పుష్పాలంకరణల, పుష్ప వేదికల గంభీర సౌందర్యానికీ, కళాభిరుచికీ ఎంతగానో ముగ్ధులయ్యారు. అదేదో దేవలోకం సెట్టింగుల్లా ఆ దృశ్యాలు పెళ్ళికి వచ్చిన కుర్రకారుకు తోచాయి. పెళ్ళి వేదిక వెనుక భారీగా, కొట్టవచ్చినట్లు కన్పిస్తున్న వెంకటేశ్వర పద్మావతుల పుష్ప చిత్రాలు చూస్తూ, కాబోతున్న వధూవరులను సైతం కొందరు విస్మరించారు.

కళ ఒక అద్భుత భ్రాంతి. భ్రాంతిని మింగే ఒక కఠిన వాస్తవం. పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళి విందులోని రకరకాల వంటల్లో ఏది, ఎంత వడ్డించుకోవాలో, ఏవేవి ఏ వరుసల్లో ఉన్నాయో, విందులో కన్పించే వాళ్ళలో ఎవరెవర్ని పలకరించాలో వెతుక్కునే ఆత్రంలో బంధుమిత్ర సపరివారం పడింది. పెళ్ళికి తరలివచ్చిన చిన్నా, పెద్దా రాజకీయ నాయకులూ, కాంట్రాక్టర్లూ 'బాగానే ఖర్చు పెట్టాడు' అనుకున్నారు. పలకరింపులు, చిన్న చిన్న రహస్యమంతనాల పర్వాలయ్యాక భోంచేసి ఎవరి దారి వాళ్ళు వెళ్ళిపోయారు. సుందర పుష్పకళా లోకాన్ని చాలామంది మరచి తమ తమ దారుల్లో తిరిగి వెళ్ళారు.

వరుడి బృందం వెంట విశిష్టఆహ్వానితుడిగా వచ్చిన సుందర రామానందులు పుష్ప చిత్రాలను తదేకంగా చూస్తున్నాడు. కుడివైపు వరుడి తండ్రి, ఎడమవైపు వధువు తండ్రి, స్వామి ఏం మాట్లాడుతారోనని ఎదురు చూస్తున్నారు.

'వియ్యంకుడు బి.జె.పి.లో ఉన్నాడు. స్వామి, వియ్యంకుడికి సద్గురువు. వీళ్ళనుకుంటే వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ టికెట్ తనకు దొరకక తప్పదు - పువ్వు గుర్తుమీద' అని వెంకటస్వామిరెడ్డి ఆలోచనల్లో ఉన్నాడు.

స్వామి హఠాత్తుగా అడిగాడు : "ఈ పుష్ప దైవాలను మనముందు నిలిపిందెవరు?" వెంకటస్వామిరెడ్డి ఉలిక్కిపడ్డాడు. తడబడ్డాడు. 'ఈ ఏర్పాట్లు చూసిన శంకరరెడ్డి ఎక్కడున్నాడో వెంటనే రమ్మన'మని తన మనిషిని పిలిచి

చెవిలో చెప్పాడు సుందర రామానందుల వైపు తిరిగి, "లోపాలు ఏమైనా ఉన్నాయా స్వామీ?" అన్నాడు.

"లేవు. ఒక గొప్ప హిందువు సంస్కారం ఆ మూర్తుల్లో కన్పిస్తోంది. అమ్మవారి పెదాల మధ్య విరిసీ విరియని ఆ నవ్వును చూపడం సాధకులైన మన హిందూ కళాకారులకే సాధ్యం".

ఈలోగా శంకరరెడ్డి పరుగెత్తుకుంటూ వచ్చాడు – కొడుకు హరీశ్వర్‌ను కూడా వెంటబెట్టుకొని. ఒగరుస్తూ, "ఏదన్నా తక్కువ జరిగిందా అన్నా?" అని అడిగాడు. వెంకటస్వామి రెడ్డి పక్కన మల్లెపువ్వు లాంటి జుబ్బా, పైన కాషాయపు రంగు ఓవర్‌కోటు, కాషాయపు రంగు బార్డరు తెల్లటి పంచెకట్టు, నుదుట కుంకుమ బొట్టు ఉన్న స్వామిని శంకరరెడ్డి ఆ హడావుడిలో గుర్తించలేదు. మరోపక్క వ్యక్తిని కూడా.

శంకరరెడ్డినీ, హరీశ్వర్‌నూ సుందర రామానందులకు వెంకటస్వామిరెడ్డి పరిచయం చేశాడు.

సుందర రామానందులు అతి శాంతంగా అడిగారు : "ఈ పుష్ప ప్రతిమలను ఎవరు రూపొందించారు?"

"మా జాఫర్ చిన్నాయన" హరీశ్వర్ మాటల్ని నొక్కుతూ అన్నాడు. ఆ నొక్కులను సుందర రామానందులు గుర్తించాడు. ఆయనకు నోట మాట రాలేదు. 'ఆ నవ్వు. ఆ నవ్వు' అని గొణుక్కున్నాడు ఎదుటివాళ్ళకు విన్పించకుండా.

హాలు బయట ఒక మూల ఇరవై ఆరు గంటల ఉపవాసంతో, పనితో అలసిపోయి గోనె పట్టలు పరచుకొని, వాటిమీద జాఫర్ పడి నిద్రపోతున్నాడు. ●

# అంతర్జాతీయ హోదాను పొందిన మన (అ)లౌకికవాదం

**కొద్దిరోజుల** కిందట అమెరికా కాంగ్రెస్‌కు చెందిన స్వతంత్ర సంస్థ (USCIRF) 'భారతదేశంలో మతస్వాతంత్ర్యం'పై ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం మత స్వాతంత్ర్యాన్ని పరిరక్షించే దేశాలలో భారత్ స్థానం చాలా అట్టడుగున వుంది. ఈ సంస్థ భారత్‌కు సంబంధించిన ఇదే విధమైన నివేదిక ఇవ్వడం వరుసగా ఇది నాల్గవ పర్యాయం. ఈ నివేదిక భారతదేశం మతవివక్షను పాటిస్తూ జారీ చేసిన పలు చట్టాలను ఉదహరించింది. వాటిలో ముఖ్యమైనవి : మత మార్పిడుల చట్టం, మతాంతర సంబంధాలకు చెందిన చట్టం, హిజాబ్ ధరించడంపై ఆంక్షలు, గోవధ నిషేధ చట్టం, పౌరసత్వ సవరణ చట్టం (CAA) మరియు జాతీయ జనాభా రిజిస్టర్ (NRC). ఈ చట్టాలన్నీ మనదేశంలోని మైనారిటీ వర్గానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, సిక్కులు, ఆదివాసుల ఉనికికి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయన్నది వాస్తవం.

ఈ విధమైన మైనారిటీ వ్యతిరేక, అప్రజాస్వామిక చట్టాలను చేయడమే కాకుండా బిజెపి కేంద్ర ప్రభుత్వం, ఆరెస్సెస్ మరియు దాని అనుబంధ భజరంగ్‌దళ్ వంటివి తమకు వ్యతిరేకంగా గొంతుకలు విప్పుతున్న మరియు కలం సంధిస్తున్నవారిపై చేపడుతున్న అణచివేతలను, సమాచార హక్కు కార్యకర్తలపై జరుపుతున్న దాడులు, హత్యాకాండలను, బెదిరింపులు, అవసరమనుకుంటే వారి ఆస్తులను ధ్వంసం చేయడం మరియు తమ చేతిలోనున్న సిబిఐ, ఏసిబి వంటి సంస్థలచే దాడులకు పూనుకోవడం, అక్రమ కేసులు బనాయించి సం॥ల పాటు జైళ్ళలో మగ్గేలా చేయడం వంటి ఫాసిస్టు పోకడలను కూడా ఈ నివేదిక బట్టబయలు చేసింది.

ఈ సంస్థ మరొకవంక తమ దేశ (అమెరికా) విదేశీ వ్యవహారాల శాఖను భారత్‌ను 'మతం పేరుతో హింసను ప్రేరేపించే దేశం'గా గుర్తించనందుకు; భారత ప్రభుత్వ సంస్థలపైనా, అధికారులపైనా ఆంక్షలు విధించనందుకూ తీవ్రంగా ఆక్షేపించింది. 2002లో గుజరాత్‌లో మతంపేరిట జరిపిన మారణహోమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇదే సంస్థ 2005లో అమెరికాకు నరేంద్రమోదీ వీసాను రద్దు చేయించింది.

దున్నపోతుపై వర్షం కురిసిన చందాన మన పాలకులు ఇటువంటి దేశ ప్రతిష్టకు భంగం కలిగించే నివేదికలను బుట్టదాఖలు చేస్తూ నిర్లజ్జగా 'ఒకే దేశం – ఒకే మతం' అన్న తమ విధానాన్ని తీసుకుపోతున్నారు. ●



# కార్టూనిస్టు సత్యమూర్తి మృతి

**'చదువ్రులావు',** 'అల్లాటప్పయ్య' అనే శీర్షికలతో వారపత్రికలోనూ, 'రచన' మాసపత్రికలోనూ కార్టూన్లు వేసిన సత్యమూర్తి తన 84వ యేట 25-5-2023న హైదరాబాదులో మరణించారు. ఆయన 01-01-1939లో జన్మించారు.

భావరాజు వెంకట సత్యమూర్తి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా చదివారు. కార్టూన్లు వేయడమేగాక 'కార్టూన్లు వేయడం ఎలా?' అనే శీర్షికను వారపత్రికల్లో నిర్వహించారు. సత్యసాయి డిజైనింగ్ స్టూడియో నెలకొల్పారు. బి.వి. పట్టాభిరామ్ ఈయన సోదరుడే. ●

వ్యాసం

# శ్రామికవర్గ సిద్ధాంతంపై పెట్టుబడిదారీ సమాజ శక్తుల నిరంతర దాడులు - దుష్ప్రచారాలు

- జి.వి. భద్రం

**1848లో** కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ లు సమసమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తూ రూపొందించిన కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడిన నాటి నుండీ, కమ్యూనిస్టు సిద్ధాంతంపై నాటి పెట్టుబడిదారీవర్గం, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్ధించే మేధావులూ, క్రైస్తవమత అధిపతులు, రాజకీయ నాయకులూ దుమ్మెత్తిపోస్తూనే వున్నారు. పలు అభాండాలు వేశారు. కమ్యూనిస్టులు నీతి, నియమాలు లేనివారనీ, న్యాయాన్నీ, ధర్మాన్నీ పాటించరనీ, ఆస్తితో పాటు స్త్రీలందరినీ సమాజపరం చేసి, వారిని ఉమ్మడిగా వాడుకొంటారనీ, క్రైస్తవమత కన్యలను దౌర్జన్యంగా బలాత్కరిస్తారనీ ప్రచారం చేశారు.

శ్రామికవర్గం మొట్టమొదట తిరుగుబాటు చేసి, తన నాయకత్వాన, ఆధిపత్యాన పారిస్ కమ్యూన్‌ను ఏర్పర్చుకుంది. సమసమాజపు నిర్మాణం అంకుర రూపంలో వున్న ఆ మొట్టమొదటి శ్రామిక రాజ్య వ్యవస్థపై, తీవ్రమయిన సైనికదాడి జరిపారు. శ్రామికవర్గ నాయకులను ఊచకోత కోసి, తీవ్ర నిర్బంధంపాలుచేసారు. విచారణ పేరుతో వారిపై పలు అభాండాలు మోపి వారిని ఉరితీశారు. జైళ్ళపాలు చేశారు. కమ్యూనార్డులకు వ్యతిరేకంగా, అబద్ధపు కట్టుకథలతో, వారిపై అబద్ధపు ఆరోపణలతో ముమ్మరంగా ప్రచారం చేశారు.

1917లో సోవియట్ యూనియన్ ఏర్పడి దోపిడీ, పీడనలు లేని శ్రామికవర్గ నియంతృత్వ రాజ్యం స్థాపించింది. అది ఉనికిలో సాగినంతకాలమూ, రద్దుచేయబడేంతవరకూ, తూర్పు యూరోపు దేశాలలో కమ్యూనిస్టు వ్యవస్థలు కూలిపోయేంతవరకూ కమ్యూనిస్టు వ్యవస్థకూ, కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, సోవియట్ యూనియన్లో అమలుజరుగుతున్న శ్రామికవర్గ నియంతృత్వాన సాగే అభివృద్ధికీ, విధానాలకూ వ్యతిరేకంగా, పుంఖానుపుంఖంగా సాహిత్యాన్ని సృష్టించి ప్రచారం చేశారు. మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతాలకు వక్ర భాష్యం చేస్తూ అసంబద్ధ, పిడివాదనలతో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని చేశారు. పలురూపాల్లో దొంగదాడి జరిపారు.

1949లో విముక్తిపొంది, చైనాలో జనతా ప్రజాతంత్ర రాజ్యం ఏర్పడిన నాటి నుండీ, అక్కడ నిర్వహింపబడిన మహత్తర, చారిత్రాత్మక, ప్రజావిప్లవాన్ని వక్రీకరిస్తూ, ఆ విప్లవానికి నాయకత్వం వహించి, చైనాలో సోషలిస్టు వ్యవస్థను నిర్మించి, మేరనగంలా నిలిచిన ఛైర్మన్ మావోను, చైనా కమ్యూనిస్టు పార్టీనీ, దాని విధానాలనూ వ్యతిరేకిస్తూ ఎనలేనన్ని నిందలతో, అభూతకల్పనలతో నిరంతర వ్యతిరేక ప్రచారం చేశారు. నేటికీ అటువంటి ప్రచారాలు చేస్తూనే వున్నారు.

కేవలం సైద్ధాంతిక, రాజకీయరూపంలో దాడులూ, విషప్రచారాలే కాకుండా, సాహిత్య కళారంగాల నుండి కూడా ఆయా సోషలిస్టు దేశాలలో అవలంబిస్తున్న సామాజిక, సాంస్కృతిక విధానాలపైన, సైద్ధాంతిక అభిప్రాయాలపైన పలు వక్రీకరణలు, వక్రభాష్యాలూ, పలు మార్మిక రూపాల్లో దొంగదాడులూ, విషప్రచారం చేస్తూనే వున్నారు.

## శ్రామికవర్గ సిద్ధాంతంపై అమెరికా ఎడతెగని దాడులు

సాహిత్యం, కళలు శ్రామికవర్గాలపై వ్యతిరేక విషప్రచారానికి నాటినుండి, నేటివరకూ సామ్రాజ్యవాద అమెరికా నాయకత్వం వహిస్తోంది. సి.ఇ.ఎ. ద్వారా ఈ వ్యతిరేక ప్రచారాన్ని, కార్యకలాపాలను, ప్రపంచమంతటా అన్ని దేశాలలోనూ ప్రచ్ఛన్నంగా నిరంతరం కొనసాగిస్తోంది. ప్రజాతంత్రయుతంగా ఆలోచించే మేధావులను, కళాకారులను, సాహితీవేత్తలను ప్రలోభాలకు గురిచేసి, వివిధరకాలైన రూపాలలో ఎరలు వేసి లోబరుచుకొని, వారిచే కమ్యూనిజానికీ, కమ్యూనిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రచారం చేయించుతోంది. వివిధ అమెరికన్ పెట్టుబడిదారీ కార్పొరేషన్లు, ట్రస్టులను, ఫౌండేషన్లను ఏర్పరచి వాటిద్వారా థింక్ ట్యాంక్లు (మేధావుల బృందాలు) ఏర్పాటు చేసి వారి ద్వారా తప్పుడు సిద్ధాంతాలను, కట్టుకథలను సృష్టిస్తోంది. వివిధ రిసెర్చి సెంటర్లు (పరిశోధనా కేంద్రాలను) ఏర్పాటు చేసి వాటి ద్వారా వారు ఏవో కొత్త విషయాలు కనుగొన్నట్లు తన ప్రచారాన్ని సాగిస్తోంది. ప్రభుత్వేతర సంస్థలు అన్నవాటికి ముమ్మరంగా నిధులు ముట్టజెప్తూ, వాటిద్వారా "ప్రజాస్వామ్యం, మానవహక్కులు" పేరిట దోపిడీకి, అణచివేతకూ, అసమానతలకూ వ్యతిరేకంగా పోరాడుతూ, ఐక్యంగా వున్న వివిధ శ్రేణుల అణచివేయబడ్డ ప్రజల్లో, అభిప్రాయ భేదాలు కలిగిస్తూంది. వారి మధ్య వున్న ఐక్యతను చెడగొడుతుంది. పోరాడే ప్రజల్లో చీలికలు ఏర్పర్చి, అనైక్యంగా వుండే పరిస్థితులను సృష్టిస్తోంది. వీరందరి ద్వారా అనంతమైన కమ్యూనిస్టు వ్యతిరేక సాహిత్యాన్ని ప్రచారం చేస్తోంది. ఫెమినిజం (స్త్రీవాదం), అస్తిత్వవాదం (ఐడెంటిటీ పాలిటిక్స్), పోస్టు మోడర్నిజం (ఆధునికానంతరవాదం) లాంటి వివిధ అపసవ్యవాదాలను రేకెత్తిస్తోంది. పీడిత ప్రజల ప్రధాన శత్రువైన సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీవిధానం, ఫ్యూడల్ అర్థఫ్యూడల్ వాదం, నయావలసవాదాలను సమర్ధిస్తూ, దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమై పోరాడకుండా ప్రభావవంతంగా అనైక్యపరుస్తోంది.

## సోవియట్ రచయిత్రి అయాన్ రాండ్ 'నిష్పాక్షికవాద సిద్ధాంతం'

గతంలో రష్యాలో ఒక బడా మందుల తయారీ పరిశ్రమ యజమాని కుమార్తె అయిన అయాన్ రాండ్, విప్లవకాలమంతటా సైబీరియాలో తన కుటుంబంతో నివసించారు. విప్లవానంతరకాలపు సోవియట్ యూనియన్లోని మాస్కోకు కుటుంబంతో పాటు వచ్చి, అక్కడ తనకూ – తన కుటుంబంవారికీ, గతకాలపు దోపిడీవ్యవస్థలో అనుభవించిన ప్రత్యేక హక్కులూ, ప్రత్యేక సౌకర్యాలూ రద్దుకావటంపట్ల వ్యధ చెందారు. కేవలం మేధావిగా చలామణీ అవుతూ, శారీరక శ్రమ విముఖతవలనా, వ్యతిరేకతవలనా, ఉన్నత విద్యాభ్యాసం సాకుతో సోవియట్ యూనియన్ విడిచి అమెరికాకు చేరుకొన్నారు. అక్కడ "నిష్పాక్షికవాదం" (ఆబ్జెక్టివిజం) పేరిట, సోవియట్ యూనియన్ పైనా, అక్కడ అమలుజరుగుతున్న విధానాలపైనా దుమ్మెత్తిపోస్తూ కమ్యూనిజం పట్ల తీవ్రమయిన విద్వేషంతో, నవలలు వ్రాసారు. అమెరికన్ సామ్రాజ్యవాదపు పరోక్ష ప్రోత్సాహంతో ఒక పేరుపొందిన రచయిత్రి కావటం, తన పేరిటనే అయాన్–రాండ్ ఫౌండేషన్ అనే సంస్థను ఏర్పాటుచేసి, ఆ సంస్థ ద్వారా కమ్యూనిస్టు వ్యతిరేకతనూ, "తాను రూపొందించిన "నిష్పాక్షికవాద" సిద్ధాంతాన్ని ఏనాడో ప్రచారం చేశారు. ఇంతకీ యీ నిష్పాక్షికవాద సిద్ధాంతం ఏం చెబుతోంది అంటే, ఎవరిపైనా ప్రభుత్వం యొక్క కానీ, సమాజం యొక్క కానీ, ఏ సిద్ధాంతం యొక్క అదుపుగానీ, రాజ్యాంగవ్యవస్థ యొక్క అదుపుగానీ, మరే యితరమైన అదుపుగానీ, కట్టుబాట్లు కానీ వుండరాదు. ప్రతి వ్యక్తీ తన యిష్టారాజ్యంగా, తన మనస్సు చెప్పినదాని ప్రకారం వ్యవహరించే, మసలుకొనే స్వేచ్ఛ వుండాలి. ఉదాహరణకు కొందరి వ్యక్తులకు మాత్రమే మేధోపరమైన, వృత్తిపరమైన అపార నైపుణ్యం అలవడుతుంది. అటువంటి వ్యక్తులు తమ యిష్టమైన వ్యాపకం చేబట్టవచ్చు. యిష్టమైన రీతిలో వ్యవహరించవచ్చు. వీరు ఏ రకంగా వ్యవహరించినా వీరిని ఏ కారణంచేత కానీ నియంత్రించరాదు. వీరు తమ మేధో నైపుణ్యంతో వ్యవహరిస్తారు కనుక వీరిని శారీరక శ్రమ చేయమని ఎవ్వరూ ఆదేశించరాదు. ఇక మహిళలైతే తమ యిష్టమైన రీతిలో శృంగార కార్యకలాపాలు సాగించవచ్చు. ప్రేమించి పెళ్ళిచేసుకొన్న భర్తతో వున్నప్పటికీ, మరో పురుషుడితో శృంగార–లైంగిక కార్యకలాపాలు సాగించవచ్చు. దీనిని ఎవరూ ప్రశ్నించరాదు. ఇటువంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ పెట్టుబడిదారీ విధానపు స్వేచ్ఛావాణిజ్య విధానమే ఆదర్శ వంతమైన విధానం అని ఆమె ప్రకటించారు. ఆమె నవలలు పెట్టుబడిదారీ సమాజంలో బహుళ ప్రాచుర్యం పొందాయి కూడా. కొందరు అత్యున్నత స్థాయి మేధో నైపుణ్యం గల వ్యక్తులు, అంతవరకూ మార్క్సిస్టు సిద్ధాంతంతో ఏకీభవించినవారితో సహా అయాన్ రాండ్ ప్రచారం చేసిన యీ "నిష్పాక్షికవాదం" (ఆబ్జెక్టివిజం) పట్ల ఆకర్షితు లయ్యారు. ఇంతకీ యీ సిద్ధాంతం ప్రబోధించినదాని ప్రకారం మేధావులు శారీరక శ్రమను చేయకపోతే, వీరికి కనీస అవసరాలను, సదుపాయాలను, సేవలను ఎందుకు అందించాలి. తమ శారీరక శ్రమతో సరుకులను ఉత్పత్తిచేసి వాటితోపాటు ఎందుకు అందించాలో, వారికి సైతం అటువంటి 'మేధావుల' కోసం శారీరక శ్రమ చేయటాన్ని నిరాకరించే హక్కులు ఎందుకు వుండరాదో లేదా వుండవో అది ఏ రకమయిన నిష్పక్షపాతవాదమో వివరించలేదు. ఇది ముసుగేసుకొన్న "శ్రమశక్తి దోపిడీ జరిపి, సంపదలు ప్రోగేసుకొని, సౌఖ్యంగా జీవించాలని" చెప్పే పెట్టుబడిదారీ దోపిడీ సిద్ధాంతమే తప్ప మరొకటి కాదు.

అదేవిధంగా సోవియట్ యూనియన్‌లోని లేబర్ క్యాంపులలో నిర్బంధితులు అమానవీయంగా, హింసింపబడుతున్నారని నానా యాగీ చేస్తూ పుస్తకాలు వ్రాసిన సోల్జెనీత్సిన్ లాంటివారికి నోబుల్ బహుమతులు యిచ్చి, కమ్యూనిజాన్ని అప్రదిష్టపాలు చేసిన సామ్రాజ్యవాదపు కుయుక్తులూ చరిత్ర ఎరిగున్న విషయమే!

## సత్యానంతరవాదం :

ఇవన్నీ చాలదన్నట్లు సత్యానంతరవాదం (పోస్టుట్రూత్) పేరిట, అప్పటికే ఏర్పరచుకొని, నమ్ముతున్న అభిప్రాయాలను వక్రీకరించి, గందరగోళపడేటట్లు చేసి, మనం దృఢంగా ఏర్పరచుకొన్న అభిప్రాయాలు నిజంగా నిజమైనవేనా అనే సందేహం కలిగింపజేస్తుంది. వాస్తవికతనే తిరిగి ప్రశ్నించే స్థాయికి తీసుకువచ్చే ఈ ప్రక్రియ నేడు ముమ్మరంగా సాగుతోంది. ప్రధానంగా 1930ల నుండే మొదలైన యీ సత్యానంతర వాదం, 2016 అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల నాటికి, ఆచరణలోకి వచ్చింది. తాము ఎవరినైతే లక్ష్యం చేసుకొంటారో, వారు తమ జ్ఞాపకాలనూ, నమ్మకాలను, అనుభూతులను లేదా స్థిరచిత్తతను సందేహించేటట్టుగా చేసే హస్త లాఘవం లాంటి రూపం ఇది. ప్రస్తుతం యీరూపంలోనే కమ్యూనిజాన్నీ, కమ్యూనిస్టు సిద్ధాంతాన్నీ, కమ్యూనిస్టు వ్యవస్థలను (ఏర్పడిన) వ్యతిరేకించే ప్రక్రియ ప్రపంచమంతటితోపాటు మనదేశంలో కూడా ఎంతో చొరవతో ముందుకు సాగుతూంది.

కమ్యూనిస్టు సిద్ధాంత సమర్థకులుగానూ, కమ్యూనిస్టు మద్దతుదారులుగానూ, కమ్యూనిస్టు వ్యవస్థలను సమర్థించేవారిగానూ, సానుభూతిపరులుగానూ చలామణీ అవుతూనే, మార్క్స్ నేటి పరిణామాలను అంచనా గట్టలేకపోయాడనీ, భారతదేశ సామాజికవ్యవస్థలోని కులవ్యవస్థను అర్థంచేసుకోలేకపోయాడనీ, సోవియట్ యూనియన్లో స్టాలిన్ నియంతగా మారి ఎందరినో క్రూరంగా ఊచకోత కోశాడనీ, లేదా మావో సాంస్కృతిక విప్లవం జరిపి ఘోరమైన తప్పిదం చేసి, ప్రజలపై రాక్షసంగా వ్యవహరించాడులాంటి కుహనా పరిశోధనా నిర్ధారణలను ప్రచారంచేస్తూ, అంతిమంగా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, ఫ్యూడల్ వర్గాలు, శక్తులు, వారి విధానాలతో కమ్యూనిజం రాజీపడి, పరోక్షంగా లొంగిపోవాలని సలహాలు యిస్తున్నారు. పాక్షిక సత్యాలను వెల్లడిచేస్తూ, వాటి సమయ, సందర్భాలను చెప్పకుండా, వాటి ఆధారంతో ఆయా కమ్యూనిస్టు విధానాలను పరిశీలించి, చర్చించకుండా, వక్రీకరణలు ద్వారా నిశ్చితాభిప్రాయం వున్నవారిని కూడా సందేహంలోకి యీడ్చి, వారిలో కమ్యూనిస్టు వ్యతిరేక అభిప్రాయం మొలకెత్తేవిధంగా చేసే ప్రక్రియ సాగుతోంది.

## విదేశీ నిధులందుకునే స్వచ్ఛంద సంస్థల దుష్ప్రచారం

మనదేశంలో కూడా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ సంస్థల ఫౌండేషన్లు, ట్రస్టులు, వాటి నిధులతో నడపబడుతున్న ఎన్.జి.ఓలు సమకూర్చే అధిక పారితోషికాలు, సౌకర్యాలు – విదేశాలలో నిర్వహించే

సెమినార్లు, వాటి ప్రచారం, రీసెర్చి పేపర్ల ప్రచురణ, ఉచిత ప్రయాణ, బస, ఆహారపు ఏర్పాట్లు – మొదలైనవాటి ప్రలోభాల ఎరకు గురై, ఆయా సంస్థలలో పలువురు మేధావులు, శాస్త్రజ్ఞులు, ఆర్థికవేత్తలు పనిచేస్తున్నారు. ఆయాసంస్థలు, పరోక్ష పద్ధతులలో చేస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి దోహదపడుతున్నారు. వాటి (సి.ఐ.ఎ లాంటి సంస్థల) ప్రచ్ఛన్న కమ్యూనిస్టు వ్యతిరేక కార్యకలాపాలకు తమకు తెలియకుండానే తోడ్పాటునిస్తున్నారు. అదేవిధంగా మధ్యతరగతి వర్గానికి చెందిన కొందరు మేధావులు, సాహిత్యకారులు, కళాకారులూ, వృత్తిపరమైన ఆకాంక్షలు తీర్చుకొనే (కెరీరిజం) లక్ష్యంతో ఆయా ఫౌండేషన్లలోనూ, సంస్థలలోనూ పనిచేస్తూ కమ్యూనిస్టు వ్యతిరేక అభిప్రాయాలను ప్రచారం చేస్తున్నారు. మరికొందరు రచయితలు, రచయిత్రులు, కళాకారులు తమకు తాముగానే సాహిత్యానికీ, కళలకు ప్రతినిధులుగా ప్రకటించుకొంటూ అదేవిధమైన ప్రచారాలకు పాల్పడు తున్నారు.

వీరందరూ సమాజంలోని అసమానతలకు, అక్రమాలకు, దోపిడీ పీడనలకు మూలకారకమైన దోపిడీ రాజ్యవ్యవస్థలను కానీ, దోపిడీ వర్గాలను కానీ, అందుకు సాధనాలుగా వున్న దోపిడీ రాజ్యాంగ యంత్రాలను వాటి మౌలిక ప్రజావ్యతిరేక వర్గస్వభావాన్నీ, విధానాలనూ ప్రశ్నించకుండా, దోపిడీ అసమానతలకు ఎవరో కొందరు వ్యక్తులో, కొన్ని గ్రూపులవారో లేదో కమ్యూనిస్టులూ – వారి ఉద్యమాలూ, విప్లవాలూ అందుకు కారణమైనట్టుగా నిందిస్తారు. నిజమైన అసలు ప్రజా, వర్గశత్రువులకు అండగా వుంటూ, వారి దోపిడీ పాలనావ్యవస్థల్నీ, విధానాలనూ వారు ప్రచారం చేసే అపసవ్యపు, అనర్థకారకమైన సంస్కృతినీ, భావజాలాన్నీ నిరంతరం వ్యాప్తిచేస్తూ వున్నారు.

వ్యంగ్య పురాణ శ్రవణం!

# అధికార మార్పిడి!

**హమ్మయ్య!** ఎట్టకేలకు అధికార మార్పిడి జరిగింది!! 75 ఏళ్ల భారత రాజ్యాంగం సాక్షిగా ఎన్నికలస్వామ్యానికి ధన, కుల, మతోన్మాద మద్యం ఎక్కించి భ్రష్టు పట్టిస్తుంటే ఎరగనట్టు నటిస్తున్న వారందరినీ మౌన ప్రేక్షకులుగా నియంత్రించగలిగాము.

పూర్వం బ్రిటిష్ మౌంట్ బాటన్ నుండి కాంగ్రెస్ జవహర్లాల్ నెహ్రూ అధికారం స్వీకరిస్తే, ఇప్పుడు (అబద్ధపు) మహా మంత్రదండం సింగోలు సాక్షిగా, దేశ ప్రధాని మోడీ నుండి రాజాధిరాజ రాజమార్తాండ శ్రీశ్రీశ్రీ నరేంద్ర సార్వభౌములవారు అధికారిక మంత్రోచ్చాటనల నడుమ స్వీయ నిర్మిత రాజప్రాసాదంలో అధికారాన్ని స్వీకరించి నూతన మహాసింహాసనం అధిష్టించారు!!!

హస్తినాపుర రాజ్యాన్ని క్రీస్తుకు పూర్వం 2023 కాలానికి ఫ్లాష్ బ్యాక్‌లోకి పంపి చూపగలిగాము.

శుభకార్యాలకు మనుధార్మిక అనుమతి లేనందువల్ల రాజమాతను తెరవెనుకనే నిలుపగలిగాము. పిల్లి మంత్రాల ప్రతిపక్షాన్ని అల్లంత దూరంలోనే ఆపగలిగాము.

అయినా ఒక్క శిరోభారం వేధిస్తోంది.

హస్తినాపురం వీధులలో అదే రోజు మల్లయోధ మహిళల్ని ఈడ్చి ఈడ్చి గుంజుకెళ్లి నిర్బంధించవలసి వచ్చింది.

బేటి బచావో అంటే కుమారీ శతకం వరకు పఢావో అని అర్థం. ఆడపిల్లలకు ఇంటి పనులు వంట పనులు తప్ప ఆటలు కూడదంటే, ఏకంగా కుస్తీ పోటీలకు సిద్ధమై ప్రపంచ క్రీడాస్థలిలో గెలిచి బహుమతులు సాధించేయటమే! పతకాలపై పతకాలు సాధించిరే పో! మమ్ములను సాధించే విధంగా తరతరాల సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తూ మా రాజ్య ప్రతినిధిపై అన్యాయపు ఆరోపణలు చేస్తారా! అణిగి మణిగి ఉండవలసిన ఆడపిల్లలు నడి వీధులలో ఆందోళనలు, అలజడులు చేస్తూ అల్లర్లు సృష్టిస్తారా! మా శత్రువులతో చేతులు కలిపి దేశద్రోహానికి పాల్పడతారా!! చూశారుగా మా తఢాకా! కుస్తీ పట్లు కాదు, లాఠీ పోట్ల సంగతి తెలిసొచ్చిందా!!

దేశ దేశాలలో కుస్తీలు పట్టడం బహుమతులు కొట్టడం అన్నవి భారత రాజ్యంతో తలబడటం కంటే పెద్ద విషయం కాదని ఇప్పటికైనా అర్థమైందా?

ఇక వినండి ఇదే మా సవాలు...

"హం దేఖేంగే! ఆప్ కే బేటియోంకో కైసె బచావోగే"

"మీ ఆడపిల్లల్ని మా నుండి మీరు ఎలా కాపాడుకుంటారో మేం చూస్తాం!"

**ఫలశ్రుతి!**

1. ఈ దేశానికి ప్రజాస్వామ్యం అచ్చిరాదని తన మరణం ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంత మొత్తుకున్నా వినకుండా, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యం మనదేనంటూ ఐక్యరాజ్యసమితి మేడలెక్కి కూతలు కూయటం లేత సొరకాయ కోతలుగా మిగులుట!!!
2. "ప్రజాస్వామ్య యుగ పర్యవసానం రాచరికానికి నాందీ గీతం" అని 55 సంవత్సరాల క్రితమే రాసి నేటి అధికార మార్పిడి దృశ్యాన్ని నాడే దర్శించగలిగిన తెలుగు వృద్ధ మహాకవికి నోబెల్ బహుమతి ఇప్పించటమొక అంతర్జాతీయ కర్తవ్యంగా స్వీకరించుట!!
3. సహేంద్ర తక్షకాయ స్వాహా అనే మంత్రంతో దేశమంతా ఉద్యమిస్తే తప్ప మల్ల యోధురాండ్ర గెలుపు సాధ్యపడక పోవచ్చు!!!

**...చెరుకూరి జ్యోతి**

**30-5-2023**

సినిమా సమీక్ష

'మరో హిందూత్వ ప్రచార సినిమా


# 'ది కేరళ స్టోరీ'

(ఒరిజినల్ హిందీ వర్షన్ ఆధారంగా)

– బాలాజీ (కోల్‌కతా)

**ముగ్గురమ్మాయిల కథ:**

శాలినీ ఉన్నికృష్ణన్ కేరళ సద్బ్రాహ్మణుల పిల్ల. నర్సు కోర్సు చదువుకుంటానని కాసరగోడ్ కాలేజీకి వెళ్తుంది. కానీ 'లాడెన్' డెన్ లాంటి (అక్కడి గోడ మీది బొమ్మల్ని బట్టి) ఆ కాలేజీ 'ముస్లిం' నేస్తం ఆసిఫా (నిజానికీమె 'ఐసిస్' రిక్రూట్) పుణ్యమా అని హిందూ దేవతలు ఎంత వీకో, హిజాబ్ ఎంత స్ట్రాంగో, 'దోజఖ్ కా ఆగ్' (నరక జ్వాల) ఎంత పవర్‌ఫుల్లో తెలుసుకుంటుంది. శరీరాలు 'కబూల్ కబూల్' (ఓకే ఓకే) అన్నాయని కాబోయే నర్సమ్మ 'సేఫ్ సెక్స్'ను కూడా చూసుకోకుండా గర్భిణీకృష్ణన్ ఔతుంది. ఆ తర్వాత 'ఫాతిమా బా'గా మారి, 'రమీజు'గాడు వదిలేసి పోతే, మౌల్వీ గైడెన్సు మేరకు ఎవరో తెలీని మరో కన్వర్టెడ్ క్రిష్టియన్ ఇర్షాద్‌ను పెళ్లాడుతుంది. 'నువ్వు ఇంటికి వెళ్తే మీ అమ్మ నిన్ను యాక్సెప్ట్ చెయ్యదు' అని 'ముస్లిం పార్టీ' చెబితే నమ్మిన ఉన్ని స్వయంగా వాళ్లమ్మే వచ్చి 'మీ కోసం నేను కూడా ముస్లింగా మారడానికి రెడీ. నువ్వూ, అల్లుడూ నా చెంత ఉంటే చాలు' అని ఎంత 'తల్లి'డిల్లినా కాదంటుంది. 'నరక జ్వాల' (మళ్లీ 'దోజఖ్!) నుండి తప్పించుకోవడానికీ, ప్రాయశ్చిత్తం పొందడానికీ 'కొలంబో' హనీమూన్ మీదుగా బలూచిస్తాన్ క్వెట్టాకు చేరుతుంది. అక్కడ్నుంచి 'సబ్ కబూల్ హై' అంటూ కాబుల్‌ను దాటి 'ఐసీసు' సేవకై ఆఫ్ఘన్–సిరియా బార్డర్ వైపు దూసుకెళ్తుంది. కానీ అక్కడ స్త్రీలకు మొబైల్ ఫోను సదుపాయం వుండదని తెలుసుకున్న తర్వాత కొంత హృదయ పరివర్తన ('కర్ణాటక' పరివర్తనలా!) కలిగి, అక్కడ్నుంచి తప్పించుకోడానికి ట్రై చేస్తూ, డైరెక్టరుగారు ఏర్పాటుచేసిన నానావిధ కష్టాలూ అనుభవిస్తుంది. త్రాల్ ఎడారిలో అచేతనంగా పడివున్న ఆమెను అంతర్జాతీయ బలగాలు రక్షిస్తాయి. ఆఫ్ఘన్ జైలులోని యూఎన్ ఆఫీసర్లకు 'మేము బ్రెయిన్ వాష్ అయ్యాము సార్' అని ఆమె చెబుతుంటే అది ఆ 'బ్రెయిన్'కే అవమానంలా మనకనిపిస్తుంది. 'బ్రెయిన్' ఉంటేనే కదా 'బ్రెయిన్ వాష్' జరిగేది. ఇందులోని అమ్మాయిల పనులేవీ మెదడున్న వారు చేసేవిగా అనిపించవు.




ఈ సినిమాలో శాలినితో పాటు మరొక ఆమె గీతాంజలి వుంటుంది. ఈమె కమ్యునిస్టు తల్లిదండ్రులకు రవీంద్రనాథ్ అంటే ఇష్టమేమో! 'ధూమపానం ఆరోగ్యానికి హానికరం' అన్న హెచ్చరికను లెక్కచేయని ఈ 'నాస్తిక' భావాల చిన్నది (కొంచెం పొట్టి లెండి) కూడా 'హిజాబ్‌కు మించిన రక్షణ లేదు' అని జెట్టు స్పీడులో నమ్మి, ముస్లిం ప్రియుడు ఫోనులో కోరిన వెంటనే తన న్యూడ్ ఫొటోల్ని ఎంచక్కా అప్లోడ్ చేసేస్తుంది. కేరళ కమ్యూనిస్టు ఫ్యామిలీల్లో కూడా ఇంత తెలివితక్కువ అమ్మాయిలు ఉంటారని ఈ సీను చూసేదాకా మనకు తెలీదు. 'ఐసీయూ'లో ఉన్న తండ్రిని చూట్టానికొచ్చినపుడు 'కాఫిర్' (అల్లాను నమ్మని) అయిన అతడి తలపై ఉమ్మేస్తుంది కూడా. మరో సందర్భంలో తండ్రిని మందలిస్తూ – 'తప్పు మీది కూడా, మీరు నాకు కమ్యూనిజం అంటూ విదేశీ సిద్ధాంతాలు కాకుండా మన సంస్కృతి (మనుస్మృతి?), మన మతం, వాటి గొప్పతనం అనే చాప్టర్ చెప్పి వుంటే ఇలా జరిగేది కాదు' అనంటుంది. బేల మొహమే 'మాటే రాని' ఆ తండ్రి జవాబు! 'తన న్యూడే తనకు శత్రువు' అన్న పరిస్థితి రావడంతో గీతాంజలీ ఉరఫ్ అనీషా ఉరేసుకుంటుంది. (మల్టీప్లెక్సులో ఫ్యానులు లేకపోబట్టి మనం బ్రతికిపోతాం!)

మూడో అమ్మాయి నిమాహ్ అనే క్రిష్టియన్. తమ ట్రాప్‌లో పడలేదని ఈ అమ్మాయికి మత్తుమందిచ్చి 20 మంది ముస్లింలు గ్యాంగ్ రేప్ చేస్తారు. (ముస్లిం మగాళ్లకు రేపులు చేయడం తప్ప మరో వ్యాపకం ఉండదన్నట్టు చూపారు ఈ సినిమాలో!) శాలిని కొలంబోలో ఉండగా ఈ అమ్మాయే ఆమెను అలెర్ట్ చేస్తుంది. రమీజ్ ఎక్కడికీ పోలేదనీ, కాసరగోడ్‌లోనే ఉన్నాడనీ, ఇదంతా పెద్ద ట్రాప్ అనీ చెప్పినా పట్టించుకోదు 'టూర్ మోడ్'లో ఉన్న శాలిని. సిరియాకు వెళ్లడానికే సిద్ధపడుతుంది. (ఈ సినిమాలో లాజిక్కులు వెదకడం కష్టం.) ఈ ముగ్గురితో పాటు ప్రధానంగా కనిపించే మరో బాధితురాలు భాగ్యలక్ష్మి. మొదట్లో కేరళలో ఓసారి, ఆఖర్లో ఆఫ్ఘన్ – సిరియా బార్డర్‌లోని త్రాల్ ఎడారి టెర్రరిస్టుల శిబిరంలో ఇంకోసారీ కనిపిస్తుంది.

నిమాహ్ అనే పాత్ర దర్శకుడి 'ఆల్టర్ ఇగో' అన్నమాట! దర్శకుడు సంపాదించిన పేపర్ కటింగులూ, మ్యాగజైన్లూ ముందేసుకుని చూసి కన్నీరుమున్నీరైన తర్వాతి దృశ్యంలో పోలీసు అధికారితో 'కేరళ

మిస్సింగ్ గర్ల్స్' గురించి వాదిస్తుంది. సినిమా వాళ్లు ఇవ్వాలనుకున్న డేటా ఈమె నోట వినిపిస్తారు. ఈ దృశ్యంలో ఈమెతో పాటు శాలిని తల్లీ, గీతాంజలి తలిదండ్రులూ వుంటారు. ఆ అధికారి రూమ్‌లోని ముస్లిం క్యారక్టర్ల అవసరమేమిటో అర్థం కాదు మనకు. ముస్లింలలో మంచివాళ్లు ఉండవచ్చు అన్న సందేహం ప్రేక్షకులకు ఏ మాత్రం కలక్కుండా జాగ్రత్త పడ్డాడు దర్శకుడు.

## వ్యూహాత్మక దుష్ప్రచారం :

ఈ సినిమా టీజర్లో 'కేరళ నుండి 32000 మంది హిందూ, ముస్లిం యువతులు సిరియా, యెమెన్ల ఎడారుల్లోకి అదృశ్యమయ్యారు' అని హీరోయిన్ చేత చెప్పించారు. అప్రకటిత లెక్కల్ని బట్టి 50000 (32000 గొప్ప ప్రకటిత సంఖ్య ఐనట్టు!) మంది కూడా కావచ్చని నిమాహ్ చేత సినిమాలో చెప్పించారు. గతంలో ఇదే దర్శకుడు 'ఇన్ ది నేమ్ ఆఫ్ లవ్' అంటూ లవ్ జిహాద్‌పై తీసిన డాక్యుమెంటరీలో కూడా కేరళ, మంగళూర్‌లను కలిపి 32,000 మంది హిందూ, క్రిష్టియన్ అమ్మాయిలు మతాంతీకరణ తర్వాత ఆఫ్ఘనిస్తాన్, సిరియా వంటి 'ఐసిస్', హక్కానీ, తాలిబన్ ప్రభావిత ప్రాంతాలలో మగ్గుతున్నారని చెప్పాడు. ఈ డాక్యుమెంటరీని జేఎన్‌యూలో ప్రదర్శించినపుడు పెద్ద గొడవే జరిగింది. కేరళలోని గ్రామాల సంఖ్య 1670. 32000 లేదా 50000 సంఖ్యను గ్రామాల సంఖ్యతో భాగిస్తే ఒక్కో గ్రామం నుండి 20 నుండి 30 మంది అమ్మాయిలు అదృశ్యమయ్యారని లెక్క తేలుతుంది. దాచేయాలన్నా దాగనంత పెద్ద సంఖ్య ఇది. ఐతే, ఆ తప్పిపోయిన పిల్లల ఇంటివాళ్లు చేసిన 'ఎఫ్ఐఆర్'లు ఉండాలి కదా? ఇంత మంది దేశం దాటిపోతుంటే సెంట్రల్ ఏజెన్సీలు ఏం చేస్తున్నాయ్? - ఇలాంటి ప్రశ్నలు రావడం సహజమే! అందుకే ఈ టీజర్ రిలీజైన వెంటనే 'ఆల్ట్ న్యూస్' వంటి ఫ్యాక్ట్ చెక్ సంస్థలు రంగంలోకి దిగాయి. ఈ 32,000 సంఖ్య ఎక్కడ్నుంచి దొరికిందని 'ఆల్ట్ న్యూస్'తో పాటు చాలా సంస్థలు దర్శకుడు సుదిప్తొ సేన్‌నూ, క్రియేటివ్ డైరెక్టర్ - కమ్ - నిర్మాత విపుల్ అమృతలాల్ షానూ ప్రశ్నించాయి. వారు మొదట్లో ఏవేవో పొసగని సమాధానాలు చెప్తూ చివరికి నచ్చని మీడియాతో మాట్లాడడం మానేశారు.

## ఆల్ట్ న్యూస్ పరిశోధన :

1. 'ది ఫెస్టివల్ ఆఫ్ భారత్' యూ ట్యూబ్ ఛానెల్‌లో దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రకారం, ప్రతి ఏడాదీ 2800 నుండి 3200 మంది కేరళ యువతులు ఇస్లాంను స్వీకరిస్తున్నారని 2010లో కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమ్మెన్ చాందీ అసెంబ్లీలో చెప్పాడట! కాబట్టి 3200ను పదితో గుణించి పదేళ్లలో 32000 అన్న సంఖ్యను లెక్కగట్టినట్టు తెలుస్తోంది.

2. కానీ చాందీ ఇలా ఎప్పుడన్నా చెప్పాడా అని చూస్తే 2012 'ఇండియా టుడే' వార్త కనిపించింది. '2006 నుండి 2012 వరకు రాష్ట్రంలో 2,667 మంది యువతులు ఇస్లాం మతంలోకి మారినట్లు' ఆయన రాష్ట్ర శాసనసభకు తెలియజేశాడు. మత మార్పిడి అన్నాడు గానీ బలవంతపు మార్పిడి అనలేదు. లవ్ జిహాద్ భయాలు నిరాధారమైనవని కూడా ఆయన చెప్పాడు. మతం మారినవారంతా 'ఐసిస్'లో (ఐఎస్ఐఎస్ - ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అండ్ సిరియా) చేరారని ఆయన ఎక్కడా చెప్పలేదు.

3. మరో మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ వీడియోను మరో టీజర్‌లో వినియోగించారు. అందులో ఆయన మాట్లాడినదొక్కటైతే, సబ్ టైటిల్స్ మరో రకంగా వేస్తూ - 'రానున్న 20 యేళ్లలో కేరళను ముస్లిం రాజ్యంగా మార్చే పన్నాగాన్ని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) చేపట్టింద'ని ఆయన ఆరోపించినట్టు చూపించారు. పీఎఫ్ఐ యువకుల్ని ఇస్లాంలోకి ఆకర్షించడం గురించే అతడు చెప్పాడు గానీ అతను కూడా 'లవ్ జిహాద్' అనే మాట మాట్లాడలేదు.

అచ్యుతానందన్ ఈ మాటలన్న 13 సంవత్సరాల తర్వాత కూడా కేరళ విద్య, వైద్యం ఇత్యాది పారామీటర్లలో ముందు వరుసలో ఉంది. సురక్షితమైన సెక్యులర్ రాష్ట్రంగా ఉంది. కొద్ది రోజుల క్రితం 'ది రియల్ కేరళా స్టోరీ' అంటూ కేరళ ప్రభుత్వం విడుదల చేసిన ప్రచార పోస్టర్లో ('ది టెలిగ్రాఫ్'; 20-05-2023; పేజి. 7) స్వయంగా 'నీతీ ఆయోగ్' కేరళ ఏయే సూచికల్లో ఆలిండియా ఫస్ట్‌గా నిలుస్తోందో చెప్పింది. ఈ ఫేక్ సినిమాకు టాక్స్ ఫ్రీ చేసిన రాష్ట్రాలు ఆ కేరళ స్థాయికి చేరుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. కోవిడ్ కంట్రోల్లో కేరళ ఎలా రోల్ మోడల్‌గా నిలిచిందో చూశాం. సినిమాకు పన్ను రాయితీ ఇచ్చిన ఉత్తర ప్రదేశ్‌లో శవాలు గంగా నదిలో ఎలా ప్రవహించాయో కూడా చూశాం. (కేరళ సమాజంలో సమస్యలు లేవని కాదు, అక్కడి ప్రభుత్వాలకు పరిమితులు లేవనీ కాదు. కానీ ఆ ఉత్తర భారత రాష్ట్రాల కంటే మెరుగని మాత్రం చెప్పవచ్చు.) కేరళ ప్రత్యేకతే వేరు. మతమార్పిడులు అన్ని దిశల్లోనూ జరుగుతాయి. ప్రేమ వివాహాలూ జరుగుతుంటాయి. కొందరు తల్లిదండ్రులు గోల చేయడం నిజం కావచ్చు. హాదియా కేసులో తలదూర్చి చేతులు కాల్చుకుని వెనుదిరిగారు హిందూత్వ శక్తులు. ఎంత ప్రయత్నించినా కేరళలో బీజేపీ సీట్ల సంఖ్య 'నిండు సున్నా'నే. అందుకే అంత మంట కేరళ అంటే!

## ఐసిస్‌లో భారతీయుల సంఖ్య ఎంత?

1. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ దేశాలవారీ టెర్రరిజం రిపోర్టు (2020) ప్రకారం, నవంబర్, 2020 నాటికి 'ఐసిస్'లోని భారతీయుల సంఖ్య 66 మాత్రమే. ధృవ్ రాఠీ అనే యూ ట్యూబర్ విశ్లేషణ ప్రకారం, 20 కోట్ల మంది భారతీయ ముస్లింల జనాభాను లెక్కలోకి తీసుకున్నపుడు ఇది (66 అనే సంఖ్య) చాలా చిన్నది. మిలియన్ మంది భారతీయ ముస్లింల లోంచి 'ఐసిస్'లోకి చేరిన వారి సంఖ్య 0.5 మాత్రమే. అభివృద్ధి చెందిన ఫ్రాన్స్ లాంటి దేశంలో ఈ నిష్పత్తి 18గా వుంది. ఇదే నిష్పత్తి బెల్జియమ్‌లో 40 కాగా, జోర్డాన్‌లో 315. భారతీయ ఏజెంట్లు ఎక్కువ మందిని రిక్రూట్ చేయడం లేదని 'ఐసిస్' వారి బాధ అయితే, 'ది కేరళ స్టోరీ' వారి బాధ దానికి భిన్నంగా వుంది.

2. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖోరాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ)లో చేరడానికి తమ భర్తలతో పాటు వెళ్లిన నలుగురు భారతీయ మహిళలు ఆఫ్ఘనిస్తాన్ జైలులో ఉన్నారని జూన్ 2021లో 'ది హిందూ' నివేదించింది. వీరి

పేర్లు సోనియా సెబాస్టియన్ అలియాస్ ఆయిషా, రఫీలా, మెర్రిన్ జాకబ్ అలియాస్ మరియం, నిమిషా నాయర్ అలియాస్ ఫాతిమా ఇసా అని 'ది వీక్' పత్రిక చెబుతోంది. 2016 లో ఎన్ఐఏ ప్రచురించిన 'మోస్ట్ వాంటెడ్ టెర్రిస్టుల లిస్టు'లో ఈ నలుగురితో పాటు మరో ఇద్దరు ముస్లిం అమ్మాయిలు ఉన్నారు. అంటే మొత్తం ఆరుగురు కేరళ అమ్మాయిల్లో మతం మార్చుకున్నది ముగ్గురే. వారిలో ఇద్దరు క్రిష్టియన్లు. ఒక్కామె మాత్రమే (నిమిషా నాయర్) హిందువు. వీరంతా దేశం విడిచి పోయినపుడు కేంద్రంలో వున్నది మోదీ ప్రభుత్వమే. ఇప్పుడు భారతదేశం తిరిగొస్తామంటున్న వీరిని వెనక్కితీసుకోమని చెబుతున్నదీ ఈ ప్రభుత్వమే.

3. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) 2019 లో చెప్పిన మేరకు 2014 – 2018 మధ్య భారతదేశ 'ఐసిస్' అనుకూల కేసుల సంఖ్య 180 – 200 మాత్రమే. 'అనుకూల' అనగా 'ఐసిస్'లో చేరిన వారని కాదు, ఆ సంస్థ వార్తలు పంచుకున్న లేదా ప్రచారం చేసిన అందర్నీ కలుపుకుని అన్నమాట! భారత హోం మంత్రిత్వ శాఖ ఈ సంఖ్యను 155 గా పేర్కొంది. అసలు ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల నుండి 'ఐసిస్'లో చేరిన విదేశీ ఫైటర్ల సంఖ్య 40000. (మూలం: 'బియాండ్ ది కాలిఫేట్, 2017' పేరుతో సౌఫాన్ గ్రూప్ నివేదిక) అలాంటప్పుడు 40000 లో కేరళ 'స్త్రీల సంఖ్యే' 32000 లేక 50000 అనడం హాస్యాస్పదం కాదా? ధృవ్ రాఠీ తన వీడియోలో మరికొన్ని గణాంకాలు ఇచ్చాడు.

4. 2016 'ఇండియా టుడే' వ్యాసం ప్రకారం కుటుంబాలతో సహా 'ఐసిస్'లో చేరిన వారిలో ఎక్కువ మంది మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణాల నుండి ఉన్నారట!

5. బలవంతపు మతమార్పిడులను పరిశోధించేందుకై కేరళ ప్రభుత్వం 2017లో 'ఎన్ఐఏ'కి 90 కేసులు అప్పజెప్పింది. అందులో 11 కేసుల్ని స్టడీ చేసిన ఆ సంస్థ ఇవన్నీ 'పీఎఫ్ఐ' సహకరించిన మార్పిడులే తప్ప బలవంతపు మార్పిడులు కావని వొప్పుకుంది.

6. కేరళలో మతమార్పిడుల వైనాన్ని చెప్పే వార్త ఒకటి 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' (02–04–2021)లో వచ్చింది. దీని ప్రకారం కేరళ ప్రభుత్వం దగ్గర మతమార్పిడులకు సంబంధించిన 506 అప్లికేషన్లు జమయ్యాయట! ఇందులో 241 (అనగా 47%) క్రిష్టియానిటీ లేదా ఇస్లాం నుండి హిందూ మతంలోకి మారుతున్న వారివే అన్నది గమనించాల్సిన అంశం. 'ప్యూ రిసెర్చ్ సెంటర్' ప్రకారం కేరళలో హిందువుల నుండి ఇతర మతాల్లోకి మారిన వారి సంఖ్య 0.7% అయితే, ఇతర మతాల నుండి హిందూ మతంలోకి వచ్చిన వారి శాతం 0.8%. ఈ గణాంకాలు కేరళలో కొనసాగుతున్న సమతుల్య స్థితిని తెలియజేస్తాయి.

అంతర్జాతీయ టెర్రరిజంలో భారతీయ ముస్లింల సంఖ్య తక్కువగా ఉండటం ప్రపంచ పరిశోధకులకే ఆశ్చర్యం కలిగించే విషయం. భారతదేశ 'వైవిధ్యతలోని ఐక్యత', భారతీయ ముస్లింలు ఆదిలోనే మత రాజ్యాన్ని కాదని సెక్యులరిజాన్ని ఎంచుకోవడం, చాలా మంది ముస్లిం మతగురువులు కూడా టెర్రరిజానికి వ్యతిరేకంగా ఫత్వాలను జారీ చేయడం, చదువుకున్న ముస్లింలలో వచ్చిన ప్రగతిశీల మార్పులూ – ఇలా ఎన్నో అంశాలు ఈ స్థితికి దోహదపడ్డాయి. హిందుత్వ కళ్లద్దాలు తొడుక్కున్న వారికి ఇలాంటి ప్రశంసాయోగ్యమైన అంశాలు కూడా కనిపించవు.

## తలా తోకా లేని రెచ్చగొట్టుడు సినిమా :

అందంగా కనిపించే ప్రమాదకరమైన సినిమాలు ఉండొచ్చు. కానీ ఇది చెత్త దర్శకుడి చెత్త సినిమా. కథ గానీ, నటన గానీ, నేపథ్య సంగీతం గానీ ఏదీ బాగోలేదు. ఆసిఫా కనిపించే ప్రతిసారీ వినిపించే నేపథ్య ధ్వనిని గమనించండి.

1. మలయాళం పాత్రలన్నీ దక్షిణ భారత యాసతో కూడిన హిందీలో మాట్లాడుతూ సడెన్‌గా మలయాళంలోకి జంప్ ఔతుంటాయి.
2. 'వాస్తవాల మీద ఆధారపడిన సినిమా' అని రాశారు. కానీ నిమిషా నాయర్ విషయమే తీసుకుంటే ఆమె తన భర్తతో కలిసి 'ఐసిస్'లో చేరింది. ఎవరో మోసం చేస్తే, ఇంకెవరినో పెళ్ళాడి వెళ్లలేదు. సినిమాలో చూపినట్టు ఆమె పశ్చాత్తాపమూ చెందలేదు. ఆమె వీడియో ఇంటర్వ్యూలను చూస్తే ఆమె ఆ 'ఉగ్రవాదపు' మైకంలోనే ఉన్నట్టు కనిపిస్తుంది. ఉగ్రవాదాన్ని సమర్థించే ప్రసక్తే లేదు గానీ ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత, ప్రపంచం ఏకధృవ ప్రపంచంగా మారడం, 'ముస్లిం ఉగ్రవాద బూచి'ని అమెరికన్ సామ్రాజ్యవాదం సృష్టించడం వంటి విషయాలను కూడా కొంచెం విశ్లేషించుకుంటే ప్రపంచ రాజకీయాలు మరింత స్పష్టంగా అర్థమౌతాయి. అలాంటి పని బాధ్యతాయుతమైన దర్శకులు మాత్రమే చేయగలరు.
3. హిజాబ్ స్త్రీలకు సురక్షితం అని ఒప్పించడానికి పార్టీలో ఆడపిల్లల బట్టలు చింపిన దృశ్యం ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో ఆ తర్వాతి దృశ్యంలోనే ఆ పిల్లలు శిరోవస్త్రాలు ధరించి రావడం కూడా అంతే హాస్యాస్పదంగా వుంటుంది. ఇరాన్ లాంటి కరుడుగట్టిన దేశాల్లోనే హిజాబ్ వ్యతిరేక ఉద్యమాలు నడుస్తున్న రోజులివి.
4. ఇది స్త్రీ వ్యతిరేక సినిమా అని ఈజీగా చెప్పొచ్చు. స్త్రీలకు సొంత మెదడున్నట్టు ఎక్కడా కనిపించదు. మత పురుషుల ఆలోచనల మేరకు తమను తాము మలచుకోవడమే ఈ సినిమాలోని స్త్రీల స్వభావం అన్నట్టు చూపారు.
5. ఆధునిక సమాజ ఆవిష్కరణ ఐనటువంటి మతతత్త్వం మధ్యయుగ ముస్లింల పాలకులకు ఆపాదిస్తూ చరిత్రను తిరగరాస్తున్న కాలం ఇది. ఈ సినిమాలో 'ఆలంగిర్ (ప్రపంచ విజేత) ఔరంగజేబు మన కోసం వదిలిపెట్టిన కార్యాన్ని మనం పూర్తి చేయాలి కదా?' అనంటాడు ఒక మత గురువు తన శిష్యుడితో. 'ప్రేమలో పడేయండి, కడుపు చేసెయ్యండి, రేప్ చేయండి' అనే మాటలు మతగురువుల నోట యథేచ్ఛగా వినిపించారు సినిమా వాళ్లు.
6. ఒక రేపిస్టును బాధితురాలి దృక్కోణంలో భయంకర క్లోజప్పులో చూపించారు. (నిమాహ్ విషయంలో) కథానాయకి గ్యాంగ్ రేప్ దృశ్యాన్ని 'ది కశ్మీర్ ఫైల్స్'లో 'స్త్రీని కలప రంపంతో కోయడం' లేక 'చిన్న పిల్లాడి నుదుట బుల్లెట్ కొట్టడం' లాంటి ఫైనల్ ఇంపాక్ట్ ఇచ్చే దృశ్యాలతో పోల్చవచ్చు. ఈ దర్శకులు తమ దృశ్యాలను 'సిండ్లర్స్ లిస్ట్' సినిమాతో పోల్చి సమర్థించుకుంటున్నారు. కానీ

ఆ సినిమా జరిగిన వాటి కంటే తక్కువే చూపింది. 'జరగాల్సింది చాలా ఎక్కువే మిగిలుంది' అన్న దురుద్దేశంతో మనవాళ్లు చూపుతున్నారు. మరో ప్రభుత్వ పాలనలోనైతే ఇలాంటి సినిమాలకు సెన్సారు సర్టిఫికెట్ దొరికేదే కాదేమో!

7. ముస్లిం వ్యతిరేకత, స్త్రీ వ్యతిరేకతే కాదు ఈ సినిమా కమ్యూనిజానికి వ్యతిరేకతను కూడా కనపరుస్తుంది. 'కమ్యూనిజం లాంటి విదేశీ సిద్ధాంతాలు కాదు మన సంస్కృతి గురించి చెప్పాల్సింది' అన్న డైలాగు గురించి ముందే చెప్పుకున్నాం. 'కమ్యూనిస్టులు అందరి కంటే పెద్ద హిపోక్రైటు' అన్న డైలాగుకు కూడా ఉత్తర భారతదేశ భక్తులు చప్పట్లు కురిపిస్తున్నారట! కాబట్టి ఫాసిస్టులకు శతృవులెవరో ఈ సినిమాల వాళ్లకు బాగా తెలుసు.
8. ఇక స్వామి భక్తి ప్రదర్శన విషయం అంటారా! అదీ వుంది. 'తీవ్రవాదం విషయంలో ప్రస్తుత భారతదేశానిది జీరో టాలరెన్స్' అని ఆఫ్ఘన్ జైళ్లోని ఆఫీసర్ అన్నప్పుడు హాళ్లో ఈలలే ఈలలు!

## గుజరాత్ స్టోరీ మాటేమిటి?

జాతీయ నేర గణాంకాల విభాగం లెక్కల ప్రకారం 2016 నుండి 2020 మధ్య కాలంలో గుజరాత్‌లో 41,621 మంది మహిళలు ఆచూకీ కోల్పోయారట! "వీరిలో అధికులు పక్క రాష్ట్రాలకు తరలించబడ్డారు లేక వ్యభిచారంలోకి నెట్టబడ్డారు" అని ఐపీఎస్, గుజరాత్ మానవ హక్కుల కమీషన్ సభ్యులు సుధీర్ సిన్హా చెబుతున్నారు. ఈ విషయంపై ఎవరైనా 'ది గుజరాత్ స్టోరీ' తీయగలరా? గుజరాత్ అల్లర్లపై బీబీసీ డాక్యుమెంటరీ వచ్చింది. దాన్ని సహించగలిగారా ఇప్పుడు ఈ సినిమాను ప్రమోట్ చేస్తున్న పెద్దలు? 'ఐసిస్' ఉగ్రవాదం ఎంత భయంకరమో గాంధీజీని హత్యచేసిన ఉగ్రవాదం కూడా అంతే ప్రమాదం. చరిత్ర పుస్తకాలు మార్చేస్తే చరిత్ర మారిపోదు.

**2017 రిపోర్టు:** మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ 11 మంది పాకిస్తాన్ గూఢచారులను అరెస్టు చేసింది. వీరిలో బీజేపీ ఐటీ సెల్‌కి సంబంధించిన ధృవ్ సక్సేనా కూడా వున్నాడు. (ఏబీపీ న్యూస్)

**2017 రిపోర్టు:** పాకిస్తాన్‌లోని 17 ఫోన్ నంబర్లతో సంపర్కం ఉన్న ఉగ్రవాద అనుమానితులు ముగ్గుర్ని మధ్య ప్రదేశ్‌లో అరెస్టు చేశారు. వీరిలో బలరామ్ సింగ్ అనే భజరంగదళ్ నాయకుడు ఉన్నాడు. ఈయన రెండేళ్ల క్రితం చైనా సిమ్-బాక్సుల కేసులో అరెస్టయి బెయిలు మీద ఉన్నాడట! (ఎన్‌డీటీవీ)

**తాజాగా 2023 రిపోర్టు:** 'డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) సీనియర్ సైంటిస్ట్ ప్రదీప్ కురుల్కర్‌ను పాకిస్తాన్ గూఢచర్య సంస్థ ఐఎస్‌ఐతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణతో అరెస్టు చేశారు. ఆయన 14 ఏళ్ల పాటు ఆర్‌ఎస్‌ఎస్ శాఖలో సెక్సఫోన్ వాయించే వాడట! (టైమ్స్ నౌ)

ఈ మూడు రిపోర్టులను జనరలైజ్ చేసి ఎవరైనా సినిమా తీస్తే ఎలా వుంటుంది? పుల్వామా దాడి ప్రభుత్వ వైఫల్యం వల్లనే జరిగిందనీ, అంతమంది సైనికులు ప్రయాణిస్తున్న రోడ్లను శానిటైజ్ చేయలేదనీ అప్పటి జమ్మూ-కాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆరోపించాడు. ఈ విషయం మీద 'ది పుల్వామా ఫైల్స్' సినిమా తీసే సాహసం చేయగలరా? అందుకే 'ది కేరళ స్టోరీ'లు తీసేటపుడు కొంత సభ్యత పాటించ వలసిందని కోరాల్సి వస్తోంది.

## ఈ సినిమాల ప్రమాదం :

వండేవాడూ, వడ్డించేవాడూ మనవాడే ఐతే కాషాయం ధరించిన దర్శకులకు వాట్సప్ ఫార్వర్డ్‌లే హిట్ సినిమా ఫార్ములాలు. విద్వేషమే విజయానికి సోపానాలు! ఐదు ఫ్లాప్ సినిమాల తర్వాత అదా శర్మా ఇపుడు పెద్ద నటి. వివేక్ అగ్నిహోత్రి తర్వాత నేడు సుదిప్తో సేన్ కోట్లు సంపాదించిన దర్శకుల లిస్టులో చేరిపోయాడు. కేరళ హై కోర్టు చీవాట్లు పెట్టిన తర్వాత సినిమా ట్రైలర్‌లోని 32000 సంఖ్యను 3 గా మార్చారు. ఇప్పుడు జస్టిస్ చంద్రచూడ్ పుణ్యమా అని *"ఈ సినిమా కేవలం కల్పితమే. 32000 మంది గానీ లేదా ఏ కొందరైనా గానీ కన్వర్ట్ అయి తరలించబడ్డారని చెప్పటానికి మా దగ్గర ఎటువంటి ప్రామాణిక ఆధారాలూ లేవు"* అని డిస్క్లైమర్ వేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కానీ ఈలోగా 'ది కేరళా' అని జనరలైజేషన్ చేయడం ద్వారా, ముస్లిం లందరినీ దుర్మార్గులుగా చిత్రించడం ద్వారా సమాజానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. టీజర్లూ, ట్రైలర్లూ, ప్రధాన మంత్రి రికమెండేషన్లూ, ఐటీ సెల్, గోదీ మీడియా ప్రచారాలూ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పన్ను రాయితీలూ అన్నీ కలిపి నిర్మాతలకు రావలసినంత లాభం వచ్చేసింది.

ఢిల్లీలో ఈ సినిమా చూసొచ్చిన కుర్రాళ్లను 'న్యూస్ లాండ్రీ' విలేకరి ప్రశ్నించినపుడు 'ఇక ముస్లింల విషయంలో ఏం జరగబోతోందో మేం చెప్పం. వార్తల్లో చూసుకోండి' అని 'జై శ్రీరాం' నినాదాలు చేస్తూ వెళిపోయారు. ఇలాంటి సినిమాలు ఎంత ప్రమాదాన్ని కొనితేగలవో, సమాజంలో ఎంతటి వైషమ్యాలను సృష్టించగలవో అర్థం అవుతుంది. విషాదమేమిటంటే 'ది కేరళ స్టోరీ'తో పాటే విడుదలైన సుధీర్ మిశ్రా 'అఫ్వాహ్ (పుకారు)' వాట్సప్ పుకార్ల ప్రమాదం గురించీ, మతతత్వ రాజకీయాల గురించీ మన కళ్ళు తెరిపిస్తుంది. కానీ ఏలికలకు నచ్చని ఈ సినిమాకు చాలా అసదుపాయకర సమయాలూ, లొకేషన్లూ కేటాయించి సినిమాను హతమార్చారు. మంచి సినిమాలను చంపేయడంలో మల్టిప్లెక్స్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ కూడా దుష్టపాత్రను పోషిస్తోంది.

కేరళ నుంచి వచ్చినన్ని మంచి సినిమాలు మరో భాషలో వచ్చి ఉండవు. అటువంటి కేరళపై విషం చిమ్మే చెత్త సినిమా తీశారు. మలయాళంలో ఏ సగటు దర్శకుడైనా ఈ సుదిప్తో సేన్ కంటే బెటర్ సినిమా తీయగలడు. 'కానీ కళ సామాజిక ప్రయోజనం కోసం కాదు' అనుకునే అంధభక్తుడి లాంటి నేలబారు దర్శకుడికి కూడా 'ముస్లిం వ్యతిరేకతే' హిట్ ఫార్ములా ఐపోయింది. రాజకీయ సినిమా చరిత్రను అధ్యయనం చేసేవారు హిట్లర్ కాలంలో వచ్చిన 'ట్రయంప్ ఆఫ్ ది విల్', 'ది ట్రెయిటర్', 'రాబర్ట్ అండ్ బెర్ట్రామ్', 'ది ఎటెర్నల్ జ్యూ' లాంటి యూదు వ్యతిరేక సినిమాలను పరిశోధిస్తారు. ఈనాడు వస్తున్న 'ది కశ్మీరీ ఫైల్స్', 'ది కేరళా స్టోరీ' లాంటి సినిమాల గురించి భావితరాల వారు అధ్యయనం చేస్తారు. సినిమాలు ఎగదోసే మారణ కాండల్ని అర్థం చేసుకుంటారు.

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-10

# యశపాల్ మహత్తర నవల

# 'ఝూటాసచ్' (False Truth)

– కొత్తపల్లి రవిబాబు

**"అబద్ధపు సత్యం"** (ఝూటాసచ్) నవల రెండు భాగాలున్న 1017 పుటల రాజకీయ నవల. 1942 నుండి 1957 ఎన్నికల ఫలితాల వరకు సాగిన చరిత్రను రచయిత ఈ నవలలో చిత్రీకరించారు. దీని మొదటిభాగం 1958లో, రెండవ భాగం 1960లో విడుదల అయ్యాయి. బొంబాయి నుంచి వచ్చిన హిందీ వారపత్రిక 'ధర్మయుగ్'లో ధారావాహికగా వచ్చింది.

భగత్‌సింగ్ నాయకుడిగా వున్న హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీలో సభ్యుడిగా వున్న కళాశాల విద్యార్థి యశపాల్ సింగ్, 'ఝూటాసచ్' నవలా రచయిత యశపాల్ ఒకరే! 1903 డిసెంబర్ 3న కాంగ్రా హిల్స్‌లోని గ్రామంలో జన్మించారు. యశపాల్ అనారోగ్యం వల్ల ఆ కుటుంబం లాహోర్‌లో స్థిరపడింది. తల్లి ఆర్యసమాజ్ సానుభూతి పరురాలు. యశపాల్ ప్రాథమిక విద్య హరిద్వార్‌లో వున్న ఆర్యసమాజ్ గురుకుల్‌లో ఉచితంగా సాగింది. ఆ తర్వాత లాహోర్‌లోని ఫిరోజ్‌పూర్ కంటోన్మెంటు హైస్కూలులో చదివారు. మెట్రిక్యులేషన్ స్కాలర్‌షిప్‌తో చదవడానికి ప్రభుత్వ కళాశాలలో అవకాశం లభించినా, దానిని తిరస్కరించి ఆర్యసమాజం వారూ, కాంగ్రెస్‌వారూ నడుపుతున్న నేషనల్ కాలేజిలో చేరారు. ఈ కాలేజిలోనే ఆయన భగత్‌సింగ్, సుఖదేవ్‌లను కలుసుకున్నారు. 1928లో హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్‌లో చేరారు. లక్ష్మీ ఇన్సూరెన్స్ కంపెనీలో కొంతకాలం అయిష్టంగా గుమస్తా పని చేశారు. 1928లో కొన్ని వారాలపాటు అజ్ఞాతంగా గడిపారు. 1930లో పునర్నిర్మాణమైన HSRAకు కేంద్ర కమిటీలో యశపాల్ సభ్యుడయ్యారు. పంజాబ్‌లో ఆ సంస్థ నిర్మాణానికి బాధ్యుడయ్యారు. అయితే యశపాల్ బ్రిటీషువారికి ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడన్న అనుమానంతో ఆయనపై హత్యాప్రయత్నం జరిగింది. చంద్రశేఖర్ అజాద్‌తో కలిసి HSRAలో అజాద్ చనిపోయేవరకు 1931 ఫిబ్రవరి వరకు పనిచేశారు. అజాద్ మరణం తర్వాత మరల సంస్థను పునఃనిర్మాణం చేసి 1932లో దానికి కమాండర్ ఇన్ ఛీఫ్‌గా పనిచేశారు. రాజద్రోహ కరపత్రం ప్రచురించి నందుకు 1932 జనవరి 22న అరెస్టయి, 1938 మార్చి 2న విడుదల అయ్యారు. బరైలీ సెంట్రల్ జైలులో తాను ప్రేమించిన ప్రకాశవతితో ఆయన వివాహం 7 ఆగస్టు 1936లో జరిగింది. ఆ తర్వాత హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీకు సరైన వారస సంస్థగా సి.పి.ఐ. (ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ)ని పరిగణించారు. అతను ఏ పార్టీలోనూ చేరలేదు.

1938లో విడుదలైన ఆయన పంజాబ్ వెళ్ళటాన్ని నిషేధం విధించారు. కనుక లక్నోలో స్థిరపడ్డారు. 1939లో పింజ్రేకి యురాన్ (Flight from the Cage) రాశారు. కొన్నాళ్ళు 'కర్మయోగి' పత్రికలో పనిచేసి, 'విప్లవ్' అనే సొంతపత్రికను హిందీ, ఉర్దూ భాషల్లో ప్రారంభించారు. అయితే రాజద్రోహ నేరం కింద 13 వేలు ధరావతు కట్టాల్సి రావడంతో పత్రికా ప్రచురణను ఆపివేశారు. 1941లోనే ఒక ప్రచురణ సంస్థను, ముద్రణాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

1941లో 'దాదా కామ్రేడ్' (Comrade, the Big Brother), 1943లో 'దేశద్రోహి' నవలలు ప్రచురించారు. 1949లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అరెస్టు చేయగా ప్రజల వత్తిడితో ఆయనను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే 6 నెలలపాటు లక్నో వెళ్ళగూడదని నిషేధించారు. 1951-55లలో 3 భాగాలుగా తన స్వీయచరిత్ర 'సింహావలోకనం' రాశారు. నాల్గవ భాగం రాస్తూ 1976 డిసెంబరు 26న మరణించారు. మూడు భాగాలను తెలుగులోకి ఆలూరు భుజంగరావు అనువదించారు.

నవలలు, కథలు, వ్యాసాలు, ఒక నాటకం, రెండు యాత్రా గ్రంథాలు, స్వీయచరిత్ర రాసిన యశపాల్‌ను సాహిత్య విమర్శకులు ప్రేమ్‌చంద్ వారసునిగా గుర్తించారు. 1976లో 'మేరీ తేరీ ఉస్ కా బాత్'కు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, ఆ తర్వాత పద్మభూషణ్ పురస్కారం లభించాయి.

యశపాల్ తన బాల్యాన్ని లాహోర్‌లో గడిపారు. కళాశాల విద్య వరకు లాహోర్‌లోనే కొనసాగింది. తన కాబోయే భార్య ప్రకాశవతిని ఆయన మొదటిసారి లాహోర్‌లోనే కలుసుకున్నారు. అయితే, 1932లో రాజద్రోహ నేరం క్రింద ఏడాదిపాటు లాహోర్‌కు దూరంగా ఖైదీగా కాలం గడిపారు. 1938లో విడుదలైన తర్వాత లాహోర్‌కు వెళ్ళగూడదని ఆంక్షలు విధించారు. దేశ విభజనకు ఒక దశాబ్దం ముందు ఆయన లక్నోలో స్థిరపడ్డారు. 1947లో విభజన ప్రకటన సమయంలో ఆయన లాహోర్‌లో లేరు. లాహోర్ నుండి ముస్లిమేతర ప్రజలను బలవంతంగా తరిమికొట్టే అల్లర్లను ఆయన ప్రత్యక్షంగా చూడలేదు. కానీ 1955లో సోవియట్ యూనియన్‌కు వెళ్తూ తోవలో ఆయన లాహోర్ వెళ్ళారు. తన ప్రాణ ప్రదమైన లాహోర్ పట్టణంలో ఆనాటికీ విభజన గాయాలున్నాయి. అది ఆయనకు శ్మశానంలా కనబడింది. గతంలో ఆయన చూసిన సజీవమైన పంజాబ్, లాహోర్‌లు అదృశ్యమయ్యాయి.

దేశ విభజన మూలంగా యశపాల్‌గాక, ఉర్దూ సాహితీవేత్తలు కిషన్‌చందర్, రాజేంద్రసింగ్ బేడి, కన్హయా లాల్‌కపూర్, కుశ్వంత్‌సింగ్ మొదలగువారు లాహోర్‌ను విడిచి వెళ్ళారు. ఇండియా నుండి లాహోర్‌కు ఇంతెజార్ హుస్సేన్, ముంతాజ్ ముఫ్తి, ఖుర్రతుల్లా హైదర్, అబుల్ హసన్ నగ్మి తదితరులు వలస వచ్చారు.

## రెండు భాగాల 'ఝూటాసచ్'

1017 పుటల ఈ నవల రెండు భాగాలుగా వుంది. మొదటి భాగానికి 'వతన్ ఔర్ దేశ్' (1958), రెండవ భాగానికి 'దేశ్‌కా భవిష్య్' (1960) అనే శీర్షికలు పెట్టారు. మొదటి భాగమంతా లాహోర్‌లో జరుగుతుంది. రెండవ భాగంలో కథ జలంధర్, ఢిల్లీ, లక్నోలో జరుగుతుంది. మొదటి భాగంలో 450 పుటల్లో 1947కు పూర్వం లాహోర్ ప్రజల జీవితాన్ని చిత్రించారు. రచయితకు గల లాహోర్ జ్ఞాపకాలు నవల చివరివరకూ తొంగిచూస్తూ వుంటాయి. లాహోర్ నగరపు 1947కు ముందున్న వైభవాన్నీ, 1947 తర్వాత అలముకున్న దైన్యాన్నీ చూచి యశపాల్ చలించాడు.

1935 నాటి లాహోర్ నగర సామాజిక చిత్రం ఈ క్రింది విధంగా వుంది. నగరంలో నాలుగు సామాజిక విభాగాలున్నాయి.

1. పాతనగరం. 13 గేట్లు గల పాతనగరం. క్రిక్కిరిసిన ఇళ్ళు. సంప్రదాయ సంస్కృతిని పాటించే ప్రజల నివాస స్థలం.

2. సివిల్ లైన్ : దక్షిణంవైపు వున్న విశాలమైన భవనాలు - విశాలమైన తారురోడ్లు - మధ్యతరగతి విలువలతో కూడిన జనం - యూరోపియన్ శిష్ట జనాభా.

3. మిలటరీ కంటోన్మెంట్ ప్రాంతం.

4. మోడల్ టౌన్ : ఇక్కడ ఎక్కువగా విశ్రాంత అధికారులు ఇళ్ళు కట్టుకొని నివశిస్తున్నారు.

ఈ నవలలో ముఖ్యమైన పాత్రలలో ఇద్దరు అన్న, చెల్లెలు ఐన జయదేవ్‌పూరి, తార వుండే వీధిపేరు భోలా పంధే కి గలీ. లాహోర్‌లోని 13 గేట్లలో ఒకటైన షా అలామీ గేటు లోపల, హిందువులు వుండే వీధి ఇది. మాస్టర్ రామ్‌లు భయ్యా ఐదుగురు సంతానంలో జయదేవ్‌పూరీ, తార మొదటి ఇద్దరు. అది పంజాబీ మధ్యతరగతి కుటుంబం. రామ్‌లు భయ్యా ఆర్య సామాజీకుడు. షా ఆలామీ దర్వాజా ప్రాంతం నుంచి సన్నని ఇరుకు రోడ్డు మోచి దర్వాజా ప్రాంతాన్ని కలుపుతుంది. అది ముస్లిములు నివసించే ప్రాంతం. ఒక గది మాత్రమే వున్న ఇంట్లో కాలం గడుపుతున్న మధ్యతరగతికి చెందిన రామ్‌లు భయ్యా కుటుంబపు ఆర్థిక దుస్థితినీ, వారి నిరుద్యోగాన్నీ, వేదనను యశపాల్ చిత్రించారు. లాహోర్‌లో వివిధ వర్గాల ప్రజల వాస్తవ జీవిత చిత్రణ ఈ నవలలో చూస్తాం. 1947 నాటి కొన్ని చారిత్రక ఘటనలను రచయిత చిత్రించారు. ఉదాహరణకు.... లాహోర్ అసెంబ్లీ గేటు వద్ద 1947 మార్చి 4న మాస్టర్ తారాసింగ్ తన కృపాణ్‌ను ఝుళిపించడం గురించి ప్రస్తావించారు. పంజాబ్‌లోని యూనియన్ మంత్రివర్గాన్ని రద్దుచేసినపుడు మతతత్త్వ ఉన్మాదం పెచ్చరిల్లడం, దానిని అణచివేయడానికి కమ్యూనిస్టు కార్యకర్తలు చేసిన విఫల ప్రయత్నాలు తదితర సామాజిక వాస్తవాలను తన నవలకథాగమనంలో వివరించారు.

భోలా పంధే కి గలీలో ఒక ముసలామె మరణిస్తే, ఆమెకు సంతాప సూచికగా జరుగుతున్న ఒక ఆచారాన్ని వర్ణిస్తూ నవల ప్రారంభ మౌతుంది. ఆమె రామ్‌లు భయ్యా తల్లి రామ్‌లు భయ్యా ఆమె చిన్నకొడుకు ఒక టీచరు. జయదేవ్ పూరీ, తార ఆమె మనమ సంతానం. జయదేవ్, తార దయాల్‌సింగ్ కళాశాలలో చేరతారు. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలు నమ్మి ప్రచారం చేసేవారి కళాశాల అది. దానిలో పనిచేసే అధ్యాపకులు మతతత్త్వానికి వ్యతిరేకులు. సామాజికంగా తిరోగమన భావాలను వారు బలపరచరు. ఆ కళాశాలవారు జహంగీర్ మ్యూజియం సమీపాన గల పార్కులో నిర్వహించిన మతాతీత సామూహిక భోజన కార్యక్రమంలో తార పాల్గొంటుంది. జయదేవ్ ఎం.ఏ రెండవ సంవత్సరంలో వుండగా, ఒక జాతీయ రహస్య సంస్థలో పనిచేస్తున్నట్లు ఋజువై రెండేళ్ళ జైలు శిక్షను అనుభవించారు. విడుదలైన తర్వాత జయదేవ్ కాంగ్రెసు అనుకూల ఉర్దూ దినపత్రిక 'పైరోకర్'కు విలేఖరిగా చేరాడు. తారా ఒక్కటే కాలేజికి వెళ్తుంటుంది.

1947 మార్చి 2న పంజాబులో ముస్లింలీగు వైపు మొగ్గుచూపే యూనియనిస్టు పార్టీ, మెజారిటీలో వున్నా కూడా రాజీనామా చేయగా గవర్నర్ పాలన విధించారు. ముస్లింలీగు ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి సిద్ధంగా వుంది. కాని కాంగ్రెస్ బలపరచలేదు. మార్చి 6న మోచిగేట్ ప్రాంతంలో జరిగిన అల్లర్లు జయదేవ్‌కు తెలుస్తాయి. అది షా అలామికి దగ్గర్లోనే వున్న ప్రాంతం. కర్ఫ్యూ విధించారు. షాపులు మూసేశారు. ఆ గల్లీలో స్వీట్స్ అమ్మే దౌలు మామాను ఎవరో కత్తితో పొడిచి చంపేశారు. జయదేవ్ చాలా బాధపడ్డాడు. మరో పత్రిక ఉపసంపాదకుడు దానిపై సంపాదకీయం రాసి ఇవ్వమని అడిగితే రాసి ఇచ్చాడు. భోలాపంధే కా గలీ వాసులు దానిని చదివారు. ఆ సంపాదకీయం ఇలా సాగింది.

"దౌలు మామా! నీవు లాహోర్‌లోని ఎన్నో వీధుల్లో ఎందరో పిల్లలకు ప్రియమైన మామయ్యవు. నీ జీవితమంతా పిల్లలకు ఆనందాన్నిచ్చావు. వారినందరినీ వదలి వెళ్ళిపోయావు. వారంతా నీ కోసం హృదయ విదారకంగా విలపిస్తున్నారు. అమాయకులైన ఇందరి పిల్లల ఆటబొమ్మను ఏ క్రూరుడు లాక్కుపోయాడు? దౌలు మామకు శత్రువులున్నారా? ఆయనకు యూనియనిస్టు మంత్రివర్గానికి - ముస్లిం లీగు నాయకులకు ఏమైనా సంబంధం వుందా. ఆయనొక పెద్దమనిషి. అతన్ని హత్య చేయడమంటే మానవత్వాన్నే హత్య చేసినట్లు! ఎవరు అధికారంలోకి రావడాన్ని అతను అడ్డుకున్నాడు?"

తను పనిచేసే 'పైరోకరి' పత్రికకు జయదేవ్ రాసిన సంపాదకీయం మరింత తీవ్రంగా వుంది. దానిలో ఆయన కాంగ్రెస్, ముస్లింలీగ్ పెద్దలను సంబోధిస్తూ "కాంగ్రెసు, లీగు రెండూ దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి పుట్టాయి. 8 రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాన్ని ముస్లిం లీగు సహిస్తున్నా, ఒక్క రాష్ట్రంలో ముస్లిం లీగు ప్రభుత్వాన్ని కాంగ్రెసు సహించలేకపోతోంది" - ఇలా రాసినందుకు ఆ పత్రికలో ఆయన ఉద్యోగం వూడింది.

1947 మార్చిలో తార, డా॥ ప్రాణనాథ్ హవేలీలో ట్యూటర్‌గా చేరుతుంది. ప్రాణనాథ్ యువకుడు. ఆర్థిక శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకున్నవాడు. ఆక్స్‌ఫర్డ్‌లో చదివాడు. పంజాబ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తార అంటే ఇష్టపడ్డాడు. కాని ఆయన కుటుంబ సభ్యులు వారి వివాహానికి ఒప్పుకోలేదు. తారను ఉద్యోగంలోంచి తొలగించారు.

తార తనతోపాటు చదివిన ముస్లిం మతస్థుడైన అసాద్‌ను ప్రేమిస్తుంది. అసాద్ ఎం.ఏ. విద్యార్థి. స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యకర్త. కాని అన్న జయదేవ్‌తో చెప్పలేకపోయింది. ఒక ధనిక కుటుంబానికి చెందిన సోమనాథ్ సాహ్నితో ఆమె వివాహం జరపడానికి కుటుంబ

సభ్యులు నిర్ణయిస్తారు. తారకు ఆ పెళ్ళి జరగకుండా చేస్తానని జయదేవ్ ఓదారుస్తాడు. కాని అప్పటికే ఉద్యోగం వూడిన జయదేవ్ మాటను కుటుంబసభ్యులు లక్ష్యపెట్టరు. సోమనాథ్ ఒక మోసగాడిగా స్థానిక పత్రికలు ఎన్నో వార్తలు రాసాయి. ఒకచోట మోసం చేస్తుండగా ముస్లిం టీచర్ పట్టుకోగా ఆయనపై దాడిచేశాడు. దీనికి మతపరమైన మెలిక పెట్టారు.

సోమనాథ్‌కు సరైన చదువు లేదు గనుక, అతని తల్లిదండ్రులు తార ఉన్నత చదువులు చదవడానికి అభ్యంతరం చెబుతారు. తార ప్రేమించిన ముస్లిం యువకుడు అసాద్ – తార ఇల్లు, కుటుంబాన్ని వదలి వచ్చివేయడానికి సిద్ధంగా వున్నా కూడా – తాను పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఆ సమయంలో మతేతర వివాహాలకు అనుమతి ఇవ్వకపోవడంతో – తారతో వివాహాన్ని తిరస్కరిస్తాడు. అన్న, అసాద్‌లు ఇద్దరూ నిస్సహాయులు కావడంతో తార పెళ్ళి జులై 28, 1947న సోమనాథ్‌తో జరుగుతుంది. అప్పటికే లాహోర్‌లో మతపరమైన అల్లర్లు ప్రారంభమయ్యాయి. పెళ్ళిరోజునే సోమనాథ్ ఇంటికి నిప్పు పెడతారు. సోమనాథ్ మెట్లమీద నుంచి ఎగురుతూ వెళ్ళి తప్పించుకుంటాడు. తార ఇంటిపైకి వెళ్ళి, పక్క ఇంటిపైకి ఎగిరి – పెళ్ళి నుండి విముక్తి పొందుతుంది. తార ఇంటిలో తగలబడిపోయిందనుకుంటారు సోమనాథ్ కుటుంబంవారు. అగ్ని ప్రమాదం వల్ల ఆమె తన కుటుంబ వ్యవస్థ నుండి, పాటించాల్సిన నియమ నిబంధనల నుండి తప్పించుకుంటుంది.

ఆమె చేరిన పక్క ఇల్లు ముస్లిములది. ఆ ఇంట్లోవారు ఈమెను బయటకు నెట్టివేయగా అగ్ని జ్వాలల మధ్య ఇరుకు సందుల్లో జరుగుతున్న హింసాకాండ మధ్య పరిగెత్తుతుంటే, ఒక పెద్దాయన ఆమెను భుజాలు పట్టుకొని ఇంట్లోకి లాక్కుపోయాడు. అతని పేరు నబ్బు. అతని భార్య అతనికి శాపనార్థాలు పెడుతూ వుంటుంది. అయినా నబ్బు అవేవీ లెక్కపెట్టకుండా తార సల్వార్ చించిపారేస్తాడు. బ్రా మాత్రం మిగుల్తుంది. వదలివేయమని వేడుకుంటుంది. ఆమెను ప్రక్కమీదకు తోసేస్తాడు. ఆమె ప్రతిఘటిస్తుంది. ఆమె చేతులు వెనక్కి కట్టేస్తాడు. ఆమె స్పృహ కోల్పోతుంది. ఆమెపై నబ్బు లైంగిక దాడి జరిపాడు. అతని ద్వారా ఆమెకు సుఖవ్యాధి అంటుకుందని పాఠకులకు తర్వాత తెలుస్తుంది.

అది రంజాన్ మాసం. నబ్బు ఇంట్లో నేలమీద నగ్నంగా పడివున్న తార తెల్లవారుజామున పంజాబీ ఖవాలీ అసావేరి రాగంలో వింటుంది. ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నిస్తుంది. 'నేనేం తప్పు చేసాను? ఎందుకు నాకీశిక్ష' అని బాధపడ్తుంది. అసావేరి గాయని తాజీతాయి నబ్బును అందరిముందు తిడుతుంది. "ఇది జిహాద్ కాదు – మతం పేరుతో జరుపుతున్న పచ్చి వ్యభిచారం" అంటుంది. నబ్బు తారని వ్యభిచార గృహానికి అమ్మేస్తాడు. ఇరుగుపొరుగువారి సహాయంతో ఆ కొంప నుండి బయటపడి హఫీజ్ ఇనాయత్ ఆలీసాబ్ ఇంటికి చేరుతుంది. ఆయన గూఢచారి విభాగంలో పనిచేసి రిటైరైనవాడు. తార ఉన్నత కుటుంబానికి చెందినదనీ, విద్యాధికురాలు, తెలివిగలది, అందగత్తె కావడం వల్ల ఆమె మతం మార్చి, అమృతసర్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేస్తున్న తన కొడుక్కి పెళ్ళిచేయాలనుకుంటాడు. హఫీజ్ కుటుంబం మంచిదే కాని, వారు ఛాందసులు అని తార గ్రహిస్తుంది.

ఆగస్టు 18 రంజాన్ ఆఖరిరోజు. ఇంటి పైకప్పున ఎగురుతున్న ఆకుపచ్చ పాకిస్తాన్ జెండాను చూస్తుంది. లాహోర్, పంజాబ్ విదేశాలైపోయాయి.

ఆగస్టు 22న ఒక కొత్త చట్టం ద్వారా హిందువులందర్నీ పోలీసులకు అప్పచెప్పాలి. వారు మతం మారితే సమస్య లేదు. మతం మారని హిందువులుంటే, ముస్లిములు వారిని తస్కరించినట్లు అభియోగం పెడతారు. కనుక హఫీజ్ తారను హిందూ శరణార్థుల శిబిరానికి వెళ్ళమంటాడు. కాని ఆమె దుష్టుల బారినపడి మరో 11 మంది హిందూ స్త్రీలు వున్న పైకుపురాలోని ఒక గదిలో బంధింపబడ్తుంది. వారిని అమ్మటానికి అక్కడ బంధించారు. ఏదో ఒకవిధంగా ఆ గది నుండి తార తప్పించుకొని ఇండియాలోని శరణార్థి శిబిరాల వైపు వెళ్తూ దారి పొడుగునా అటూ, ఇటూ పయనిస్తున్న శరణార్థుల దుర్భర పరిస్థితులను గమనిస్తుంది. ఇరువైపులా సాగిన దౌర్జన్యాలు, దౌష్ట్యాలు తెలుస్తాయి. తార ప్రయాణించిన బస్సు అమృతసర్‌లోని శరణార్థి శిబిరంకు చేరిన సమయంలో ఆ బస్సు డ్రైవర్ వ్యంగ్యంగా ఇలా వ్యాఖ్యానిస్తాడు.

"బస్సులలో ప్రజలు తమ ఊర్లు, ఇళ్ళు వదలి తమ కొత్త దేశానికి వెళ్తున్నారు. మానవులుండే దేశాలను మతం జాతీయ దేశాలుగా మార్చింది. దేవుడందర్నీ సమానంగా సృష్టించినా, మూఢత్వం వలన వీరందరూ దేవుని పేరు చెప్పి విడిపోయారు".

గిరిధర్ లాల్ దత్తా ఒక వృద్ధ కాంగ్రెసు కార్యకర్త. ఆయన కూతురు పేరు కనక. ఆయనకు జయదేవ్ పూరి రచనా ప్రావీణ్యంపై మంచి అభిప్రాయం వుంది. ఆయన తన కూతురు కనకకు హిందీ 'ప్రభాకర' పరీక్షకు ట్యూషన్ చెప్పమంటారు. జయదేవ్ ఉచితంగా చెప్తుంటాడు. శారీరకంగా, మేధోపరంగా ఇరువురూ పరస్పరం ఆకర్షణకు గురౌతారు. కనకను తన చెల్లెలు తారతో పోల్చుకుంటాడు. ఎక్కడికి వెళ్ళాలన్నా ఎటువంటి ఆంక్షలు లేకుండా కనక వెళ్తుంది. మొహమాటం లేకుండా మాట్లాడుతుంది. కనక వుండేది గవాల్ మండి ప్రాంతం. అది సంపన్నుల నివాస ప్రాంతం.

గిరిధరలాల్‌కు వున్న ఉర్దూ ప్రచురణ సంస్థకు ఎలాగైనా తాను యజమాని కావాలనుకుంటాడు జయదేవ్. దేశ విభజన సందర్భంగా చెలరేగిన విధ్వంసకాండ, గృహ దహనాలు మోడల్ టౌన్ ఇళ్ళ కప్పులపై నుంచి కనక, ఆమె అక్క కుటుంబం చూస్తారు. షా అలామీ ప్రాంతంలో అగ్ని జ్వాలలను గమనిస్తారు. కనక కుటుంబం లాహోర్ వదలి నైనితాల్ వెళ్ళిపోతుంది. గిరిధర్‌లాల్ ఇల్లు, ప్రింటింగ్ ప్రెస్ వదలి వెళ్ళిపోతారు.

నవల రెండవ భాగం ఎక్కువగా రాజకీయాలతో నిండి వుంటుంది. శరణార్థుల బాధలు వారు శ్రమచేసి, కొత్త వాతావరణంలో స్థిరపడటానికి చేసిన ప్రయత్నాలు గత గాయాలను మరచిపోవడానికి నేటి పోరాటంలో నిమగ్నమవడం మొదలైన అనేక విషయాలను ఈ భాగంలో చర్చిస్తారు.

జయదేవ్ విభజనకు పూర్వం ఆదర్శ యువకుడు. విభజన తర్వాత ఇంటా బయటా మోసగానిగా, అబద్ధాలతో జీవిస్తాడు. చెల్లెలు తారను కలుసుకోడు. కనకను పెళ్ళిచేసుకున్నా, తర్వాత కనక అతనికి విడాకులు ఇస్తుంది. జయదేవ్ కాంగ్రెసు మార్కు జాతీయ ఉద్యమకారుడు.

శరణార్థులలో కొందరు తమకు గల కొద్దో గొప్పో ఆస్తులను, కుటుంబాలను పోగొట్టుకొని నిరాశా నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొందరు ఉన్నత మధ్యతరగతివారు. వారి విలాసవంతమైన (పాకిస్తాన్‌లో) ఇళ్ళను బలవంతంగా ఎవరెవరో ఆక్రమించారు. వారి ఆస్తులు, బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ అయ్యాయి. ఆస్తులు లేని శరణార్థుల బాధలు వీరికి లేవుగాని, గత జీవితం కంటే తక్కువస్థాయిలో జీవితం గడపడం వీరికి బాధాకరం. కనక తండ్రి గిరిధర్ లాల్ ఇల్లు, ప్రింటింగ్ ప్రెస్ లాహోర్‌లో వున్నాయి. కనుక కనక ఉద్యోగం కోసం వెదుక్కుంటుంది. కనకతో విడిపోయిన తర్వాత జయదేవ్ తన కుటుంబంతో కూడా తెగతెంపులు చేసుకుంటాడు. మొదటిభాగంలో ఆదర్శవాదిగా, ఆదర్శ రచయితగా ఉన్న జయదేవ్ సిద్ధాంతాలతో రాజీపడి కాంగ్రెస్ నాయకుడు సూద్ పంచన చేరాడు. ఢిల్లీలోని శరణార్థుల శిబిరంలో వున్న తార, ఒక ప్రముఖుని ఇంట్లో పిల్లలకు దాదిగా, ఆ తర్వాత శరణార్థి శాఖలో ఉద్యోగిగా చేరుతుంది. నవల పూర్తయ్యేటప్పటికి భారత ప్రభుత్వంలో అండర్ సెక్రటరీ స్థాయికి ఎదుగుతుంది.

కథాగమనంలో భాగంగా నవలలో అనేక చారిత్రక సంఘటనలను రచయిత చిత్రించారు. ఈ చారిత్రక సంఘటనల కోసం యశపాల్ 'ది ట్రిబ్యూన్' అనే ఆంగ్ల దినపత్రికపై ఎక్కువ ఆధారపడ్డారు. బిర్లా ఇంటిలో గాంధీ ఉపవాస దీక్ష, జనవరి 30, 1948లో ఆయన హత్య, 1951లో సార్వత్రిక ఎన్నికలు మొదలైనవన్నీ వర్ణించారు. బ్రిటిష్ ప్రభుత్వానికీ, నెహ్రూ ప్రభుత్వానికీ ఆర్థిక సలహాదారుడైన డా॥ ప్రాణ్‌నాథ్‌ను తార వివాహం చేసుకుంటుంది. విశ్వనాథ్ సూద్ రెండవ సార్వత్రిక ఎన్నికలలో ఓడిపోతాడు. తార, ప్రాణనాథ్‌లపై వచ్చిన ఆరోపణలు అబద్ధాలుగా తేలి వారు నిర్దోషులుగా బయటపడతారు. ప్రాణ్‌నాథ్ అంటాడు".... ప్రజల గొంతు ఎల్లకాలం నొక్కలేరు. దేశ భవిష్యత్తు ప్రజల చేతుల్లో వుంది – రాజకీయ నాయకులు, మంత్రుల చేతుల్లో లేదు".

ఈ నవలను ఇంగ్లీషులోకి 'దిస్ ఈజ్ నాట్ దట్ డాన్' అనే పేరుతో యశపాల్ కొడుకు ఆనంద్ అనువదించారు. ఈ పదబంధాన్ని ఆనంద్ ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన ప్రసిద్ధ గేయం నుంచి తీసుకున్నారు. 'యే ఓ సహర్‌తో నహీ' అని ఫైజ్ రాశారు.

**వచ్చే సంచికలో : భీష్మసాహ్ని 'తమస్' నవల** ●

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## 1993 జూన్ - సంపుటి : 16 : సంచిక : 11

**దంకెల్** ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ వున్న ముఖచిత్రంతో "ప్రజల నెత్తిమీద వేలాడుతున్న కత్తి దంకెల్ ముసాయిదా" అన్న సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది". రాయలసీమలో భూస్వామ్య సాయుధ ముఠాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని బలపర్చండి' అనే మరో సంపాదకీయాన్ని ప్రచురించారు. తెలుగులో కొత్తపల్లి రవిబాబు అనువదించిన పాలస్తీనా కవిత 'బీజ పరిరక్షకులు' రెండవ అట్టమీద, కా॥ కృష్ణారెడ్డి స్మృతిలో నారాయణస్వామి రాసిన కవిత 'విత్తనమెప్పుడూ విశ్రమించదు' మూడు, నాలుగు అట్టలమీద ప్రచురించారు. ఇంకా 'కవితలు' శీర్షికలో ఛాయరాజ్ రాసిన 'దుగ్గేరు', అద్దేపల్లి రాసిన 'చిగురు చివర అరుణ సముద్రం', కవితలను ప్రచురించారు. చెరుకు సుధాకర్ రాసిన నాగార్జునసాగర్ చంద్రవంక దిబ్బ అమరవీరుల సభను ఎస్.పి. మీనా విచ్ఛిన్నం చేసిన క్రౌర్యానికి రాలిన నెత్తుటిగానం 'నెత్తుటి నెలవంక'ను ప్రచురించారు. మల్లెల నారాయణ రాసిన 'అయోధ్యరామా!', జూలూరు గౌరీశంకర్ రాసిన 'అక్షరాల్ని సాయుధం చేస్తూ' 'పుస్తక సమీక్షలు' శీర్షికలో కన్యాశుల్కంను ఇప్పుడెలా చూడాలి? అని బి.ఎస్. రాములు రాసిన పుస్తకాన్ని కె. శ్రీనివాస్ సమీక్షిస్తూ – 'సాహిత్య పరిశీలనలో కుల ప్రమాణం తప్పుకాదు' అనే శీర్షికతో వ్యాసం రాశారు. అలాగే 'కథనం'ను 'ఉత్తమ కథల సంకలనం' అంటూ నవీన్ సమీక్షించారు.

పుప్పాల కృష్ణమూర్తి రాసిన 'అ(వ)కాశవాణి' కథను ప్రచురించారు. రాహుల్జీ శతజయంతి సంవత్సరం (1893–1993) సందర్భంగా దివికుమార్ రాసిన "ఆయన మహోన్నత మానవుడు" వ్యాసాన్నీ, 1-4-93న గుంటూరులో 'ప్రజాసాహితి' రాహుల్జీ శతజయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తూ డా॥ బి.యన్.యల్. హనుమంతరావు చేసిన ప్రసంగపాఠం "మన గురించి మనం తెలుసుకోవటానికి ఉపయోగించే సాధనమే చరిత్ర'ను ప్రచురించారు. 'పిల్లల ప్రపంచం' శీర్షికలో అజ్ఞాతకవి రాసిన పాట 'కన్నా ఇది మీ కోసం'ను పి. అనంతరావు రాసిన 'అస్తమిస్తున్న సూర్యుళ్ళు' కవితనూ ప్రచురించారు. 'స్త్రీవాదం – సాహిత్యం'పై హైదరాబాద్ నగరశాఖ సభ రిపోర్టుతోపాటు 'అరుణోదయ రామారావు తదితరులపై పెట్టిన అక్రమ కేసులని ఎత్తివేయాలి'! పూనా పోలీసుల దౌర్జన్యకాండను ఖండించండి!' అనే ప్రకటననూ, 'అశ్లీల స్టార్‌నైట్స్‌ను ప్రతిఘటించండి' అనే ప్రకటననూ ప్రచురించారు. సి. నారాయణరెడ్డి, భూమన్, ఈశ్వరరావులు రాసిన ఉత్తరాలు, చైతన్యవాహిని శీర్షికలో జనసాహితి, అరుణోదయ కార్యక్రమాల వివరాలు ఉన్నాయి.

1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ. 5/- ●

కథ

# మొండిచెయ్యి

హిందీ మూలం : **హరిశంకర్ పరసాయీ** స్వేచ్ఛానువాదం : **డా॥ వెన్నా వల్లభరావు**

**అది** ఒక విశ్వవిద్యాలయం. అందులో ప్రఖ్యాతి గాంచినది రాజనీతిశాస్త్ర విభాగం. దానిలో పేరుమోసిన అధ్యాపకుడు ద్రోణాచార్య. పదవీ క్రమాన్ని అనుసరించి అయన రీడర్. లెక్చరర్ నుంచి కొద్ది సంవత్సరాల క్రితమే పదోన్నతి పొంది రీడర్ అయ్యారు. రీడర్ అంటే క్లాసురూమ్‌లో పాఠం చదివేసే మాస్టారు అనుకుంటారేమో! అందరూ అలా ఎందుకుంటారు? అయినా విద్యార్థులు మాత్రం సరదాగా అలానే అనుకుంటూ ఉంటారు. ద్రోణాచార్యగారికి త్వరగా ప్రొఫెసర్ అవ్వాలని, ప్రొఫెసర్ ద్రోణ్ అని పిలిపించుకోవాలని కోరిక.

ద్రోణాచార్యగారికి ఇద్దరు శిష్యులున్నారు. మొదటివాడు అర్జున్ దాస్, రెండవవాడు ఏకలవ్య దాస్. అర్జున్ దాస్ ధనవంతుల బిడ్డ. అతని తండ్రికి సమాజంలో గౌరవం, ప్రభుత్వంలో పలుకుబడి ఉన్నాయి. ప్రతిరోజూ అర్జున్ దాస్ ద్రోణాచార్యగారి ఇంటికి వెళుతుంటాడు, ద్రోణాచార్య రోజూ అర్జున్ దాస్ ఇంటికి వెళుతుంటారు. అర్జున్ ఎప్పుడు చుసినా గురువుగారిని అంటిపెట్టుకుని ఉండేవాడు. వారిరువురి సాంగత్యం ఎంత గాఢంగా ఉండేది అంటే ఎవరైనా కళ్ళు మూసుకుని ద్రోణాచార్య రూపాన్ని ఊహించుకుంటే, ఆచార్యుని దేహం నుంచి ఒక తోక పుట్టుకు వచ్చి, దాని చివర అర్జున్ దాస్ ముఖం దర్శనమిస్తుంది.

ఏకలవ్య పేద విద్యార్థి. పేద విద్యార్థులపైన ఆచార్యులు ఎందుకు దృష్టి పెడతారు! అందువల్ల అర్జున్‌కి క్లాసురూం వెలుపల ద్రోణాచార్య దర్శనమే దుర్లభమయ్యేది. అతనికి మాత్రం గురువంటే అమితమైన భక్తి. గదిలో ద్రోణాచార్య చిత్రపటాన్ని పెట్టుకుని ఆరాధించేవాడు. తల క్రింద గురువుగారు చెప్పిన నోట్స్ పెట్టుకుని నిద్రించేవాడు. ఇద్దరు శిష్యులూ ఎమ్.ఏ. పరీక్ష రాయటానికి సిద్ధమౌతున్నారు.

డబ్బున్నవాళ్ళ పిల్లలకు లోకజ్ఞానం కాస్త ఎక్కువగా ఉంటుంది కదా! అర్జున్‌కి అది మరి కాస్త ఎక్కువ. చదువు, చదివితే కాదు గురుకృప వల్ల మాత్రమే ప్రాప్తిస్తుందని అతని గట్టి అభిప్రాయం. అందుకే అతను నిరంతరం గురువు గారికి యథాశక్తి సేవ చేస్తుండేవాడు. వారి ఇంటికి కావలసిన పచారి సరుకులు, కూరగాయలు, దుస్తులు క్రమం తప్పకుండా చేరవేస్తూ 'మంచివాడివిరా శిష్యా' అనిపించుకునేవాడు. పండుగలకి-పబ్బాలకి గురువుగారి ఐదుగురు పిల్లల్ని బజారుకు తీసుకెళ్ళి మిఠాయిలు, ఐస్ క్రీములు,బట్టలు, ఆటబొమ్మలు కొనిపెట్టి వాళ్ళతో 'అన్నయ్య' అని పిలిపించుకునేవాడు. గురువుగారి యోగక్షేమాలపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టేవాడు. సాయంత్రాలు గురుమాత వద్ద కూర్చొని ఇతర ఆచార్యుల భార్యలపై కళంక కథలు అల్లి చెప్పేవాడు. అలాంటి కబుర్లంటే ఎవరికి మాత్రం ఆసక్తి ఉండదు! రాత్రిపూట గురువుగారి సమక్షంలో ఇతర ఆచార్యులను తనివితీరా నిందించి ఆయన ఆత్మకి ఎనలేని ఆనందం కలిగించేవాడు. గురుభక్తి ప్రకటించటానికి ఇంతకంటే ఎవరుమాత్రం ఏమి చెయ్యగలరు!

మరోవైపున ఏకలవ్య గురు సాక్షాత్కారానికి నోచుకోక చదువుపైనే దృష్టి పెట్టి శ్రద్ధగా చదువుకోసాగాడు.

ఒకరోజు అర్జున్ దాస్ గురువు గారితో "గురువర్యా! నేను మీ ఇంటికి కావలసిన పచారి సరుకులు, కూరగాయలు క్రమం తప్పకుండా పంపిస్తున్నానా లేదా?"

"పంపిస్తున్నావు వత్సా!"

"గురుమాతకు సినిమా-సర్కస్ ఎవరు చూపిస్తున్నారు? మీ చిరంజీవులకు మిఠాయిలు, కొత్త బట్టలు, ఆటబొమ్మలు ఎవరు కొనిపెడుతున్నారు ఆచార్యా?"

"నువ్వే నాయనా"

"మీ ఎదుట మిమ్మల్ని పొగడటం, ఇతర ఆచార్యుల్ని నిందించటం నాకన్నా ఎక్కువగా ఎవరైనా చేస్తున్నారా ఆచార్యా?"

"లేరు నాయనా"

"మీ ముందు ఏ ఒక్క ఆచార్యుడినైనా నిందించకుండా వదిలేసి మిమ్మల్ని నిరాశ పరిచానేమో చెప్పండి?"

"లేదు కుమారా"

"మీరు రీడర్‌గా పదోన్నతి పొందటానికి ఎవరు సహాయ పడ్డారు గురువర్యా?"

"ఇంకెవరు, మీ తండ్రిగారే వత్సా"

"ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందటానికి, విభాగాధ్యక్షులు కావటానికి ఎవరి సహాయ-సహకారాలు మీకు అవసరమౌతాయి గురువు గారు?"

"నిశ్చయంగా మీ తండ్రిగారివే నాయనా"

"ఏకలవ్య దాస్ ఎప్పుడైనా మీకు ఏ విధమైన సేవైనా చేశాడా?"

"లేదు. అతనికి అసలు నేనంటే లక్ష్యమే లేదు. నిర్జీవ గ్రంథాలే అతనికి సర్వస్వం. ఎప్పుడూ వాటిలోనే మునిగి-తేలుతూ ఉంటాడు"

"మీకు అత్యంత ప్రియ శిష్యుడు ఎవరు?"

"ఇంకెవరు కుమారా! నువ్వే. నీవంటి శిష్యుడు నాకు ఇంతవరకు లేదు, ఇకమీదట ఉండదు"

వెంటనే అర్జున్ దాస్ నిలబడి చేతులు జోడించాడు. "అయితే నేను ఎమ్. ఏ., ఫస్ట్ క్లాస్‌లో ప్రథముడిగా రావాలి. స్కాలర్ షిప్ సంపాదించి, విదేశానికి వెళ్ళి చదువు కొనసాగించే వరమివ్వండి"

"నిజానికి నా కోరిక కూడా అదే వత్సా! కానీ, అందుకు ఏకలవ్య అవరోధమౌతాడు. అతను కుశాగ్ర బుద్ధి కలవాడు. కష్టపడి చదువుతాడు కూడా."

"అవేమీ నాకు తెలియవు గురువర్యా! మీరు ఏమి చేస్తారో నాకు తెలియదు. నేను ప్రథముడిగా వచ్చి తీరాలి. లేకపోతే గురుమహిమకు అర్థమే లేకుండా పోతుంది. ఇకపై ఏ శిష్యుడూ గురువుని సేవించడు. ఇలాంటి అధమ సంప్రదాయానికి ఆద్యులు మీరేనన్న కళంకం మీకు అంటకమానదు."

గురువుగారు ఆలోచనలోపడ్డారు. నెమ్మది నెమ్మదిగా అయన ముఖంలో నిశ్చయంతో కూడిన దృఢత్వం నెలకొంది. ఆ క్షణాన గురువుగారి తెజోదీప్త ముఖారవిందం దర్శించి అర్జున్ కృతార్థుడయ్యాడు. ఆచార్యవర్యుడు జీవిత పర్యంతం చేసుకున్న పుణ్యమంతా తేజస్సుగా మారి అయన ముఖం ప్రకాశించింది. దృఢ స్వరంతో "వత్సా! నీ మనోభీష్టము నెరవేరుగాక!" అని ప్రియ శిష్యుడిని ఆశీర్వదించారు.

మరుసటి రోజు ద్రోణాచార్య ఏకలవ్యను తనవద్దకు పిలిపించారు. "వత్సా! నువ్వు నీ గదిలో నా చిత్రపటాన్ని ఎందుకు పెట్టుకున్నావు?" అని అడిగారు.

"తమరు నాకు గురువర్యులు కాబట్టి ఆచార్యా!"

"నేను రాసిన గైడ్ రాత్రిళ్ళు తలక్రింద పెట్టుకుని ఎందుకు నిద్రిస్తున్నావు?"

"రోజంతా శకలాలు-శకలాలుగా విన్న జ్ఞానాన్నంతా మననం చేసుకుని, ప్రశ్నలు సమాధానాలుగా మనసులో నిక్షిప్తం చేసుకోవటానికి గురువర్యా!"

ఏకలవ్య వైపు పరిశీలనగా చూస్తూ "అయితే నువ్వు నాకు గురుదక్షిణ సమర్పించు కోవలసి ఉంటుంది."

"నేనేమి గురుదక్షిణ ఇచ్చుకోగలను గురువర్యా? నాకు కిరాణా దుకాణమూ లేదు, హెూజరి షాపూ లేదు. మా నాన్న తనకున్న నిజాయితీని కూడా అమ్ముకోలేకపోయాడు. పేదవాణ్ణి. తమరికి ఏమి ఇచ్చుకోగలను?"

"నేను అడగబోయేది నీ వద్ద ఉన్నదే. నీ కుడిచేతి బొటనవ్రేలు గురుదక్షిణగా సమర్పించు. అదిగో వక్కలు కోసే పట్కారు, తీసుకుని తక్షణమే కోసివ్వు."

తాను ఎప్పటినుంచో అందుకు సిద్ధంగా ఉన్నట్టుఏకలవ్య చాలా శాంతంగా ఉన్నాడు. "గురువర్యా! మీ ఆజ్ఞను పాటించి బొటనవ్రేలు నేను ఆనందంగా కోసివ్వగలను. కానీ అది మీకు ఏ రకంగా ఉపయోగపడుతుంది?"

"అది నాకు తెలుసు. నేను ఒక గొప్ప సంప్రదాయాన్ని కొనసాగించవలసి ఉంది. అర్జున్ గురుభక్తికి, వినయశీలతకు నేను ప్రసన్నుడనయ్యాను. అతనే ప్రథముడిగా వస్తాడని నేను వరమిచ్చాను. కానీ నువ్వు పరీక్ష రాయగలిగితే అర్జున్ ప్రథముడుగా రావటం అసాధ్యం. నేనతనికి ఇచ్చిన మాట నిలవాలంటే నువ్వు రాయలేనివాడివి కావాలి. అందుకే నీ కుడిచేతి బొటనవ్రేలు కోసి నాకు సమర్పించాలి."

ఏకలవ్య నవ్వాడు. "గురువర్యా! నా కుడిచేతి బొటనవ్రేలు మీకు కోసి ఇచ్చినా మీ ఉద్దేశం నెరవేరదు."

"ఎందుకని?"

"మీకెవ్వరికీ తెలియని విషయం ఒకటుంది గురువర్యా! నేను ఎడమచేత్తో కూడా కుడిచేత్తో రాసేటంత దక్షతతో రాయగలను."

"అదెలా?"

"నాకు ఊహ వచ్చి నా పేరుపై దృష్టి సారించినప్పుడే నా జీవితంలో కూడా ఎప్పుడోకప్పుడు ఎవరో ఒక గురువు ప్రవేశించి నా బొటనవ్రేలు అడుగుతాడని గ్రహించాను. అందుకే అప్పటినుంచే ఎడమచేత్తో కూడా రాయటం అభ్యాసం చేశాను. నా రెండు బొటనవ్రేళ్ళూ కోసి ఇవ్వమని కోరితే మీ లక్ష్యం నెరవేరవచ్చు. కానీ శిష్యుని రెండు బొటనవ్రేళ్ళూ కోసి ఇవ్వమనే సంప్రదాయం లేదుగా!"

ద్రోణాచార్య నిరాశ చెందారు. "ఓరీ అధముడా! నువ్వు గురుద్రోహం చేశావు. రెండు చేతులతో రాసే అభ్యాసం చేశావు. సరేలే, నా దగ్గర వేరే అస్త్రాలు కూడా ఉన్నాయి" అన్నారు.

ఆ రోజు సాయంత్రం అర్జున్ దాస్‌తో విచారంగా "శిష్యా! నేను ఏకలవ్య బొటనవ్రేలు తీసుకోలేకపోయాను. కానీ నా వద్ద తిరుగులేని ఉపాయం ఒకటుంది. దానినుంచి ఏకలవ్య తప్పించుకోలేడు. మీరు రాయబోయే పేపర్లలో ఒకటి దిద్దటానికి నాకు వస్తుంది, మరొకటి నా పరమ మిత్రుడు దేవదత్త శర్మకు వస్తుంది. ఈ రెండు పేపర్లలో నీకు నూటికి తొంభై తొమ్మిది మార్కులు వచ్చి తీరతాయి. అవిచాలు నువ్వు ఏకలవ్యను దాటుకుని వెళ్ళి ప్రథముడుగా రావటానికి. వాడి రెండు చేతులతో రాయగలిగే సామర్థ్యం, కుశాగ్రబుద్ధి నా ఎత్తుముందు ఎందుకూ కొరగాకుండా పోతాయి చూడు" అన్నారు ద్రోణాచార్య.

గురువుగారి మాట విని అర్జున్ స్థిమిత పడ్డాడు. గురువుగారి సామర్థ్యంపై అతనికి అపారమైన విశ్వాసం. రాజనీతిశాస్త్ర విభాగంలో సర్వంసహాధికారి అయనే. అయన ఆమోదం లేకుండా అక్కడ ఆకు కూడా కదలదు. సంతోషంతో నిశ్చింతగా ఇంటికి వెళ్ళాడు అర్జున్.

అర్జున్ దాస్, ఏకలవ్య దాస్ యథాశక్తి పరీక్షలు రాశారు. ఏకలవ్య మనసులో పరీక్షా ఫలితాల పట్ల అనుమానం నెలకొనే ఉంది. గురు ఆశీర్వాదం ఉన్న శిష్యునికి చింత ఏముంటుంది? అభయహస్తం అందుకున్న అర్జున్ ఎటువంటి దిగులు లేకుండా ధైర్యంగా ఉన్నాడు. అతనికి గురుకృప ఉండనే ఉంది. తన మనోభీష్టం నేరవేరటానికి దానికి మించినదేముంది?

రేపు ఫలితాలు ప్రకటిస్తారు అనగా ఆ రోజు సాయంత్రం అర్జున్ దాస్ ఉత్సాహంగా గురువుగారి ఇంటికి వెళ్ళాడు. ద్రోణాచార్య సర్వం కోల్పోయినవానిలా దిగాలుగా కూర్చొని ఉండటం చూసి అర్జున్ నీరుగారిపోయాడు. అతని మనసు కీడు శంకించింది. ధైర్యం సన్నగిల్లింది. గురువుగారిని అంత విచారంగా ఉండగా గతంలో ఎన్నడూ చూడలేదు. సందేహాస్పదంగా ఆచార్యుని ముఖాన్ని పరికించసాగాడు.

శిష్యుడిని చూసి ద్రోణాచార్య "నేను అధముణ్ణి వత్సా! నీకు ఇచ్చిన మాట నిలబెట్టు కోలేక పోయాను. ఇకపై ఏ శిష్యుడు గురువుని

సేవించటానికి ముందుకు రాడు. రాబోయే గురువుల తరం నన్ను వేనోళ్ళ నిందిస్తుంది" అని దుఃఖించారు.

"అసలు ఏమి జరిగింది గురువర్యా?" ఆత్రుతగా అడిగాడు అర్జున్.

"మీ పేపర్లు దిద్దటానికి నాకూ ఇవ్వలేదు, దేవదత్తకూ ఇవ్వలేదు. వైస్‌ఛాన్సలరే స్వయంగా ఎవరో అజ్ఞాత వ్యక్తికి ఇచ్చి దిద్దించారు" చెప్పి నిట్టూర్పు విడిచారు ద్రోణాచార్య.

"అదెలా జరిగింది గురువర్యా? మీకు తెలియకుండా విభాగంలో ఏ నిర్ణయమూ జరగదు కదా! పేపర్లు ఎవరు దిద్దాలని నిర్ణయించేది మీరే కదా!" అడిగాడు అర్జున్.

"అది నిజమే. కానీ ఏకలవ్య దాస్ నాపై వైస్ చాన్సలర్‌కి ఫిర్యాదు చేశాడట. అయనే స్వయంగా కలగజేసుకుని ఇలా చేశారు" అన్నారు ద్రోణాచార్య.

గురు శిష్యులిద్దరూ చాలా సేపు ముఖం వేలాడేసుకుని కూర్చునిపోయారు.

అర్జున్ "గురువర్యా! ప్రాచీనకాలంలో కూడా ఒక ఏకలవ్య ఉన్నాడట కదా?" అడిగాడు.

"అవును వత్సా! కానీ అతనికి-ఇతనికి, నేలకి-నింగికి ఉన్నంత తేడా ఉంది. అది పుణ్యయుగం, ఇది పాపయుగం. ఆ ఏకలవ్య ఎదురుప్రశ్న వెయ్యకుండా గురువుకు తన బొటనవ్రేలు కోసి సమర్పించాడు. ఈ ఏకలవ్య గురువుకు మొండి చెయ్యి చూపించాడు" అని వాపోయారు ద్రోణాచార్య.

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

పతాకాలన్నీ పక్షులై
ఆవరణంతా రెపరెపలాడుతుండగా
ఎవరి దేశభక్తి ఎంతో
గుండెలమీద చెయ్యేసుకోకుండానే
కీర్తించగలిగేదీ ఇప్పుడే
ఎదుటివాడి మతోన్మాదాన్నో
పక్కవాడి కులగజ్జినో
సాధ్యమైనంతగా గోకి ఫొటోలు తీసి
జూమ్ చేసి చూపేది ఇప్పుడే
తిన్నింటి వాసాల్తో సహా
లెక్కలన్నీ తేల్చేసుకునేదీ ఇప్పుడు కాక మరెప్పుడు?

వరుస సభలూ సమావేశాల్తో
జయధ్వానాలు పిట్టల్లా ఎగురుతూ
మైదానాలన్ని తిరునాళ్ళైపోతున్నాయ్
రహదార్లు సైతం వేదికలౌతున్నాయ్
చౌరస్తాలు జాతర్ల కూడళ్ళౌతున్నాయ్
పనుల మీద రోడ్డెక్కిన వారికే గానీ
రణోత్సాహంలో ఊగిపోతున్న వారికేం ఇబ్బంది?
అత్యవసర ప్రాణాపాయంలో ఉన్నవారికి
ప్రాణసంకటం గానీ
ఉత్సవవిగ్రహాలకి చెలగాటమేకదా
ఓటర్ల మనసులో మెదిలే విచికిత్స
చిన్నదైతే కావచ్చు
కరివేపాకులా విసిరేసేదైతే కాదు
రాజకీయ చదరంగంలో చెక్ పెట్టేది
ఎప్పుడైనా చివరికి ఓటర్లే

అందుకే మరి
రోజురోజుకీ కుంగికృశించిపోతున్న తల్లికి
నరాల్లోని పాతరక్తాన్ని తోడి పారేసి
దేశభక్తి డయాలసిస్ తో
స్వచ్ఛమైన కొత్తరక్తాన్ని నింపుతామనో
చర్మంపై తేలిన నరాలనదుల్ని అనుసంధానం చేసి
పచ్చని వృక్షచర్మంతో ప్లాస్టిక్ సర్జరీ చేసి
నవయవ్వనవతిగా తీర్చుతామనో
ఎండి నెర్రెలు విచ్చిన పొట్టకు
పంచభక్ష్య పరమాన్నాలందిస్తామనో
పంచప్రణాళికల విత్తనాల్ని
హారాలుగా వేసుకు తిరుగుతూ
ధూపంలా ఎగిరే జనం స్వప్నాల్ని
ఆశీర్వాదాలుగా మార్చుకుంటూ
కరుణార్ద్ర హృదయులై
అపర ప్రేమ స్వరూపులై
వీథివీథినా వాడవాడలా పావనం చేస్తూ
ఎదురుచూడని స్వాముల దర్శనభాగ్యానికి
పులకితులైన జనాన్ని
చిరునవ్వుల చిద్విలాసాలతో
నమస్కారాల చిరునవ్వులతో
కరస్పర్శల చక్కిలిగింతలతో
శిరశ్చుంబన ఆశీర్వచనాలతో
మరింతగా మోహపరవశుల్ని చేస్తూ
రోజురోజుకూ బలుపు పెంచుకుంటూ
ఊరూవాడా బాటా పేటా
పాదయాత్రలే పాదయాత్రలు!!!

(ఇంకావుంది)



కాజీ నజ్రుల్ ఇస్లాం

( 1899 - 1976 )



15

# ధూమకేతు

## బెంగాలీ విప్లవ కవితా కలాం
## కామ్రేడ్ కాజీ నజ్రుల్ ఇస్లాం
## సామ్రాజ్యవాదంపై పెన్ను ఎత్తిన
## 'విద్రోహి' కవికి లాల్ సలాం

**'నేనే భూగోళంలో మండుతున్న అగ్నిపర్వతం! నేనే అడవుల్లో నిప్పు. నేనే నరకంయొక్క భయంకరమైన క్రోధసముద్రాన్ని-నేను ఆనందం మరియు గాఢతతో మెరుపు రెక్కలమీద స్వారీ చేస్తున్నాను.నేను మన చుట్టూ కష్టాలను,భయాన్ని అక్షరీకరిస్తున్నాను. నేను ఈ ప్రపంచంపై భూకంపాలను తెస్తాను. నేను ఈ ప్రపంచాన్ని దాటి నా తలపైకెత్తు తాను,ఎప్పుడూ నిటారుగా నిక్కచ్చిగా!' - అంటూ సకల అణచివేతలపై భగ్గుమంటూ తిరుగుబాటు విప్లవ కవితాగ్ని ధారలు కురిపించిన కాజీ నజ్రుల్ ఇస్లాం-బెంగాలీ కవి, గాయకుడు, నటుడు, సంగీతకారుడు,సైనికుడు.**

భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో 'విద్రోహి'(రెబల్) కవిగా ప్రసిద్ధుడు. కమ్యూనిస్టు కవి అనేవారు.అత్యంత వర్గపోరాట విప్లవస్ఫూర్తితో రాసిన 'విద్రోహి' పెద్దగేయం 'అగ్నివీణ' (1922)లో అచ్చయి ప్రసిద్ధిపొందింది. గజల్‌ను,రుబాయిలను తొలిసారి బెంగాలీలో ప్రవేశ పెట్టారు. సంగీతంలో కూడా సుస్థిర స్థానాన్ని సంపాందించారు. హెచ్.ఎం.వి.రికార్డింగ్ కంపెనీ, సంగీత విద్వాంసునిగా నియమించుకుంది. 1924లో కాజీనజ్రుల్ ప్రమీలాదేవి అనే హిందూ మహిళను వివాహమాడారు. వారు తమ పిల్లలకు కృష్ణ మహమ్మద్ వంటి ఉభయ మతాల పేర్లు కలిసేటట్లు పెట్టారు. ఆయన రాసిన వేశ్య గురించిన కవితలో వారిని తల్లిగా సంబోధించాడు.

నజ్రుల్ 'చంద్ర బిందు' పుస్తకం బ్రిటిష్ ప్రభుత్వం నిషేధానికి గురైంది. 'ఆ రోజుల్లో నన్ను బాగా ఇన్‌ఫ్లూయన్స్ చేసిన వాళ్లలో ఒకడు నజ్రుల్ ఇస్లాం' అని శ్రీశ్రీ కూడా స్వయంగా చెప్పుకున్నారు. 'నజ్రుల్ మార్చింగ్ సాంగ్స్ మన స్వాతంత్ర్య పోరాట సైన్యాలను యుద్ధరంగం లోనికి మహోద్వేగంతో నడిపిస్తాయి' అన్నారు సుభాష్‌చంద్రబోస్. 'విద్రోహి' గీతం సాహిత్య విద్యుత్తుకీ, చైతన్య విద్యుత్తుకీ మంత్రముగ్ధులైన రవీంద్రనాథ్ టాగూర్ తన కావ్యం 'గీతి-నాట్య' నజ్రుల్‌కి అంకిత మిచ్చారు.'జైలు ఇంటి ఇనుపగేటును విరగగొట్టండి' అంటూ నజ్రుల్ 'ప్రళయగీతం' లక్షలాది ప్రజలనోళ్లలో మారుమోగిన స్వాతంత్ర పోరాటవిప్లవగీతం.ప్రజా విప్లవ వాణిగా 'ధూమకేతు'పత్రికను సామ్రాజ్యవాదంపై ఎక్కుపెట్టారు.ఇంటర్నేషనల్ గీతాన్ని బెంగాలీ లోకి అనువదించారు 'నేను ఆకలితో ఉన్నాను' అన్న నజ్రుల్ సంపాదకీయం ఒక సంచలనం.

అరెస్టయి పదకొండు నెలలు జైలుశిక్ష అనుభవించిన తర్వాత ఆయన అనారోగ్యం పాలయ్యారు. కలకత్తా రేడియో కేంద్రంలో (9-7-1942) మాట్లాడుతుండగా గొంతు మూగబోయింది. మతిచలించింది. ఎన్ని చికిత్సలు చేయించినా కోలుకోలేదు. ఆ తరువాత మరి సాహిత్య సృజన వీలుకాలేదు.

కలకత్తా యూనివర్సిటీ వారి జగత్తరిణి గోల్డుమెడల్ పొందారు. బెంగాల్ ప్రభుత్వం జాతీయ కవిగా గుర్తించింది. పద్మభూషణ్ (1960), ఎకుషేపధక్ పురస్కారం (1976), స్వాతంత్ర్య దినోత్సవఅవార్డు (1977) అందుకున్నారు. నజ్రుల్ అక్షరాలు బంగ్లాదేశ్ మిలటరీ పాటగా కదం తొక్కుతున్నాయి.

'నాకు స్త్రీ, పురుషుల మధ్య తేడా కనిపించడంలేదు. ఈ ప్రపంచంలో ఏ గొప్ప లేదా, మంచి విజయాలు సాధించినా అందులో సగం స్త్రీ, మిగిలిన సగం పురుషుడు' అనిచెప్పే నజ్రుల్, బెంగాల్ ప్రెసిడెన్సీ బర్ద్వాన్ జిల్లాలో 1899 మే 24న జన్మించారు. కలకత్తాలో 1976 ఆగస్టు 29న కన్ను మూశారు.

సింగంపల్లి
అశోక్‌కుమార్

క
ర
ప
త్రం

# శ్రీ లక్ష్మీ మహాయజ్ఞాన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధం

*మిత్రులారా!*

14-11-2015న విజయవాడలోని పదహారు ప్రజాసంస్థలు కలిసి అప్పటి ప్రభుత్వ లౌకికవాద ఉల్లంఘనలపై తమ విమర్శను "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ" రూపంలో విడుదల చేశాయి. అయితే, దాదాపు అన్ని ప్రభుత్వాలు ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నాయి. నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్న ఈ ఉల్లంఘనలకు తాజా ఉదాహరణ, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 12 నుండి 17, 2023 వరకు విజయవాడలో అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం, ఈ సందర్భంగా జరుపుతున్న వివిధ దేవుళ్ళ కళ్యాణాలు. ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి కోసం, ప్రజలందరూ శాంతి, సౌభాగ్యాలతో సంతోషంగా జీవించడం కోసం ఈ యజ్ఞం ఉద్దేశించబడినట్లు ప్రభుత్వం చెబుతోంది. మంత్రాలకు చింతకాయలు రాలవనీ, అభ్యున్నతికి, అభివృద్ధికి మూలం మానవ కృషి, ప్రయత్నం మాత్రమే కాని, ఏ దేవత లేక ఏ దేవుడూ కాదని మన పాలకులకి, అధికారులకి తెలియచెప్పాల్సి రావడం దురదృష్టకరం. రాష్ట్రంలో అభివృద్ధిని, శాంతి, సౌభాగ్యాలను సాధించడంలో ప్రభుత్వపు విధానపరమైన, వాస్తవమైన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి ఈ యజ్ఞం ఉద్దేశించ బడిందని మేము భావిస్తున్నాం. పైగా పూర్తిగా హిందూ మత సంప్రదాయబద్ధమైన ఈ యజ్ఞాన్ని జరపడం భారత రాజ్యాంగ లౌకికవాద స్ఫూర్తికి తూట్లు పొడవడమే అవుతుంది. లౌకికవాదం రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలలో ఒకటని సుప్రీంకోర్టు విస్పష్టంగా ప్రకటించింది.

రాజ్యం నుండి మతాన్ని వేరు చేయడం లౌకికవాద సారాంశం. అంటే రాజ్యం తన కార్యకలాపాలలో ఏ మతం పట్ల మొగ్గు చూపక పోవడం మాత్రమే కాదు. రాజ్యం పూర్తిగా మతరహితం కావడమే లౌకికవాదపు సిసలైన అర్థం. ప్రజలు వారి వారి మతాలను నిరాటంకంగా ఆచరించేందుకు అవకాశం కల్పించడం మాత్రమే రాజ్యం, ప్రభుత్వం బాధ్యత. ఇది సాధ్యం కావాలంటే, మత సామరస్యాన్ని కాపాడడాన్ని రాజ్యం తన అతి ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటిగా పరిగణించి, నెరవేర్చాలి. ఈ బాధ్యతని, ఈ కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చాలంటే రాజ్యం ఏ మతాన్ని అనుసరించరాదు, ప్రోత్సహించరాదు. మతాన్ని పూర్తిగా పౌరుల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశంగా పరిగణించాలి. అన్ని మతాలను సమానంగా పరిగణించాలి. అంటే అత్యంత సంఖ్యాధిక్యత కలిగిన మతం, అత్యంత స్వల్పసంఖ్యాకమైన మతం రెండూ రాజ్యం దృష్టిలో సమాన విలువ కలిగివుండాలి. ఈ సమ దృష్టిని నిజంగా నెరవేర్చాలంటే రాజ్యం అన్ని మతాల నుండి సమాన దూరాన్ని పాటించాలి. తన అధికార విధి నిర్వహణలో, కార్యక్రమాలలో ఏ మత ఛాయలు లేకుండా చూడాలి. రాజ్యం మతరహితం కావడమంటే ఇదే.

ఈ లౌకికవాద స్ఫూర్తిని దృష్టిలో వుంచుకుంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం ఎంత లౌకికవాద ఉల్లంఘనో మనకి అర్థమవుతుంది. ముఖ్యమంత్రి, అధికారులు, న్యాయమూర్తులు అధికార హోదాలో వివిధ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక దర్శనం పొందడం, వివిధ మత ఉత్సవాలలో అధికారిక హోదాలో పాల్గొనడం నిరంతరం జరుగుతున్న లౌకికవాద ఉల్లంఘనలలో ముఖ్యమైనవి. ఏదైనా మతాన్ని లేక మతాల్ని ప్రోత్సహించడానికి రాజ్యం, ప్రభుత్వం పాల్పడితే దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. మతాల మధ్య పరస్పర సంబంధాలు క్షీణించి, మత ఛాందసత, మౌలికవాదం బలోపేతం అయ్యే ప్రమాదం ఇనుమడిస్తుంది.

రాజ్యాంగంలోని అధికరణం - 25 (2) (ఎ) ప్రకారం, మతాచరణకు సంబంధించిన ఆర్థిక, ద్రవ్యసంబంధ, రాజకీయ లేక ఇతర లౌకిక కార్యకలాపాలకు మాత్రమే ప్రభుత్వ పర్యవేక్షణ పరిమితం కావాలి. అయితే, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా హిందూ / వైదిక మత దేవాలయాల్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం ఈ రాజ్యాంగ పరిమితుల్ని అతిక్రమించడంగా పరిణమించింది. మతేతర కార్యకలాపాలకు పరిమితం కావలసిన పాలకులు, అధికారులు పెద్ద ఎత్తున మత, ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడం నిత్యకృత్యంగా మారింది. శ్రీ లక్ష్మీ మహాయజ్ఞాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం కూడా ఇటువంటి రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. ఇదొక సాదాసీదా విషయంగా పాలకులు, ప్రజలలో అత్యధికులు పరిగణిస్తున్న విచిత్ర పరిస్థితిలో నేడు మనమున్నాం. రాజ్యాంగబద్ధ పదవులలో ఉన్నవారు ఇలా ఒక మతాన్ని ప్రోత్సహించడం అనుచితం. రాజ్యాంగ మతాతీత లౌకికస్ఫూర్తికి విరుద్ధం. ఈ విషయం తెలిసి కూడా రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించేవారు రాజ్యాంగపరమైన ఉన్నత పదవులు అధిష్టించడం భారత ప్రజాస్వామ్య దౌర్భాగ్యం.

శ్రీ లక్ష్మీ మహాయజ్ఞాన్ని, ఈ సందర్భంగా వేర్వేరు దేవుళ్ళ కళ్యాణాలను అధికారికంగా నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాల్పడిన లౌకికవాద, రాజ్యాంగ ఉల్లంఘనను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇకపై ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఇటువంటి డొంకతిరుగుడు పద్ధతులు ఎటువంటి సానుకూల ఫలితాలను ఇవ్వవని, రాష్ట్ర అభివృద్ధిని నిజంగా

కాంక్షిస్తే అందుకు సరైన, వివేచనాయుతమైన, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక, పాలనా విధానాలను రూపొందించి, విస్తృత ప్రజా భాగస్వామ్యంతో వాటిని నెరవేర్చడం ఒక్కటే మార్గమని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాం.

ఇకపై మౌలిక లౌకికవాద సూత్రాలను రాజ్యం, ప్రభుత్వం, అధికారవర్గం ఉల్లంఘించడానికి అవకాశం లేకుండా చేసేందుకు గాను ఒక సమగ్ర మార్గదర్శక నియమావళిని రూపొందించుకుని, అమలు చేయాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉంది. ఈ దిశగా కృషి చేయాల్సిందిగా పౌర సమాజంలోని ప్రగతిశీల క్రియాశీల శక్తులకి విజ్ఞప్తి చేస్తున్నాం.

| | | |
|---|---|---|
| **అరుణ**<br>ప్రధాన కార్యదర్శి<br>**జనసాహితి** | **జి. నారాయణ**<br>కార్యదర్శి<br>**జాషువా సాంస్కృతిక వేదిక సభ్యులు - సంగమం** | **బి. జమీందార్**<br>ప్రధాన కార్యదర్శి<br>**ప్రోగ్రెసివ్ ఫోరం** |
| **పి. మురళీకృష్ణ**<br>కార్యదర్శి<br>**యం.బి. విజ్ఞాన కేంద్రం** | **అరసవల్లి కృష్ణ**<br>అధ్యక్షులు<br>**విప్లవ రచయితల సంఘం** | **ఎన్. అంజయ్య**<br>కార్యదర్శి<br>**సోషల్ సైన్సెస్ ట్రస్ట్** |

# మహిళా హక్కుల ఉద్యమకారిణి ఆహ్లెం బెల్‌హాడ్జ్ మరణం

**టునీసియాకు** చెందిన మానసిక వైద్యురాలు, మహిళా హక్కులకై పోరాటాలు చేసిన ఆహ్లెం బెల్‌హాడ్జ్ (Ahlom Belhadj) తన 59వ యేట 11-3-2023న మరణించారు. ఆమె 1964లో జన్మించారు.

ఆమె బాల్యం కోర్బాలో గడిపారు. తండ్రి ఉపాధ్యాయుడు. ఆయన 20 ఏళ్ళపాటు కోర్బా నగరానికి మేయర్‌గా వున్నారు. విద్యార్థి దశలో ఆహ్లెం ఆటల్లో ప్రావీణ్యం చూపేవారు. లాంగ్ జంప్‌లో జాతీయ టీమ్‌లో పాల్గొన్నారు.

టునిస్‌లో వైద్య విద్యనభ్యసించిన ఆమె పిల్లల మానసిక వైద్యులుగా పనిచేశారు. అదే సమయంలో దేశంలో మహిళల హక్కుల కోసం క్రియాశీలంగా పనిచేశారు. పిల్లలకు, స్త్రీలకు పాస్‌పోర్ట్ కావాలంటే, వారి భర్త లేక తండ్రి అనుమతి తప్పనిసరి అనే నియమానికి వ్యతిరేకంగా విజయవంతంగా పోరాడారు. టునీసియా ప్రజాస్వామిక మహిళా సంస్థకు అధ్యక్షురాలిగా, డైరెక్టర్‌గా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించారు.

1982-87 సంవత్సరాలలో వైద్య విద్యార్థినిగా యూనివర్శిటీలో ఫెమినిస్టు గ్రూపు స్థాపించారు. 1984లో మహిళా చైతన్య కమిటీని ఏర్పరచారు. 1985లో రెవల్యూషనరీ కమ్యూనిస్టు ఆర్గనైజేషన్‌లో చేరారు. హబీబ్ బోర్గిబా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పనిచేసిన టునీసియా విద్యార్థి యూనియన్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు.

2011 నాటి జాస్మిన్ విప్లవ కాలంలో ఆనాటి అధ్యక్షుడు జీన్ ఎల్ అబ్దీన్ బెన్ ఆలీకి వ్యతిరేకంగా వేలాది మహిళలతో ప్రదర్శన జరిపారు. ఆలీ పాలన అంతమైన తర్వాత ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయి. కొత్త ప్రభుత్వం చేత గృహ హింసకు వ్యతిరేకంగా చట్టాలు చేయించారు.

ఆమె మార్క్సిస్టు విప్లవ గ్రూపు చెందిన లాయరు బ్రిక్ జోఘ్లామిని 1993లో వివాహం చేసుకున్నారు. ఆయనపై వున్న అరెస్టు వారంటు వలన, ఆయన ఫ్రాన్స్‌లో కొన్నాళ్ళు వుండి, ఆ తర్వాత 8 నెలల జైలుశిక్ష అనుభవించారు.

'అరబ్ వసంతపు టునీసియా హీరోయిన్'గా పిలువబడిన ఆమె సైమన్ డిబువా బహుమతినందుకొన్నారు.

# సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట యోధుడు క్రిస్ చే మత్లహాకో మరణం

**దక్షిణాఫ్రికాలో** జాతి వివక్షా విధానానికి వ్యతిరేకంగా పోరాడిన క్రిస్ చే మత్లహాకో (Chris che Matlhako) తన 58వ యేట 20-4-2023న మరణించారు. ఆయన కింబర్లే అనే చిన్న పట్టణంలో 21-10-1965లో జన్మించారు.

కింబర్లేలో హైస్కూలు విద్యార్థిగా పలు నిరసన ప్రదర్శనలలో ఆయన పాల్గొన్నారు. ఫిబ్రవరి 1980 నుండి జులై 1980 వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన హైస్కూలు విద్యార్థుల పాఠశాలల బహిష్కరణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. నల్లజాతివారికి, శ్వేత జాతీయులకు విద్యలో సమాన అవకాశాలకై ఆ బహిష్కరణ జరిగింది. ఈ ఉద్యమంలో పోలీసు కాల్పులలో 30 మంది పైగా విద్యార్థులు మరణించారు. చే స్కూలు విద్యార్థిగా అనేక సందర్భాలలో నిర్బంధాన్ని చవిచూశారు.

నిషిద్ధ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌లో ఆయన 1989లో చేరారు. ఈ సంస్థ సభ్యునిగా పెద్దఎత్తున ప్రజాస్వామిక ఉద్యమాన్ని రూపొందించారు. యూనివర్శిటీ విద్యార్థిగా 'స్టూడెంట్ వాయిస్' (విద్యార్థి గళం) అనే వార్తాపత్రికను నడిపారు. సామాజిక న్యాయం కొరకు, అలమటిస్తున్న అట్టడుగువారి సంక్షేమం కొరకు జీవితాంతం కృషి చేశారు.

ఆయన చనిపోయేనాటికి దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో పూర్తికాలం కేంద్రకమిటీ సభ్యునిగా వున్నారు. దక్షిణాఫ్రికా మిత్రుల సాంస్కృతిక సంస్థకు చనిపోయేవరకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నాటో కూటమిని తీవ్రంగా వ్యతిరేకించారు. చైనాపై జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఖండించారు. పాలస్తీనా, క్యూబా, వెనిజులా, ఇరాన్ మొదలైన దేశాలపై సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. 'థింకింగ్ చే' శీర్షికతో పత్రికలలో వచ్చిన ఆయన వ్యాసాలు 2019లో పుస్తక రూపంలో వెలువడ్డాయి.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి ఆయన అకాల మరణం ఎంతో నష్టమని పలువురు నివాళులు తెలియచేస్తూ ప్రకటించారు.

గల్పిక

# రథయాత్ర

- శంకరం

**రథయాత్ర** మొదలు కాబోతుంది. మాడవీధులన్నీ పెళ్ళి గృహాల్లా మెరిసిపోతూ హడావిడిగా, కోలాహలంగా ఉన్నాయి. రథంలో జగన్నాధుడు కొలువుతీరి వున్నాడు. జరుగుతున్న తంతునంతటినీ చిద్విలాసంగా ఓరకంట గమనిస్తున్నాడు. రథంపై తనతోపాటు తనకూ, భక్తులకూ మధ్యనుండే సంధానకర్త (అంబికా దర్బారు అగరొత్తులు)లను ఆదరణతో, ఆప్యాయంగా చూస్తున్నాడు. వాళ్ళు దేవరవారితో పాటు తమకు కూడా ఇంచుమించుగా గౌరవం, హోదాలతో పాటు చిల్లర కూడా దక్కుతున్నందుకు పరమానందంగా వున్నారు. క్రింద రధాన్ని లాగడానికి రైతులు, కులవృత్తులు చేసేవారు, కార్మికులు, బీదలు, బడుగులు రూపంలో రకరకాల గొర్రెలు సిద్ధంగా వున్నాయి.

రథయాత్రకు ముందస్తు ఏర్పాటుగా రహదారికి ఇరువైపులా ఉన్న మహా వృక్షాలను కూకటివేళ్ళతో పెళ్ళగించి ఊడ్చిపారేసారు. అడ్డంగా వచ్చే పంటకాలువలన్నిటినీ కప్పేసారు. యాత్ర సాగబోయే వీధులలోని అంగళ్ళనన్నిటినీ ముందురోజు నుండే మూసేయించారు. మాడవీధుల గుండా పాద, వాహనచారులు ఎవ్వరూ సంచరించకుండా కట్టుదిట్టం చేసారు. చదువుల తల్లి ఒడిలో ఎదగాల్సిన పిల్లగొర్రెలను దేవరవారు విహరించే రహదారికి ఇరువైపులా స్వాగత తోరణాల్లా ఎర్రని ఎండల్లో నిలబెట్టారు.

“జగన్నాథా!.... మొండి జగన్నాథా!.... దుష్టరక్షకా.... జయహో!” అంటూ దిక్కులు పిక్కటిల్లేలా, పసిగొర్రెలు జడుసుకునేలా గొర్రెల జయజయధ్వానాలు మిన్నుముడుతుండగా దేవరవారు గొర్రెల సవారీ చేస్తూ ముందుకు కదిలారు. “రాజు వెడలె రవితేజములలరగ.. కుడి ఎడమల డాల్ కత్తులు మెరియగ” అంటూ వందిమాగధులు కీర్తిస్తుంటే, “ధీరా.. ధీరా.. మగధీరా.... మొండిధీరా....” అంటూ అనుచరగణం ముక్తకంఠంతో ఘోషిస్తుంటే (దేవరవారు చేతులు లేకపోయినా) జబ్బలు చరుచుకుంటూ పరవశించిపోతున్నారు.

ఇక రథయాత్ర ఎలా సాగుతుందయ్యా అంటే, దేవరవారు కరుణామయుని వలె లేచివుళ్ళను, గడ్డిపరకలను విసురుతుంటే రథాన్ని లాగుతున్న గొర్రెలు వాటికై ఎగబడుతున్నాయి. కొన్ని వాటిని అందుకోలేక తలలు పగలకొట్టుకుంటున్నాయి. వాటి వెచ్చని రక్తం దేవర వారికి తర్పణం చేయబడుతోంది. ఇదే సమయంలో దేవరవారి అండదండలతో వ్యాపారాలు చేసే గొర్రెలన్నీ ధరల రాకెట్లను నింగిలోకి వదులుతున్నాయి. అవి పైకెగసి వెలుగు నిప్పులను విరజిమ్ముతుంటే బడుగు గొర్రెలన్నీ ఆకలి కేకలు పెడుతున్నాయి. ఆ ఆక్రందనలను, వెలుగు నిప్పులను దేవరవారు ఆస్వాదిస్తూ ముందుకు సాగుతున్నారు.

చిన్న కొండ పరిమాణంలో రథం ముందుకు సాగుతుంటే దాని కింద భూమి పెళ్ళలు పెళ్ళలుగా విచ్చుకుపోతున్నది. దాని కింద నలిగి ఎన్నో బడుగు జీవులు మోక్షాన్ని పొందుతున్నాయి. రథం కదులుతున్న వేగానికి విద్య, వైద్యం వంటివి పక్కకు నెట్టివేయబడితే ప్రైవేటు గొర్రెలు, కార్పొరేటు బర్రెలు వాటిని అక్కున చేర్చుకొని, పెంచి పెద్దచేసి ఇబ్బడి ముబ్బడిగా లాభాలను దండుకుంటున్నాయి. అదే రీతిన సేద్యాన్ని కూడా పక్కకు నెట్టేస్తే కార్పొరేటు బర్రెలు దానిని చేరదీసి కన్నబిడ్డలా సాకి దాని పొదుగు నుండి సంపదను పిండుకుంటూ తమ ర్యాంకులను పెంచుకుంటున్నాయి.

కాస్త కిందకు వంగి చూస్తే రథం నీడన వెర్రి గొర్రెలపై ఇంతకు ముందెన్నడూ చూడనంత హింస వెచ్చగా సాగిపోతూ వుంది. అంతేనా? ఎన్ని కబ్జాలు, ఎన్ని ఆక్రమణలు (కొండలు, నదీ గర్భాలు, శ్మశానాలతో సహా) నిరాటంకంగా, నిరంతరాయంగా సాగిపోతున్నాయి. ఆ చీకటిలో ఎన్ని నల్లచట్టాలు చేయబడుతున్నాయో, ఎన్ని అక్రమ కేసులు బనాయించబడుతున్నాయో, ఎన్ని గొర్రెలు నిర్బంధాలకు గురయ్యాయో, ఎన్ని సేద్యపు గొర్రెలు ఉసురు తీసుకున్నాయో, ఎన్ని నిరుద్యోగ గొర్రెలు గబ్బిలాల్లా తలకిందులుగా వేలాడుతున్నాయో, ఆ చీకటికి భయపడి దారీ తెన్నూ తెలియక ఎన్ని పరిశ్రమలు వెనుదిరిగి పోయాయో?!

దేవరవారు, వారి మేధోవర్గం (సలహాదార్లు) కలిసి తీసుకుంటున్న అవకతవక నిర్ణయాలకు దేవరవారి చిత్తం ప్రకారం నడుస్తున్న విద్యాలయాల్లో నాలుగచ్చరం ముక్కలు నేర్చుకుందామని బుడిబుడి అడుగులతో అమాయకంగా అడుగు పెడుతున్న గొర్రె పిల్లలకు గాడిద భాషలో విద్యాభ్యాసం జరుగుతుంటే అవి వెర్రి మొహాలు వేసుకొని, తమ భాషనూ కూడా మరిచిపోయి మందభాగ్యులుగా తయారవుతున్నాయి. దేవరవారి తప్పుడు నిర్ణయాల కారణంగా వారితోపాటు ఎంతో పాండిత్యం కల్గిన పై స్థాయి గొర్రెలు సైతం న్యాయమూర్తులైన గొర్రెలచే చీవాట్లు, ఛీత్కారాలు, చిన్నచిన్న జైలుశిక్షలు కూడా పొందుతూ తరిస్తున్నాయి. మానవమాత్రుడు కాడు గనుక అటువంటి రాళ్ళ వాసనైనా, వడగండ్లు (పేదల కడగండ్లు) పడినా దున్నపోతుపై వర్షం కురిసిన చందాన లెక్కచేయడు.

రథయాత్ర సాగుతూనే వుంది. రథచక్రాల కింద నలిగి రహదారులన్నీ రాబందులు పీక్కుతిని వదిలేసిన శవాల మాదిరిగా తయారయ్యాయి. వాటిపై సంచరించలేక సంచరిస్తున్న గొర్రెలు, ఇతర పశువులు, వాహనాలు అష్టావక్రుని వలె మారిపోతున్నాయి. దేవరవారు గానీ వారి అనుచరగణం గానీ విలాసవంతమైన రథాల్లో పయనించడం

వలన సామాన్య గొర్రెలు పడే అగచాట్లు వారి అనుభవంలోకి రావు. వీటన్నిటినీ దేవరవారు చిద్విలాసంగా గమనిస్తూనే ఉంటారు. గొర్రెల ఆర్తనాదాలు వింటూనే ఉంటారు.

దేవరవారిని రథారోహణ చేయించేముందు గొర్రెల మందలన్నీ ఎంతో ఆశగా తమకు అవసరమైన కూడు, గూడు, తమ భద్రత స్వామివారు చూసుకుంటారని ఆశించాయి. రథారోహణ చేసేముందు దేవరవారు గొర్రెల మందల మధ్య కరుణామయుని వలె కలియదిరిగి "మీ బాధలన్నీ నేను విన్నాను.. మీకు నేనున్నాను" అంటూ అభయమిచ్చాడు. రథం ఎక్కిన తర్వాత తొక్కడం ప్రారంభించారు. ప్రచండమైన రథ వేగానికి రాజ్యంలోని ప్రకృతి వనరులన్నీ పచ్చనోట్లుగా మారి ఏలినవారి మరియు వారి వందిమాగధుల బొక్కసాలలో బంధింపబడుతున్నాయి. ఇవన్నీ చాలక దేవరవారు రుణరంగ మార్తాండులై దొరికిన చోటల్లా రుణాలు చేస్తూ, రుణం పుట్టనిదే రోజు గడవని రాజ్యంగా పేరు ప్రఖ్యాతులు పొందారు.

అయితే వెర్రిగొర్రెలకు కూడా ఒకరోజు వస్తుందని దేవరవారు గ్రహించలేకపోయారు. పలు విధాల నలిగి చావగా మిగిలిన గొర్రెలలో కలకలం బయలుదేరింది. రానురాను వాటి సంఖ్య తగ్గిపోతున్నదని అవి గ్రహించాయి. వాటిలో ఒక అనుభవంతో పండిపోయిన ఒక వృద్ధ గొర్రె చిత్రగ్రీవుని కథను మిగిలిన గొర్రెలకు వినిపించింది. 'బలవంతమైన సర్పం' ఏమయ్యిందో వివరించింది. అంతే! రథాన్ని లాగుతున్న బక్కచిక్కిన గొర్రెలు ఏదో శక్తి ఆవహించినవాటికిమల్లే ఒక్క ఉదుటున రథాన్ని అమిత వేగంతో ఒక శిఖరంపైకి పరుగులెత్తించాయి. జరుగుతున్నదేమిటో తెలియని దేవరవారు తానొక పుష్పక విమానంపై విహరిస్తున్నట్లు ఆ వేగానికి మైమరచిపోయారు. రథం మరింత ఎత్తుకు పోతూనే వుంది. యాత్రకు ముగింపు ఎక్కడో?!

# చట్టాలు, రక్షణలు ఉన్నా(?!..) ఆగని సఫాయి కార్మికుల మరణాలు

**భూగర్భ** మురుగునీటి కాల్వలు, మ్యాన్‌హోళ్ళను శుభ్రం చేసే కార్మికుల అమానవీయ పని పరిస్థితులకు అద్దంపడుతూ ఇటీవల వరుసగా సఫాయి కార్మికుల మరణాలు సంభవిస్తున్నాయి. మార్చి 22 నుండి ఏప్రిల్ 26, 2023 మధ్య గుజరాత్‌లో 8 మంది సఫాయి కార్మికులు మరణించారు. మార్చి 22న రాజ్‌కోట్‌లో ఇద్దరు, ఏప్రిల్ 3న దహేజ్‌లో ముగ్గురు, ఏప్రిల్ 23న ధోల్కాలో ఇద్దరు, ఏప్రిల్ 26న ధరాడ్‌లో మరొకరు సఫాయి కార్మికులు మరణించారు. ఈ మరణాలన్నీ సఫాయి కార్మికులు కనీసం మాస్కులు, గ్లౌజులు వంటి రక్షణ పరికరాలు సైతం లేకుండా భూగర్భ మురుగు కాల్వలలోకి దిగి శుభ్రం చేసేటప్పుడు విషవాయువుకు ఊపిరాడక సంభవించినవే. ఆయా సంఘటనల అనంతరం ఒక్క దహేజ్ సంఘటన తర్వాత పోలీసులు సఫాయి కార్మికులను సప్లయి చేసిన ప్రయివేటు కాంట్రాక్టరుపై కేసు పెట్టారు. మిగిలిన అన్ని సంఘటనలూ యాక్సిడెంటు కేసులుగానే నమోదు చేయబడ్డాయి. అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భ మురుగు కాల్వలలో పనిచేసేటప్పుడు కార్మికుడెవరైనా మరణిస్తే తక్షణమే వారి కుటుంబానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి. కానీ ఆ కార్మికుల మరణానంతరం యాక్సిడెంటు కేసులు నమోదు చేస్తూ నష్టపరిహారం దక్కకుండా ఎగవేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఈ ఎనిమిది మంది సఫాయి కార్మికుల మరణాలకు ముందర, గడిచిన రెండేళ్ళలో 11 మంది సఫాయి కార్మికులు మరణించారని ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ప్రకటించింది. కాగా ఈ ప్రకటనతో తీవ్రంగా విభేదిస్తూ సఫాయి కార్మిక హక్కుల ఉద్యమకారులు, దళిత ఉద్యమకారులూ గుజరాత్ రాష్ట్రంలో భూగర్భ మురుగు కాల్వలు, మ్యాన్‌హోళ్ళ పనులలో 150 మందికి పైగా మరణించారని అంటున్నారు. ఈ మరణించినవారంతా ప్రధానంగా దళితులు, గిరిజనులూనని, ఇంకా ఒక మైనారిటీ వ్యక్తి కూడా మరణించాడని అంటున్నారు. ఏ దేశంలోనూ లేనివిధంగా మనదేశంలో పారిశుద్ధ్య పని, కులంతో బలంగా ముడిపడి ఉంది. కొన్ని దళిత ఉపకులాలవారు అచ్చంగా ఈ పనికే కేటాయించబడుతూ ఉన్న అమానవీయ వ్యవస్థ మనది. కాగా కమ్యూనిస్టు ఉద్యమకారులు వీరిని అక్కున చేర్చుకుని పోరుబాటలో సమీకృతుల్ని చేసిన చరిత్ర కూడా మనకున్నది. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి బనారస్ హిందూ యూనివర్శిటీ విద్యార్థిగా ఉన్నప్పుడే సఫాయి కార్మికులను ఆర్గనైజ్ చేశారు. 1990లలో బెజవాడ విల్సన్ నేతృత్వాన దేశవ్యాప్తంగా చేపట్టిన సఫాయి కర్మచారీ ఆందోళన్ మొదలైన ఉద్యమాల కారణంగా ప్రభుత్వానికి 1993లో ఎంప్లాయిమెంట్ ఆఫ్ మాన్యువల్ స్కావెంజర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ డ్రై లెట్రిన్స్ (ప్రొహిబిషన్) యాక్ట్ వంటి చట్టాలు చేయవలసి వచ్చింది. దీనికి కొనసాగింపుగా 2013లోనూ, 2020లో సైతం చట్టాలంటూ చేసినా, వాటి అమలుకోసం ప్రభుత్వాల చిత్తశుద్ధిని, అతిక్రమించినవారిపై తీసుకున్న చర్యలను చూసినప్పుడు, చట్టాలు పారిశుద్ధ్య కార్మికుల జీవితాలలో తెచ్చిన మార్పు నేతిబీరలో నెయ్యి చందమేననే విషయం తేటతెల్లమౌతుంది.




**'ప్రమిద' ఒక భిన్నమైన మాసపత్రిక. సంచిక 76; మే 2022 – నవంబర్ 2022**

గత 42 సంవత్సరాల నుండి బులుసు వెంకట కామేశ్వరరావు అన్నీ తానే అయి, ప్రతి నెలా కాకపోయినా, అప్పుడప్పుడూ ప్రచురిస్తున్న పత్రిక ఇది. సాహిత్యం, సంస్కృతి, ఆధ్యాత్మికంకు చెందిన వ్యాసాలతో, కవితలతో వెలువడుతోంది. ఈ 76వ సంచికను 192 పుటలు (1/8 డెమ్మీ సైజులో)తో ప్రసిద్ధ కవి, సాహితీవేత్త, అధ్యాపకుడు రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచికగా రూపొందించారు.

ఈ సంచికను సమీక్షించడమంటే రావి రంగారావు సాహితీ ప్రస్థానాన్ని సమీక్షించడమే. మినీ కవితా పితామహునిగా గుర్తింపబడిన ఆచార్యుడు, కవి రావి రంగారావు 1952 జులై 10న గుంటూరు దగ్గర అనంతవరప్పాడు గ్రామంలో జన్మించారు. అనంతవరప్పాడు, పాత గుంటూరు యాదవ పాఠశాల విద్య తర్వాత గుంటూరు హిందూ కళాశాల, ఆంధ్రా లూథరన్ కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్‌లలో చదివారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల నుండి పరిశోధన డిగ్రీలు సాధించారు. మొదట్లో టెలిగ్రాఫిస్టుగా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత మచిలీపట్టణం ఆంధ్ర జాతీయ బోధనా కళాశాలలో అధ్యాపకునిగా 28 సంవత్సరాలు చేసి ప్రిన్సిపల్‌గా రిటైరయ్యారు. విద్యావేత్తగా జాతీయ అవార్డు ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులేగాక ఎన్నో సాహితీసంస్థల పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం గుంటూరులో స్థిరపడి, అమరావతి సాహితీ మిత్రులనే సంస్థ ద్వారా నెలనెలా సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రావి రంగారావు సాహిత్య పీఠం ద్వారా ప్రతి యేడాదీ జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్నారు.

ఈ సాహిత్య స్వర్ణోత్సవ సంచికలో వివిధ పత్రికలలో రావి రంగారావు రాసిన దాదాపు 40 రచనలపై 60 మంది రచయితలు రాసిన సమీక్షా వ్యాసాలు 66 దాకా వున్నాయి. ఈ రచయితలో ఆర్.యస్. సుదర్శనం, సినారె, ఇనాక్, శివారెడ్డి, రాచపాళెం, గోపి నుంచి బీరం సుందరరావు, రావెల సాంబశివరావు, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, ద్వానా శాస్త్రి, అబ్దుల్ రజా హుసేన్, మాకినీడి సూర్యభాస్కర్ వరకు వున్నారు.

మినీ కవిత్వం ఒక ఉద్యమంగా సాగిన తొలికాలంలో జి.వి. పూర్ణచంద్, కొల్లూరి, ఆసు రాజేంద్ర, అలిశెట్టి ప్రభాకర్ మొదలగువారు విశేష కృషి చేశారు. కొల్లూరి, అమలాపురం నుండి 'మినీ కవితా విప్లవం' అనే సంకలనాన్ని ప్రచురించారు. పూర్ణచంద్ మినీ కవిత్వ చార్టులను పలు ప్రాంతాల్లో ప్రదర్శించారు. రావి రంగారావు మినీ కవితకు ఒక సిద్ధాంత భూమిక ఏర్పాటు చేశారు. తన ఎం.ఫిల్ డిగ్రీ కొరకు 'మినీ కవిత – విద్యా విలువలు' అనే సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. తన డాక్టరేట్ డిగ్రీ కోసం "పిల్లలలో మినీ కవిత్వ రచనా నైపుణ్యాలు" అనే అపూర్వమైన సిద్ధాంత వ్యాసాన్ని రాసి పి.హెచ్‌డి సాధించారు. అంతేకాదు హైస్కూళ్ళలో, కళాశాలల్లో మినీ కవితపై ఉపన్యాసాలిస్తూ, ఆయా సభల్లో పిల్లలతో కవిత్వాలు ఆశువుగా చెప్పించారు.

మినీ కవిత కేవలం చమత్కారంతో ఒక భావం చెప్పడమేగాక, అది సామాజిక రుగ్మతలపై పోరాటం చేసే దానిలా వుండాలన్నారు. 'మినీ కవిత 2006', 'మినీ కవిత 2007' సంపుటాల ద్వారా సుమారు 400 మంది కవుల 1000 కవితలను అందించారు. పాతికేళ్ళ కాలంలో వచ్చిన మినీ కవితలను ఎన్నిక చేసి 'వెయ్యి నూటపదహార్లు' అనే సంకలనాన్ని ప్రచురించారు.

రావి రంగారావు ఛందోబద్ధ కవిత్వం ఆటవెలదిలో శతకం రచించారు. వచన కవితలూ రాశారు. 'కిరణాలు' అనే పేరుతో నానీలలాగా అక్షర నియమం లేకుండా పదనియమంతో కొత్త లఘురూప కవితా ప్రక్రియలో 2017లో 'రావి కిరణాలు', 2019లో 'ప్రభారవి' కిరణాలు ప్రచురించారు. మినీ కవితపై వివిధ పత్రికలలో రాసిన వ్యాసాలను 'వచన కవితోదయం'గా విడుదల చేశారు.

మచిలీపట్టణంలో 'సాహితీ మిత్రులు' అనే సంస్థ స్థాపించి వివిధ సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. 'అవినీతి వ్యతిరేక రచయితల సంఘా'న్ని ప్రారంభించారు. ప్రతి యేడాదీ జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవంనాడు అవినీతిపై కవితల పోటీ నిర్వహిస్తున్నారు. బాలలకు పనికివచ్చే రైమ్స్ రాశారు. సరళమైన భాషలో, ఉన్నత భావాలను తన కవితలలో చెప్పారు. ప్రయోగమనేది ప్రయోజనంతో కూడి వుండాలన్నది రంగారావు సాహిత్యం ఋజువు చేస్తుంది.

చివరగా ఆయన లఘు కవితతో ముగిద్దాం.

"చెప్పాల్సింది చెప్పకపోతే నాలుక కాదు
రాయాల్సింది రాయకపోతే కలం కాదు
చూడాల్సింది చూడకపోతే కళ్ళు కావు
అది ఉరిమి లేచే నిప్పురవ్వలు కావాలి"

(ప్రమిద – 101, వసుంధర ఎన్‌క్లేవ్, నారాయణపురం, ఈడేపల్లి, మచిలీపట్నం – 521001. ఫోన్ : 9885459193. ఈ సంచిక వెల : రూ. 50/– సంవత్సర చందా : రూ. 150/–)

**శ్రీశ్రీ సాహిత్యనిధి వారి కొత్త విడుదలలు : 141 నుండి 150 వరకు**

శ్రీశ్రీ రచనలూ, శ్రీశ్రీపై రచనలతో రెండో నూరు పుస్తకాల హోరులో ఇప్పుడు 141 నుండి 150 వరకు 10 పుస్తకాలు వెలువడ్డాయి. వాటి వివరాలు క్లుప్తంగా : (141) మరో మూడు యాభయిలు, 16

పుటలు. వెల : రూ.15/- (142) అనితర సాధ్యం శ్రీశ్రీ మార్గం : శ్రీశ్రీపై కె.వి.ఆర్. రాసిన 13 వ్యాసాలు. 80 పుటలు. వెల : రూ. 100/-; (143) శ్రీశ్రీ - ఆధునిక విమర్శకుడు. త్రిపురనేని మధుసూదనరావు శ్రీశ్రీపై రాసిన ఆరు రచనలు. 48 పుటలు. వెల : రూ.65/- (144) శ్రీశ్రీ గ్రంథ పీఠికలు. శ్రీశ్రీ ఆరు రచనలకు పురిపండా, చలం, పురాణం, యస్.పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల, సరోజా, శ్రీశ్రీ, యం.వి. రాయుడు రాసిన పీఠికలు. 40 పుటలు, వెల : రూ.50/- (145) జరుక్ శాస్త్రి. జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిపై శ్రీశ్రీ పది రచనలు - 32 పుటలు. వెల : రూ. 40/-; (146) 'శ్రీశ్రీ అనంతం'పై కలవకొలను రాంమోహనరాజు రాసిన వ్యాసం. పుటలు : 16, వెల : రూ.15/- (147) సాహిత్య సమవాకారం - తెన్నేటి సూరి రాసిన నాటిక, నీ కవిని బ్రతికించుకోరా - గేయం; 'మహాప్రస్థానం' గ్రంథ సమీక్ష. 40 పుటలు. వెల : రూ.50/- (148) శ్రీశ్రీ జీవితం - సాహిత్యం. కడియాల రామమోహనరాయ్ రాసిన ఆరు వ్యాసాలు. పుటలు : 32. వెల : రూ.40/- (149) అంతర్యుద్ధం - శ్రీశ్రీ ఒక పాత్రగా వున్న ఆత్రేయ నాటకం; 'సత్యానికి సంకెళ్ళు' చిత్రానికి శ్రీశ్రీతో కలసి ఆత్రేయ రాసిన పాట - పుటలు : 32. వెల : రూ.40/- (150) చేరాత - చేకూరి రామారావు శ్రీశ్రీపై రాసిన 11 రచనలు. పుటలు : 56. వెల : రూ.65/-

ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్యనిధి. 305 ప్రగతి టవర్స్, వీరయ్యవీధి, మారుతీనగర్, విజయవాడ - 520004. ఫోన్ : వాట్సాప్ నం. : 92462 77375. email : srisri_sahityanidhi@gmail.com

**దర్పణం : నాటకం దృశ్య కావ్యానందం.**

గుంటూరు కళాపరిషత్ వారి రజతోత్సవ ప్రత్యేక సంచిక - 1997-2022. సంపాదకులు. వల్లూరు శివప్రసాద్ సహసంపాదకులు. వల్లూరు తాండవ కృష్ణ.

1997లో ప్రారంభమైన గుంటూరు కళాపరిషత్తువారు గతంలో 'దృశ్యం' అనే శీర్షికతో పదేళ్ళ ప్రత్యేక సంచిక ప్రచురించారు. నాటక ప్రక్రియపై, ప్రదర్శనపై అభిరుచి కల్గినవారందరికీ అదొక విలువైన కానుక. అటువంటి విలువైన కానుకే ఈ 'దర్పణం'. ఈ పరిషత్తువారు ఖచ్చితంగా సమయపాలన పాటించడంలో ఆంధ్ర ప్రజానాట్యమండలి వారసత్వం స్వీకరించారు. నాటక, నాటిక పోటీలు మొదట్లో నిర్వహించినా 2006 నుండీ నాటకోత్సవాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. నాటక ప్రదర్శనలేగాక, సదస్సులు, గోష్ఠులు నిర్వహిస్తున్నారు. బాలల నాటికలకు; చారిత్రక పౌరాణిక పద్య నాటకాలకు స్థానమిచ్చారు. బాలబాలికలకు కళారూపాలపై వేసవి శిక్షణా శిబిరాలు 2018, 2019లలో నిర్వహించారు. 2022లో రజతోత్సవ కార్యక్రమాలు నాల్గురోజులపాటు జరిపారు. 25 ఏళ్ళుగా గుంటూరు కళాపరిషత్ చేసిన కార్యక్రమాల విశేషాలతోపాటు, వివిధ రచనలు, వ్యాసాలతో ఈ రజతోత్సవ ప్రత్యేక సంచికను వెలువరించారు.

దీనిలో వ్యాసాలు పాత, కొత్తల మేలు కలయికగా వున్నాయి. ఈ తరంవారికి తేలిగ్గా దొరకని బందారు రామస్వామి (నాటక రంగంలో గుంటూరు పాత్ర : విశిష్టత - గుంటూరు పత్రిక - శుభకృతు ఉగాది సంచిక - 25 పుటలు); తిరుమల రామచంద్ర (తెలుగునాట తొలి నాటకం క్రీడాభిరామం); డా॥ పి.యస్.ఆర్. అప్పారావు (తెలుగులో పౌరాణిక నాటకాలు); ఆచార్య దివాకర వెంకటావధాని (కన్యాశుల్కం - అనన్య సామాన్యం); పాతూరి శ్రీరామశాస్త్రి (పద్య ప్రధాన నాటకాలు) కూర్మా వేణుగోపాలస్వామి (తెలుగు నాటకరంగం) మొదలగు విశిష్ట వ్యాసాలతోపాటు ఈ తరానికి చెందిన డా॥ వి.ఆర్. రాసాని, డా॥ మీగడ రామలింగస్వామి, వాడ్రేవు సుందర్రావు, డా॥ కందిమళ్ళ సాంబశివరావు, వల్లూరు శివప్రసాద్, డా॥ మధురాంతకం నరేంద్ర, మలిరెడ్డి బాబి, భాస్కరచన్ద్ర మొదలగువారు రాసిన వ్యాసాలున్నాయి. విశ్వనాథ కవిరాజు రాసిన నాటకం 'నాటిక నేడు', ఒక పాట, బండ్ల మాధవరావు 'నాటకాంతం' అనే వచన కవిత, నాటకరంగం కథావస్తువుగా పాపినేని శివశంకర్ కథ 'సందడి', పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన స్కెచ్ 'కల్లుకుండల బాగోతం' ఈ సంకలనానికి మరింత విలువ చేకూర్చాయి.

గత తరాలకు చెందిన అనేక ప్రజాకళారూపాలు చారిత్రక గమనంలో అదృశ్యమయ్యాయి. ప్రస్తుతం వాటికి సంబంధించిన అవశేషాలు మాత్రమే మనకు లభ్యమౌతున్నాయి. అలాగే సాంఘిక నాటకాలు, పద్య నాటకాలు మన కళ్ళముందే తెరమరుగయ్యాయి. ఏవో కొన్ని పరిషత్తులవల్లా, నంది నాటకోత్సవాల వల్ల వాటిని ఈ తరంవారు చూడగల్గుతున్నారు. వీధి నాటిక ప్రక్రియ నాటకాన్ని రోడ్ల మీదకు తెచ్చింది. ప్రస్తుతం ఇదొక్కటే ప్రజలకు చేరువుగా వుంది.

ఈనాటి సైబర్‌తరం వారిలో సామాజిక చైతన్యమూ, ప్రయోజనకరమైన వినోదమూ అందించడానికి లఘు చలనచిత్రాలూ, యూట్యూబ్‌లో రూపొందించాల్సిన అవసరం కనబడ్తోంది. ఇప్పుడు యూట్యూబ్ ఛానల్స్‌లో వస్తున్న లఘు చిత్రాలలో వెకిలి హాస్యం, ప్రయోజన రాహిత్యం కనబడ్తున్నాయి. ప్రేక్షకులను విజ్ఞానవంతం చేసే లఘుచిత్రాల నిర్మాణం ఒక ఉద్యమంగా సాగి, వాటిని ఎల్.సి.డి. ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించడమనేది భవిష్యత్తులో ఊపు అందు కుంటుందేమో చూడాలి.

ఇంకా ఈ విశిష్ట గ్రంథమైన 'దర్పణం'లో 30 పుటలలో గుంటూరు కళాపరిషత్తులో 25 సంవత్సరాలపాటు ప్రదర్శించిన నాటకాల వివరాలు, సభల వివరాలు ఇచ్చారు. 13 పేజీలలో సందేశాలు, చివర్లో 36 రంగుల పుటలలో ఆర్ట్ పేపర్‌పై కళాపరిషత్తుకు చెందిన వివిధ ఫొటోలు పొందుపరిచారు.

1/4 క్రౌన్ సైజులో హార్డ్ బౌండ్‌లో 300 పుటలు పైగా గల ఈ 'దర్పణం' వెల : రూ. 200/- ప్రతులకు : బి. పూర్ణ, గుంటూరు కళాపరిషత్తు, 10-1-9, మొదటి లైను, సాంబశివపేట, గుంటూరు - 522001. ఫోన్ : 89190 14999.

# దళిత చరిత్ర మాసం (Dalit History Month)

**ఫ్రెడరిక్** డగ్లస్, అబ్రహాం లింకన్ల జయంతి (ఫిబ్రవరి 12, 14) సందర్భంగా 'నల్లజాతివారి (ఆఫ్రికన్ – అమెరికన్) నెలగా ఫిబ్రవరిని ప్రకటించారు. ఆ నెల అంతా ఆఫ్రికన్ – అమెరికన్లు చేసిన పోరాటాలు, ఫలితాలు తెలియచేసే కార్యక్రమాలు చేస్తుంటారు. దీనిని అమెరికా, కెనడా, ఐర్లండ్, ఇంగ్లండ్ గుర్తించాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో అక్టోబరు నెలను నల్లజాతివారి నెలగా జరుపుకుంటారు. దీని ఉత్తేజంతో 2015లో చికాగోలో జరిగిన 'కలర్ ఆఫ వయొలెన్స్' (హింసకు గల రంగు) సమ్మేళనం సందర్భంగా 'దళిత చరిత్ర మాసం' ఏప్రిల్‌గా (అంబేద్కర్ జయంతి 14వ తేది) నిర్ణయించారు. ఆ సదస్సుకు హాజరైన సంఘపాలి అరుణ, తెన్‌మొళి సౌందరరాజన్‌ల ఆలోచనల నుండి ఇది జన్మించింది. క్రిస్టినా ధన్‌రాజ్, మారీ జ్యక్ మైత్రేయి, అలీ కొత్వాల్, మనీషాదేవి, పై ఇద్దరితో కలిసిన మహిళాబృందం 2015న దీనిని ప్రకటించింది.

దళిత నాయకుల జీవితాలు, కృషి; చరిత్రలో దళితుల పాత్ర; వారు చేసిన పోరాటాలు – సాధించిన విజయాలు; దళితుల జ్ఞాపకాలు, అనుభవించిన విషాదాలు, ఆందోళనలు వివిధ రూపాలలో తెలియచేసే నెలగా దీనిని పాటిస్తున్నారు. దళిత కుటుంబాల సమ్మేళనాలు, వారి పాటలు, ఆటలు, నృత్యాలు, ఊరేగింపులు, చర్చలు, మొక్కలు నాటడం, దళిత చరిత్రకు సంబంధించిన ప్రదేశాలకు యాత్రలు మొదలగునవన్నీ ఈ కార్యక్రమంలో అంశాలు. అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను జ్ఞాపకం చేసుకోవడం (సభలు, సమావేశాలు, సెమినార్ల ద్వారా) ఒక ముఖ్య కార్యక్రమం.

ఈ సందర్భంగా కొందరు దళిత చిత్రకారులను, మరికొందరు దళిత రచయితలను గుర్తుచేసుకుందాం.

1. దళిత పులుల (Dalit Panthers) ఉద్యమాన్ని ఒక కళాకృతిగా చిత్రించిన చిత్ర కళాకారుడు రాహి పుణ్యశ్లోక (ఆర్టిస్ట్). అది 1972లో మహారాష్ట్రలో ముంబాయి కేంద్రంగా వెల్లువెత్తిన దళిత రచయితల ఉద్యమం.

2. ఒషీన్ శివ చిత్రించిన పోస్టర్. దీనిలో జ్యోతి బాపూలే, డా॥ అంబేద్కర్, సావిత్రీబాయి పూలే, అన్నైమీనాంబళ్, శివరాజ్ పెరియార్, పి.కె. రోజీలను చిత్రించారు.

3. శ్రీ వంశీ మట్టా అంబేద్కర్ చరిత్రాత్మక రచన 'కుల నిర్మూలన' పుస్తకంపై చిత్రాన్ని గీశారు.

4. విసీత్, గేదం జ్యోతి బాపూలే చిత్రం గీశారు.

5. సిద్దేశ్ గౌతమ్ – 7 నవంబర్ విద్యార్థుల రోజు (అంబేద్కర్ పాఠశాలలో ప్రవేశించిన రోజు) సందర్భంగా తరగతి గది బయట కూర్చుని పాఠాలు వింటున్న అంబేద్కర్‌ను చిత్రించారు.

ఈ నెలలోనే 14వ తేదీన బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్లో ఉదయం 9:30 నుండి 11 వరకు ఒక హాస్యనాటిక 'అస్పృశ్యుడు' (untouchable)ను ప్రసిద్ధ హాస్యనటుడు మన్‌జీత్ సర్కార్ ప్రదర్శించారు.

ఇక ఈ నెలలో ప్రముఖంగా జ్ఞాపకం చేసుకున్న రచయితలు ఎవరంటే....

**1. బామ ఫాస్టినా సుసాయిరాజ్** – తమిళ వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించిన దళిత స్త్రీవాద టీచర్. కేథలిక్ సంస్థలలో కుల వివక్ష విషయంగా తన అనుభవాలతో కూడిన గ్రంథం 'కరుక్కు' రాశారు. అది రాసినందుకు ఆమెను ఏడు నెలలపాటు ఊరిలోకి రానీయలేదు.

ఆ పుస్తకానికి 2000లో క్రాస్‌వర్డ్ బుక్ అవార్డ్ వచ్చింది. 'వన్మామ్' (ప్రతీకారం); 'సంగతి'; 'కిస్సాంబుకారన్' (అల్లరివాడు) ఆమె ఇతర రచనలు.

**2. నామదేవ ధసాల్** – 1972లో బొంబాయి కేంద్రంగా సాగిన దళిత్ పాంథర్ల (రచయితల) ఉద్యమ స్థాపకులలో ఒకరు. 1972లో 'గోల్పితా' కవితాసంపుటి ప్రచురించారు. పద్మశ్రీ గ్రహీత.

**3. మీనాకందస్వామి** – దళిత జీవన వాస్తవాలను చిత్రించిన కవిత్వం రచించారు. వీరి కవితలు 18 భాషలలోకి అనువదింపబడ్డాయి. 'ది జిప్సీ గాడెస్' నవల రచించారు.

**4. బేబితాయ్ కాంబ్లే** – మహార్ కులానికి చెందిన ఈమె దళిత హక్కుల కార్యకర్త. 'జినా అమౌచ' (ది ప్రిజన్ వుయ్ బ్రోక్) వీరి స్వీయచరిత్ర.

వీరుగాక బాబూరావు బగుల్, ఊర్మిళా పవర్, ముల్క్‌రాజ్ ఆనంద్, పెరియార్ ఇ.వి. రామస్వామి, జ్యోతిరావు గోవిందరావు పూలే, మనోరంజన్ వ్యాపారి, రాజాధలే, పి. శివకామి, విజిలా చరప్పాడ్ మొదలగు రచయితలను ఈ నెలలో జ్ఞాపకం చేసుకున్నారు.

PRAJA SAAHITI June 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



పుట్టా పెంచల్‌దాస్ బాతిక్ ఆర్ట్

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI